# ధర్మం కోసం పోరాటం

బోయి భీమన్న

మొదటి ముద్రణ : 1968
రెండవ ముద్రణ : 1969
మూడవ ముద్రణ : 1970
నాల్గవ ముద్రణ : 1992

ముఖ పత్రం : తోపారపు గంగాధర్

హక్కులు : రచయితవి

మూల్యం : రూ. 25/-

ప్రతులకు :

1. **విశాలాంధ్ర బుక్ హౌస్**
బ్యాంక్ స్ట్రీట్,
అబిడ్స్, హైదరాబాద్ - 500 001.

2. **భీమన్న సాహితీ నిధి**
ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాద్ - 500 482.

ముద్రణ : **ప్లానోగ్రాఫర్స్**, అబిడ్స్, హైద్రాబాద్ - 500 001



కృతి భర్త



# ధర్మం కోసం పోరాటం

## అంకితం

డాక్టరు అంబేద్కరుకు

జయ జయ జయ అంబేద్కర !
జయ దళిత జన స్వరా !
జయ మానవ మందారా !
జయ భారత భాస్కరా !

నవ భారత సంవిధాన
ధర్మ పథక నిర్మాతా !
భువి సమస్త పీడిత జన
దుఃఖశాంతి తథాగతా !

వేదాలను శోధించి
వేదాంతము నధిగమించి
మనిషి మనిషిగా బ్రతుకుటె
మహిత మన్న మహాశయా !

అస్పృశ్యత రూపు మాపి,
అగ్ర అంత్య భేద ముడిపి,
నిష్కల భారత జాతికి
నీడయైన బోధి ప్రియ !

జాతీయ సమైక్యానికి
మతాతీత రాజ్యానికి
ప్రజాస్వామ్య ధర్మానికి
శరణమైన సంఘర్షీ !

జగతికి స్వేచ్ఛా సమతా
సౌభ్రాత్రములను కూర్పగ
జన్మమెల్ల పోరాడిన
జనగణ విప్లవ యోద్ధా !

అంధకారమున పుట్టి
అవనికి దీపము పెట్టి
పంకమును మధించి మహికి
పరిమళ మొసగిన సూరీ !

రాళ్ళకు జీవము పోసి,
మ్రోళ్ళను చిగురింప జేసి,
మట్టి నుండి మానవులను
మలిచిన కారణ జన్మా !



కృతి కర్త

# భీమ సేన

1967లో కర్నూలులో సంజీవయ్య గారి ఓటమిని స్వయంగా చూసిన తర్వాత, నేను ఒక నెలరోజులపాటు మరికొన్ని జిల్లాలలో పర్యటించి వచ్చి, హైదరాబాదులో కూర్చొని, ఒక పదిహేను రోజులలో వ్రాసి ముగించిన జీవగ్రంథం.ఈ ధర్మం కోసం పోరాటం. గుండె పగిలే దృశ్యాలను చూచినప్పటి మనస్సు రగిలే వేదనాపూరిత భావాలను ఇందులో పొందు పరచాను. నా వేదనను, ఉపశమన మార్గాన్నీ ప్రజలందరితోను పంచుకోవడం కోసం వెనువెంటనే ముద్రించాను, ప్రకటించాను.

Educate అన్న అంబేద్కరు అన్నమాటకు అర్థం ప్రజలకు అక్షరాలు నేర్పమని కాదు. Awareness అంటే అవగాహన కలిగించ మని.

మన మెవరం? ఎందుకిలా బాధ పడుతున్నాం? ఈ బాధలను తొలగించుకొనే మార్గం ఏమిటి? ఈ మూడు ప్రశ్నలకు జవాబులను ప్రజలకు వివరించవలసి ఉంది. అలా వివరించడానికే అంబేద్కరు అస్పృశ్యులెవరు? అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈ అస్పృశ్య లనబడే వాళ్లంతా Broken People అయి ఉంటా రన్నా డాయన. ఈ Broken అనే ఇంగ్లీషు మాటకే దళిత అనే సంస్కృత పదాన్ని వాడుతున్నాం ఇప్పుడు. అంబేద్కరుది చారిత్రక దృక్పథం. వాస్తవాన్ని పరిశోధన ద్వారా తెలుసుకొనేది.

నాది చిన్నప్పటినుంచీ కూడ పౌరాణిక దృక్పథం. వేదాలు, కావ్యాలు, పురాణాలు వగైరాలతో కూడిన సాహిత్యాన్ని పరిశోధించి మన మెవరమో తెలుసుకొన్న జ్ఞానం – మనం దళితులం కావచ్చు, కాకపోవచ్చు. కాని భారత జాతీయుల మనడం మాత్రం తథ్యం. వట్టి భారత జాతీయులం మాత్రమే కాదు. భారతీయత (Indianism) అనే దానికి, భారతీయ సంస్కృతికి, భారతీయ సాహిత్యానికి, భారతీయ వేదాంత దర్శనానికి కూడ మనమే మూల పురుషులం, మూల ఋషులం. ఇది మన చరిత్రను గురించిన నా పరిశోధనా ఫలితం.

మనం అంటే మాలమాదిగలం.

''మాలమాదిగ యువకుల్లారా ఏకం కండి!'' అనే నినాదం ఈ గ్రంథానికి కేంద్ర బిందువు. ఎందుకు ఏకం కావాలి? ఎలా ఏకం కావాలి? శతాధిక కులాలతో విచ్ఛిన్నమైపోయి ఉన్న భారత జాతిని ఎలా సంఘటిత పరచాలి? అనే విషయాలు ఈ కేంద్ర బిందువు చుట్టూ అల్లుకొని వున్నై.

అంటే Educate అని అంబేడ్కరు ఇచ్చిన పిలుపును నేను అంతకు ముందేనాడో అందుకొని, నా రచనల ద్వారా ఆచరిస్తున్నా ననుకోవచ్చు. నిజంగా చెయ్యవలసిందిది. ఈ ధర్మంకోసం పోరాటాన్ని ఎంతమంది చదివి అవగాహన చేసుకొన్నారో తెలియదు. అనేక వేల ప్రతులు మాత్రం ప్రజల చేతుల్లోకి వెళ్లాయి. ప్రజలు మేల్కొంటున్నా రనేది కూడ వాస్తవంగా కనిపిస్తున్నదే. నా కృషి వృథా కాలేదు. సంతోషం.

దీనిని ''దళిత్ కైపిడి'' అనే పేరుతో కన్నడంలోకి అనువదించుకొన్నారు.

'నేను హరిజనుల గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు, హరిజనుల కోసం ఏదైనా మంచి చెయ్యవలసి వచ్చినప్పుడు కొంచెం భయపడేవాణ్ని - స్వకుల పక్షపాతి అంటారేమోనని. ఈ "ధర్మం కోసం పోరాటం'' చదివిన తర్వాత ఇప్పుడు నాకు కొండంత ధైర్యం వచ్చింది. ఈ దీనులకు నేనే చెయ్యకపోతే మరింక ఎవళ్లు చేస్తారు? అనే ఆలోచన కలిగింది. ఈ గ్రంథాన్ని ఇప్పటికి నాలుగుసార్లు చదివాను. ఐదవసారి చదువుతున్నాను. దీనిని ఇంగ్లీషులోకి, హిందీలోకి అనువదింపజేస్తాను'' అన్నారు దామోదరం సంజీవయ్యగారు - తెనాలిలో జరిగిన ఒక సెమినారులో మాట్లాడుతూ.

అంతకు కొన్ని రోజుల ముందే ఈ గ్రంథం ఆయన అధ్యక్షత క్రిందే ఆవిష్కరించబడింది. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు అద్భుతమైన ఉపన్యాసం చేశారు - ఆ ఆవిష్కరణ సభలో. ఈ సంగతులన్నీ శ్రీమతి హైమవతి వ్రాసిన ''పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న'' అనే నా జీవితచరిత్రలో వివరించబడి వున్నవి.

భారతీయ సమాజాన్ని, ముఖ్యంగా ఈ దేశంలో మెజారిటీ ప్రజలకు చెందిన హైందవ సమాజాన్ని, సంస్కరించి ఒక బలమైన జాతిగా తీర్చి దిద్దడానికి

ఈ గ్రంథంలో ఒక విశిష్టమైన ప్రణాళికను ఇచ్చాను. దానిని అమలుపరచడం కోసం ఒక పటిష్ఠమైన యువజన సంస్థకు కూడా రూపకల్పన చేశాను. అదే భీమసేన. దానిని నేను వాస్తవంగా 1968లో స్వయంగా నెలకొల్పాను. ఈ గ్రంథం వ్రాసే నాటికి ఆ సంస్థ పని చేస్తూ వుంది.

డా. భీమ్‌రావ్ అంబేడ్కర్ పేరు మీద నాచే నెలకొల్పబడిన సంస్థ భీమసేన. ఈనాటి దళిత ఉద్యమాలు ఈ సేనను పునరుజ్జీవింప చేసి నడపవచ్చు.

ఇప్పుడిది నాల్గవ ముద్రణ. మొదటి మూడు ముద్రణలూ తొలి ముద్రణ తర్వాత మూడేళ్లలోనే జరిగాయి. మూడవ ముద్రణ 1970లో జరిగింది. ఆ తర్వాత రెండేళ్లలోనే ప్రతులన్నీ అయిపోయినై. 1972-92 మధ్యలో 20 సంవత్సరాలపాటు ఎప్పటి కప్పుడు కొత్త రచనలను ప్రకటించుకోవడంతోనే కాలం గడిచిపోతున్నది. పునర్ముద్రణలకు అవకాశం చిక్కకుండా ఉంటున్నది. ఇప్పుడు దీనిని ప్రజల ముందుకు తెస్తున్నాను. దీనిని కావాలంటున్న వారి సంఖ్య అధికాధికంగా వుంది.

ఈ నాలుగవ ముద్రణ విషయంలో నాతో సహకరించిన వారందరికీ, ముఖ్యంగా శ్రీ పి. కమలేశ్వరరావు ఐ.ఏ.ఎస్. గారికీ, శ్రీ ఎమ్.ఎన్. భూషిగారికి, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్ గారికీ, శ్రీ బి. వేదయ్యగారికీ, ప్లానోగ్రాఫర్స్ ప్రెస్ ప్రొప్రయిటర్స్ పి. సుబ్బయ్య, మురళి గారలకు నేను కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాను.

ఈ గ్రంథాన్ని ప్రధానంగా హిందీలోకీ, ఇంగ్లీషులోకీ అనువదింప చేస్తానని ప్రకటించిన సంజీవయ్యగారి మాట కార్యరూపం ధరించనే లేదు. అయితే, ఆ తర్వాత ఇంగ్లీషులోకి అనువదించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అందులో మొట్టమొదటగా ప్రయత్నించిన వారు శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి, ఐ.ఎ.ఎస్. గారు. ఆ తరువాత కొంత కాలానికి శ్రీ కె. మాధవ రావు ఐ.ఎ.ఎస్. గారు అనువదించారు కాని ఫైనలైజ్ చెయ్యలేదు. వారున్న పదవుల కార్యభారాలు అలాంటివి. ఈ గ్రంథం ప్రధానంగా హిందీలోకి అనువదించబడాలి. అది భాషా సాహిత్యాల పరంగా వ్యుత్పన్నులైన యువకులు దళిత వర్గాల నుంచి ఉద్భవించి నప్పుడు మాత్రమే సాధ్యం కాగలదేమో!

నేను తొలిముద్రణకు, తరువాత రెండు ముద్రణలకూ వ్రాసిన పీఠికల నుంచి కొన్ని వాక్యాలను క్రింద ఇస్తున్నాను.

**మొదటి ముద్రణ పీఠిక నుంచి**

బహుజన హితాయ !

బహుజన సుఖాయ !

భారతదేశంలోని హరిజన సమస్యను అమెరికాలోని నీగ్రో సమస్యతో పోల్చడం ఈ రోజుల్లో పరిపాటి అయింది. అది సమంజసం కాదు. రెండు సమస్యలకూ పోలిక లేదు.

అమెరికాలోని నీగ్రో సమస్య నల్ల తెల్లజాతుల మధ్య సమస్య.

ఇండియాలోని హరిజన సమస్య తాతలనాటి వెలి సమస్య. వెలికి లక్ష కారణాలుండ వచ్చు. రంగుకు కాని, జాతికి కాని ఇందులో ప్రమేయం లేదు. హరిజనులు, తదితర స్పృశ్య కులాలవారు అందరూ ఒకే రంగు, ఒకే జాతి.

వేద కాలంలో – అంటే ఋషుల కాలంలో కులభేదాలు లేవు. అసలు కులాలే లేవు. ఆనాడు ప్రధానంగా గణించబడింది ప్రతిభ ఒక్కటే.

ఆనాడు ఎక్కడ, ఎవరికి, ఎలా పుట్టినవాడైనా – ప్రతిభావంతుడైతే, మానవాగ్రణి గానే గౌరవించబడేవాడు. మహర్షిగా, మహా పురుషుడుగా, పురుషోత్తముడుగా సన్మానింపబడేవాడు. విద్యకే ఆనాడు పట్టాభిషేకం, శక్తికే ఆనాడు పూజ.

శ్రీరామ ధర్మరాజాది రాజుల, వసిష్ఠ వ్యాసాది మహర్షుల వృత్తాంతాలను పరిశీలించి చూస్తే – ఈ సత్యం వెల్లడి అవుతుంది.

భారతదేశం మీదికి విదేశీ దండయాత్రలు మొదలై, పవిత్ర వేద మతస్థులు 'హిందూ' వంటి అప్రాచ్య నామంతో పిలువబడడం ప్రారంభమై విదేశీ యజమానుల బూట్లు తుడవడంలో పోటీపడ్డ స్వదేశీ బానిసలు తమలో తాము అంతస్తులు సృష్టించుకొని, వర్ణ వ్యవస్థ కరడుకట్టిన తర్వాతే – వర్ణ సాంకర్యానికి అవకాశం కలిగింది. వర్ణ సంకరులు వెలి వేయబడడం జరిగింది.

నాటి వర్ణాలే నేటి కులాలుగద? వర్ణాలే లేకపోతే వర్ణ సాంకర్యం ఎక్కడుండేది?

బానిసకు అహంభావం ఎక్కువ. కులం తక్కువ వాడిననే కాంప్లెక్సు పెరిగే కొలదీ గొప్పవాడి ననిపించుకోవా లనే తాపత్రయం పెరుగుతుంది. పతిత అయిన స్త్రీ పట్ల పతివ్రత కుండే ఉదారభావం వ్యభిచారిణి కుండదు. అందుకు కారణం కాంప్లెక్సే!

కారణం ఏదైతేనేం – భారతజాతికి హిందూ నామం స్థిరమై, కులవ్యవస్థ భారతీయత గుండెలమీద కుంపటిలా దాపురించి, అమాయకులైన ఒక వర్గం ప్రజలకు వెలి (అస్పృశ్యత) అంటగట్టబడింది. సరే. అయితే – అది ఎంతకాలం? ఈ చట్టానికి సవరణ లేదా? భారత రాజ్యాంగం కంటె మనుస్మృతి గొప్పదా?

తాతల నాటి వెలిని, అంటరానితనాన్ని ఆర్థిక స్వప్రయోజనాలకు వాడుకొన్నారు – బానిస చట్టానికి మత నైతికత కల్పించారు – ఆ తర్వాత పురోహితులూ, వారి చేతిలో కీలు బమ్మలైన పరిపాలకులూ! అందుకే – ఆత్మతేజం ఆరిపోయి, జీవధాతువు ఎండిపోయి, తాము మనుషులమే అన్న జ్ఞానస్పర్శను కోల్పోయారు హరిజనులు. తమ వారైన ఒక వర్గం ప్రజల్ని ఇంతగా జీవచ్ఛవాలను చేయగల్గిన జాతి – మనిషిని కాలదన్ని, పశువును పూజించే జాతి – ప్రపంచంలో ఒక హిందూ జాతి తప్ప మరొకటి లేదీనాడు.

అమెరికాలోని నీగ్రో సమస్య మొన్న మొన్నటిదే అయినా త్వరలోనే నీగ్రోలు మేల్కొన గలిగారు. బానిసత్వంపై తిరగబడగల్గారు. భారతదేశంలోని హరిజన (చండాల) సమస్య వేల సంవత్సరాల నాటి దైనా, నేటికీ ఈ అంటరానివాళ్లు తలెత్తుకోలేక పోతున్నారు. వీళ్ళ జీవశక్తి ఎంతగా నాశనం చేయబడిందో దీనివల్ల మన కర్థ మవుతుంది.

ఈ జీవచ్ఛవాలకు ఆత్మచైతన్య శక్తిని కలిగించి, మానవ సహజ ప్రవృత్తిని మేల్కొల్పడమే ఈ పోరాటాన్ని ప్రకటించడంలోని నా ఉద్దేశ్యం. చదువుకొని, మాలమాదిగ పేటల నుంచి పారిపోయి, పట్టణాలలో దాక్కొంటున్న పిరికి వాళ్ళకు కాదీ ఉద్బోధ. ఇంకా ఆ పేటలనే పట్టుకొని వ్రేలాడుతున్న సనాతన చండాల జనం ప్రగతి పథంలో పురోగమించడం కోసం ఇది.

''కృణ్వంతో విశ్వమార్యం'' అన్న ఋగ్వేద నినాదంలోని ''ఆర్య'' మతం నాది. ఆర్య శబ్దం జాతిపరమైన శబ్దం కాదిక్కడ. అదొక జీవిత విధానం. ధర్మ,

అర్థ, కామ మోక్ష - ఈ నాలుగూ పురుషార్థాలు. మానవుడు మానవుడుగా సంపూర్ణ జీవితాన్ని అనుభవించి, పూర్ణ పురుషుడై భగవత్సముడు కావడానికి ఈ చతుర్విధ పురుషార్థాలూ ప్రతిపాదింపబడిన్నై. ప్రతి మనిషీ తనకు స్వభావసిద్ధమైన గుణాలను అనుసరించి, మానవ ధర్మ పరిధిలో బ్రతుకుతూ, అర్థ కామాలను అనుభవిస్తూ పెరిగి, ముముక్షువై, తుదకు మోక్షం పొందుతాడు. ఆర్య జీవన విధాన ప్రణాళిక ఇదీ. ఏ మానవుడి జీవిత వికాసానికైనా, జీవిత సాఫల్యానికైనా ఇదే పద్ధతి. కులంతో దీనికి సంబంధం లేదు.

కుల మత వర్ణ వర్గ విభేద రహిత మైన ఆర్య భారత జాతి ఆవిర్భవించాలనేదే నా ఉద్యమం.

కుల వ్యవస్థను నిర్మూలించా లని అందరూ అంటున్నారు. కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలన్నీ అదే చెపుతున్నై. కాని అది ఎలా జరగాలో ఎవరూ చెప్పటం లేదు. నేను చెపుతున్నాను. చిత్తశుద్ధి కల ప్రగతి కాముకులంతా దీన్ని పరిశీలిస్తారని విశ్వసిస్తున్నాను.

హిందూమతం, కులవ్యవస్థ అనే పదాలు నేడు పర్యాయ పదాలుగా తయారైన్నై. పుట్టుకతోనే ఒక మనిషి ఒక వృత్తికి చెందడం ప్రకృతి విరుద్ధం. ధర్మ విరుద్ధం. గుణ కర్మలను బట్టి వర్గ విభజన ఉండవచ్చు. గుణకర్మలు స్థిరమైనవి కావు. నిత్య చైతన్య శీలాలవి. దొంగ అయిన వాల్మీకి మహాకవి వాల్మీకి అయినాడు. స్త్రీ లోలుడైన వేమన మహాయోగి వేమన అయినాడు. శూద్రుడైన వెంకటరత్నం నాయుడు బ్రహ్మర్షి అయినాడు. అదీ ఆర్య జీవిత విధానం. అదీ ఆర్య మతం.

హిందూ కులవ్యవస్థను రద్దుచేసి, దాని స్థానే ఆర్యమతాన్ని పునరుద్ధరించడానికి ఈ మధ్య రెండు ఉద్యమాలు బైలుదేరిన్నై. అవి రెండూ విఫలమైన్నై. బ్రహ్మ సమాజం ఉన్న జందాలు తీసివేయమన్నది. ఆర్య సమాజం లేని జందాలను వేసుకోమన్నది. మనిషి కంటె జందానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే అవి విఫలమైన్నై. ఈ సమస్య పరిష్కారాన్ని క్రింది నుంచి, మాలమాదిగ పేటల నుంచి ప్రారంభించమంటున్నా నందుకే.

ఈ రచనలోను, ఈ నా ప్రణాళికలోను నేను కొంత తీవ్రత కనబరిచాననీ, అతిగా పోయా ననీ కొందరు ఉద్దేశ పడవచ్చు. రాజా రాంమోహనరాయ్,

దయానంద సరస్వతి, వివేకానంద, వేమన యోగి, వీరేశలింగం పంతులు, బ్రహ్మంగారు. పిఠాపురం మహారాజా వంటి వారితోను - గాంధీ, అంబేడ్కరు, జగజ్జీవనరాం వంటి వారితోను మూర్తి, కూర్మయ్య, సంజీవయ్య వంటి వారితోను - మంగిపూడి వెంకటశర్మ, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, కవిరాజు, శ్రీ శ్రీ, జాషువా వంటి వారితోను - రచనలలో కాని, కృషిలో కాని పోల్చి చూస్తే - ఆ మహా సముద్రాలలో నేనొక అల కూడా అవుతానో, లేదో! అహంకార రహితంగా, ఆత్మమాత్ర పరిశుద్ధంగా, కేవల మానవ దృష్టితో ఈ నా రచనను, ప్రణాళికను పరిశీలించవలసిందిగా సహృదయుల్ని కోరుతున్నాను. నేను విశ్వమానవతావాదిని, విశ్వార్య వైదికుణ్ని, సత్యావాదిని, ధర్మైక వర్తనుణ్ని, అపార్థం చేసుకోకండి, ఆలోచించడం మొదలు పెట్టండి.

ఈ దేశంలో హరిజనులు ఒక బలమైన వర్గం. వారి ఉద్దేశాలను ప్రయోజనాలను, యోగ క్షేమాలను ఉపేక్షించటం విజ్ఞత కాదు. ఈ సత్యాన్ని పూర్తిగా మనసులో ఉంచుకొని, నిష్కల్మష హృదయంతో, సానుభూతితో ఈ గ్రంథ పఠనకు ఉపక్రమించవలసిందిగా భారత యువకుల్ని కోరుతున్నాను.

వేదాలు నాలుగే అయినా, పంచమ వేదంగా మహాభారతం ఎక్కువ ప్రాధాన్యం పొందింది. అలాగే - వర్ణాలు నాలుగే అయినా, పంచమ వర్ణం ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకొన్నది. ఈ సత్యాన్ని గుర్తించి, వర్ణాంతర వివాహాల ద్వారా వర్ణ (కుల) వ్యవస్థను నిర్మూలించి, భారతజాతిని ఏకజాతిగా తీర్చిదిద్దకపోతే - ప్రపంచ జాతుల మధ్య దానికి భవిష్యత్తు లేదు.

ఆహార విహారాదులు వ్యక్తిగతమైన స్వభావాన్ని బట్టీ, అభిరుచిని బట్టీ, ఆరోగ్య పరిస్థితిని బట్టీ ఉంటై. ఒకరి ఆహార విహారాల జోలికి మరొకరు పోవడం ధర్మం కాదు. ఈ విషయంలో మూఢాచారాలను, సెంటిమెంటును వదులుకోక తప్పదు. వేదకాలం నాడు ఏమి జరిగిం దనేది ఇప్పుడు అప్రస్తుతం. అప్పటికేది అవసరమో అది ఆనాడు జరిగి ఉంటుంది. ఈనాడు మనకేది అవసరమో దాన్ని మనం ఇప్పుడు అనుసరించవలసి ఉంది. వ్యక్తిగత ఇష్టానిష్టాలను రాజకీయ సమస్యలుగా తయారు చెయ్యకూడదు. కాలానుగుణంగా మారని పాతకాలపు పీఠాలకు నేటి కాలపు మానవ జీవితాలను శాసించే శక్తి లేదు. దురభిమానాలు అభ్యుదయ కరాలు కావు.

యుగపురుషుడు, దళిత జనోద్ధారకుడు, బౌద్ధమత మహాయానంలో నాగార్జునుని తర్వాత అవతరించిన అపర బుద్ధుడు, మానవతా సమతా ధర్మ ప్రవర్తకుడు అయిన డాక్టరు అంబేడ్కరుకు ఈ గ్రంథాన్ని అంకితం ఇస్తున్నాను. ఇందుకు ఎంతో ఆనంద పడుతున్నాను.

**రెండవ ముద్రణ పీఠిక నుంచి:**

చదువుకొని, చిన్న చిన్న ఉద్యోగాలైనా చేసుకొంటున్న యువకులు హరిజను లలో లేకపోలేదు. అట్టి యువకులు ఒక్కొక్కరు తమ జాతి ఋణం తీర్చుకోవడం కోసం ఒక్క ఆరు రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడితే గ్రామానికి రెండు ప్రతులు అనే నా కోరిక నెరవేరగలదు. అట్టి ప్రతి యువకుడూ – జన్మకు ఒక్కసారి – రెండు పుస్తకాలు కొని, తన గ్రామంలోని రెండు మాల మాదిగ పేటలకు బహూకరించగల్గితే చాలు. మాల మాదిగలు సమైక్యం కావడం అనే ప్రథమ లక్ష్యం అచిరకాలంలోనే సిద్ధించగలదు.

ప్రతి ఇంటా ఒక ''ధర్మం కోసం పోరాటం'' గ్రంథం ఉండాలనేది నా ఆశ. ఎక్కడైనా ధన సహాయం లభిస్తే – లక్షల కొలది ప్రతులు ముద్రించి, బైబిలు గ్రంథాలవలె ఇంటింటికీ ఉచితంగా పంచిపెట్టాలని కూడ ఉంది నాకు. ఉద్యోగులూ, నాయకులూ తలచుకొంటే – గ్రామానికి రెండు పుస్తకాలనైనా అందజేయవచ్చు. అదంత కష్టమైన పనేమీ కాదు.

ముద్రించిన గ్రంథాలను మార్కెట్టులో పెట్టే అలవాటు నాకు లేదు. నా గ్రంథాలను కొని చదివే అలవాటు ప్రజలకు లేదు. నాకూ – ప్రజలకూ మధ్య కులం ఒక బ్రహ్మరాక్షసిలా నిలబడి ఉంది. కుల నిర్మూలన జరిగితే తప్ప, నా గ్రంథాలు చదివి ఆనందించే అవకాశం ప్రజలకు ఉండ దనవచ్చు. అందుకే కుల నిర్మూలన జరగక తప్పదు.

ధర్మం అనేది దేశ కాల పాత్రల గుండా, భూత వర్తమాన కాలాల ద్వారా, అనాది నుంచి అనంతత్వంలోకి ప్రవహించిపోతూ ఉండే ఒక సమాజ చైతన్యధార. ఒక నిత్య నిరంతర ప్రవాహం. ఈ ప్రవాహానికి ఏవో అడ్డుకట్టలు కట్టి, తమ సొంత పొలాలను సాగు చేసుకోడానికి బలవంతులైన స్వార్థపరులు నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటారు. అట్టి వాళ్ళ ప్రయత్నాలను నిరోధిస్తూ, అట్టి అడ్డుకట్టలను తీసి పారవేస్తూ

– క్రింది వర్గాల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తులుగా వుండవలసి వుంది. అట్టి నిరంతర జాగృతే ధర్మం కోసం పోరాటం.

**మూడవ ముద్రణ పీఠిక నుంచి:**

"అచ్చు పుస్తకాన్ని పునర్ముద్రించడం కదా తప్పు లెందుకు వస్తాయి?" అనుకొన్నాను నేను. పుస్తకాన్ని ప్రెస్‌లో ఇచ్చి, ప్రూఫుల బాధ్యత మిత్రులకు అప్పగించి, వేరే పనుల మీద పోయాను. ఫలితం ఇది!

దీనికి తప్పొప్పుల పట్టిక తయారుచేసి చూశాను. దానికంటే నాలుగో ముద్రణ వేసుకోవడమే సులభంగా తోచింది. ఈ ముద్రణ ప్రతులు ఖర్చు కాగానే – నాలుగో ముద్ర ా ఒక్క తప్పుకూడ లేకుండా జాగ్రత్త తీసుకోగలనని మాట ఇస్తున్నాను.

ప్రపంచం అన్ని దేశాలలో ఉన్న సమస్యలన్నీ మన దేశంలోనూ ఉన్నై. కుల వ్యవస్థ, అంటరానితనం అనే సమస్యలు రెండూ మన దేశానికి అదనం. ఈ రెండు సమస్యల్నీ నిర్మూలించిన తర్వాతగాని, ప్రపంచ దేశాల పంక్తిలో మనకు చోటు లభించదు.

అందుకే – కులవ్యవస్థ వల్ల బాధపడుతున్న వారందర్నీ – ముఖ్యంగా మాలమాదిగల్నీ ఏకం కమ్మంటున్నాను. ఈ రెండు దుష్ట సమస్యల్నీ నిర్మూలించి – దేశ సమైక్యానికీ, ప్రపంచ ప్రగతికీ మార్గదర్శకులు కమ్మంటున్నాను.

లోకంలో – ముఖ్యంగా మానవ సమాజంలో దుఃఖం ఉంది. దారిద్ర్యం ఉంది. అధర్మం ఉంది. వీటి నిర్మూలనకు కావలసింది నీతి బోధలు కాదు. నిర్మొహమాటమైన కార్యక్రమాలు.

స్వార్థపరుల పెత్తనం నుంచి – ఓ స్వార్థరహిత యువకులారా, మీరు విడుదలై, జాతిని విడిపించండి!

శుభం భూయాత్

భాగ్యనగర్

ఏప్రిల్, 1992

– బోయి భీమన్న

# ధర్మం కోసం పోరాటం

న్యాయం కోసం మన ఆరాటం. ధర్మంకోసం మన పోరాటం. సమానత్వం కోసం మన ఉద్ఘాటం.

న్యాయం, ధర్మం, సమానత్వం - ఈ మూడూ భారత సమాజం నుంచి ఏ రోజున బహిష్కరించబడినవో, ఆ రోజునే పవిత్ర భారత భూమి పరదేశ దురాక్రమణకు పాదాక్రాంతమై పోయింది. ప్రజ్ఞా ప్రాభవాలను పోగొట్టుకొన్నది. బానిసకు సహజమైన నీచ దురహంకారాన్ని, పాశవిక కులతత్వాన్ని పెంచుకున్నది. మానాన్నీ, మానవత్వాన్నీ క్షణికమైన స్వప్రయోజనాలకు అమ్మేసుకొన్నది.

భారతీయ బహుజనుడా! మాలమాదిగ యువకుడా! నిస్వార్థ దేశ భక్తుడా! ఈ దుస్థితిని ఎంతకాలం సహిస్తావు? నిన్నూ, నీ జాతినీ శతాబ్దాలుగా కట్టిపడవేసి ఉంచిన ఈ దరిద్ర దాస్యశృంఖలాలను ఇంకా ఎంతకాలం భరిస్తావు?

2

భారత దేశంలో పుట్టే ప్రతి వ్యక్తీ ఏదో ఒక మతంలో పుట్టక తప్పదు. హిందుమతంలో పుట్టే ప్రతి వ్యక్తీ ఏదో ఒక కులంలో పుట్టక తప్పదు.

మతాలు, కులాలు మానవులు కల్పించినట్టివి. ఏ మతమూ, ఏ కులమూ లేని నిర్మల మానవుడుగా పుట్టే అవకాశం ఈనాడు ఏ మానవుడికీ లేదు.

కుల మత విభేద దూష్యం కాని విశ్వమానవజాతి ఏర్పడడం సాధ్యం కాదా? ఎందుకు కాదు?

## 3

ఏ మతమైనా చెప్పేదొకటే - పవిత్రంగా బ్రతకమని, భగవంతుణ్ని చేరుకొమ్మని.

ప్రపంచంలోని ప్రతి మతమూ తన మతస్థుల్ని సమంగా చూస్తుంది. లోకంలోని ఏ మూల, ఏ తెగ మానవుడినైనా తనలో చేర్చుకొంటుంది. గౌరవిస్తుంది.

కులం పేరుతో, అస్పృశ్యత పేరుతో, మనిషి నుంచి మనిషిని విడదీస్తున్న మతం, అవమానిస్తున్న మతం ఒక్క హిందూమతమే. తన మతస్థుల్ని హీనంగా చూస్తూ, దూరంగా తరిమి కొడుతూ, పరమతాల వాళ్లకు పాదాక్రాంతమై, వాళ్ళ పాదధూళిని శిరస్సున ధరిస్తున్న మతం ఒక్క హిందూమతమే.

ఐన వాణ్ని అరకాల రాస్తూ, కాని వాణ్ని కౌగలించు కొంటున్న మతం ఒక్క హిందూమతమే.

అందుకే - హిందూమతం అధర్మానికి, అన్యాయానికి, అనైక్యతకు, ఆత్మవంచనకు ఆకరమై రోజు రోజుకూ క్షీణించి పోతున్నది. అయినా, దాని పెద్దల చిలక పలుకులు మారడం లేదు.

పీఠాధిపతులు కళ్లు తెరవడం లేదు.

## 4

ఒకసారి - ఒక బ్రాహ్మడూ, ఒక సాహెబూ ఒక దారిన నడిచి పోతూ- ప్రొద్దుక్రుంకే సరికి ఒక అడవిని చేరుకొన్నారట. అక్కడొక పాడు దేవాలయం కనిపించగా, ఆ రాత్రికి అక్కడ తల దాచుకొందా మనుకున్నారు.

బ్రాహ్మడు విగ్రహానికి భక్తితో నమస్కరించి, దాని పాదాల వద్ద తలపెట్టుకొని పడుకున్నాడు. సాహెబు తన కాళ్ళను విగ్రహం రొమ్ముకు తన్ని పెట్టుకొని పడుకున్నాడు.

అర్ధరాత్రి గడిచింది.

"సాహెబూ! సాహెబూ! నాకు ఆకలిగా ఉంది. నీ కాళ్ళు తియ్యి, బ్రాహ్మణ్ని మింగేస్తాను" అన్నదట ఆ విగ్రహం.

"మిత్ర ద్రోహం చేస్తానా? నోరు మూసుకో"! అన్నాడట ఆ సాహెబు.

గ్రామాల్లో అందరికీ తెలిసిన పాత కథే ఇది.

దీని నీతి ఏమిటి? ఆలోచించండి!

తన భక్తుడైన బ్రాహ్మడి పట్ల ఆ విగ్రహం అవలంబించిన పైశాచిక వైఖరినే తన వారైన మాలమాదిగల పట్ల హిందూమతం అవలంబిస్తున్నది. కాదనగలరా?

## 5

కులం, మతం, జాతి - హరిజనులు, గిరిజనులు, బహుజనులు - అస్పృశ్యత, కులవ్యవస్థ, వైదిక సామ్యవాదం - రాజకీయ పార్టీలు, సంఘ సంస్కరణ, ప్రజాస్వామిక సోషలిజం- గాంధీయిజం, మార్క్సిజం, అంబేద్కరిజం - కుల వ్యవస్థను, గ్రామ వ్యవస్థను నిర్మూలించి, కుల మత రహితమైన, ధర్మ ప్రధానమైన, ఉపనిష ద్విహితమైన సర్వమానవ సమతా సమాజాన్ని నిర్మించడం-భీమసేన, అంబేద్కరు సేవాదళం, లోక సమాఖ్య, ప్రజా పరిషత్, పదవులు కోరని నాయకత్వం వగైరా అనేక విషయాలను గురించి నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను. ఇవన్నీ ముఖ్య విషయాలే. కనుక, శ్రద్ధగా గమనించండి!

ఈ విషయాలు ఒక క్రమంలో ఉండకపోవచ్చు. పునరుక్తి ఉండవచ్చు. ఏ విషయాని కా విషయం మాత్రం సంపూర్ణంగా ఉంటుంది. కనుక, ప్రతి విషయాన్నీ జాగ్రత్తగా, సూక్ష్మదృష్టితో పరిశీలించండి! స్పష్టమైన నిర్ణయాలకు రండి!

## 6

వివిధ జాతుల మానవుల్ని ఉద్బోధించి, పాశవిక స్థితి నుంచి ఉద్ధరించి, సర్వజన సహోదరత్వాన్ని సాధించి, పరమేశ్వరుడికి అభిముఖంగా నడిపించుకు పోయేదే నిజమైన మతం.

కులం పేరుతో మనిషి నుంచి మనిషిని విడదీసి, హెచ్చు తగ్గులు కల్పించి, అస్పృశ్యత పేరుతో మానవత్వాన్నే అవమానిస్తున్న హిందూ మతానికి మత మని పిలిపించుకొనే అర్హత లేదు.

నేటి హిందూ మతం భగవంతుడి కోసం ఏర్పడ్డ మతం కాదు. ఆర్థిక రాజకీయ ప్రాబల్యం కోసం కొందరు తెలివైన స్మృతి కర్తలు కలిసి కుట్రపన్ని, రూపొందించిన ఒక సాంఘిక పథకం అది.

అందుచేత - జాతిభేదం వల్లా, కుల తత్వం వల్లా, అస్పృశ్యత వల్లా హీనులూ, దీనులూ అయి బాధపడుతున్న ఎవరైనా సరే తమ దౌర్భాగ్య హేతువులైన జాతి భేదాన్నీ, అస్పృశ్యతనూ నిర్మూలించి పారవెయ్యడానికి నడుం కట్టడంలో తప్పేం లేదు.

## 7

వేద కాలం గొప్పదే. ఆర్ష సంప్రదాయం ఉత్తమమైందే. ఉపనిషత్తులు మహత్తరమైనవే. భారతీయ ఆధ్యాత్మిక స్థాయి అద్వితీయమైనదే. ఎవరూ కాదనరు.

అయితే - లోకోత్తరమైన అట్టి మన సనాతన వేదాంతమతమూ, ఈ నాటి హిందూ మతమూ ఒకటేనా? కాదు. కాదు. కానే కాదు!

అహం బ్రహ్మోస్మి, తత్త్వమసి, ఆత్మవత్సర్వ భూతాని, సర్వేజనాస్సుఖినోభవంతు- మొదలైన సోషలిస్టు మూల సూత్రాలను ప్రతిపాదించి, సర్వమానవ సమానత్వాన్ని ఉద్ఘాటించి చెప్పిన వైదికార్య మతమూ- కులతత్వమూ, స్వార్థమూ, స్వమత జన హింసా తప్ప మరొక విలువ ఏదీ లేని నేటి హిందూ మతమూ ఒక్కటేనా? ఒక్కటి కావు. కానేరవు.

## 8

*సమానీవ ఆకూతి:*
*సమానా హృదయాని వ:*
*సమాన మస్తు వో మనో*
*యథావహో సుహాసతి*

- ఋగ్వేదం 10-191-4

"మీకందరకూ సమాన ప్రతిపత్తిగల ఉత్తమ జీవితం లభించగలందులకు ఓ మానవుల్లారా! మీ జీవిత లక్ష్యం ఒక్కటే అగుగాక. మీ హృదయా కాంక్షలు ఒక్కటే అగుగాక. మీ మనస్సులు కలిసి ఒక్కటే అగుగాక." ఇది కదా వేద ఋషులు ఆశించిన మానవసమాజ స్వరూపం.

సర్వ మానవులకూ ఏక ప్రతిపత్తిని ప్రతిపాదిస్తున్న వేద మతానికీ, స్వమత మానవులనే కులతత్వంతో హింసించి చంపుతున్న నేటి హిందూమతానికీ ఏమైనా పోలిక ఉన్నదా?

## 9

కృణ్వంతో విశ్వమార్యం - అనే నినాదాన్ని ఋగ్వేదం ఇచ్చింది. ప్రపంచంలోని మానవులందర్నీ ఆర్యమతంలో కలప మన్నది. ఆ నినాదం ప్రకారమే ఆపస్తంభ మహర్షి దక్షిణాదికి వచ్చి, ఇక్కడి ద్రావిడు లందరికీ జంజాలు వేసి, ఆర్య మతంలో చేర్చాడు.

ఇప్పుడు అలా ఎందుకు జరగడం లేదు? జరపడానికి ప్రయత్నించిన ఆర్య సమాజం ఎందుకు విఫలమైంది? పైగా - ఆర్యమతంలో పుట్టి పెరిగినవాళ్ళు, ఆర్షమత ప్రవక్తలైన వ్యాస వాల్మీకుల సంతతి వాళ్ళు కూడ నేడు హిందూమతాన్ని విడిచిపెట్టి, ఇతర మతాలలోకి ఎందుకు పారిపోతున్నారు?

ప్రపంచ మంతా వ్యాపించి ఉండవలసిన ఆర్యమతం నేడు స్వదేశంలోనే క్షీణించి పోవడానికి ఏమిటి కారణం?

## 10

ఈనాడు భారత దేశంలో ఉన్న ముస్లింలలో, క్రైస్తవులలో, బౌద్ధులలో, తదితర మతాలలో మెజారిటీ ఎవరు? హిందూమతం లోని కులతత్వ దౌర్జన్యాలకు బెదిరిపోయి, పరమతాల పాలైపోయిన మాల మాదిగలే కాదా?

ఈనాడు గిరిజనులుగా పేర్కొన బడుతున్న ఆటవికులలో మెజారిటీ ఎవరు? హైందవ పాశవికత్వాన్ని భరించలేక, అడవులలోకి పారిపోయిన హరిజనులే కాదా?

## 11

శ్రుతుల కాలం నాటి ఋషుల విశ్వమానవ ధర్మానికి విరుద్ధంగా స్మృతుల కాలంనాటి ప్రజాపతులూ, వాళ్ళ పురోహితులూ సంకుచిత వర్ణ వ్యవస్థను కల్పించారు. దాని రక్షణ కోసం అనేక దుష్ట శాసనాలను సృష్టించారు. తమకు అనుకూలంగా వేదాలకు భాష్యాలు వ్రాసుకున్నారు. వేదాంగాలను, కావ్య పురాణేతిహాసాదిక సారస్వతాన్ని నిర్మించుకున్నారు.

అసలు మూడు వర్ణాలే కదా! అవి భారత కాలంనాటికి నాలుగైనై. ప్రబంధ కాలం నాటికి పద్దెనిమిదైనై. ఇప్పుడు లక్షాతొంభైఅయి, భారత మాత గుండెలమీద చింతనిప్పులు అయి, కణకణ మండుతున్నై.

ఈ నిప్పుల్ని తొలగించడం, భారత జాతిని కాపాడడం మన ధర్మం. అందుకే మన పోరాటం.

## 12

ఆర్యుడు అంటే తండ్రి, ధర్మం తెలిసినవాడు అని అర్థం. అది ఒక జాతి పేరుకాదు. మానవుడు తపస్సు చేసి, ఋషి అయి, సంపాదించుకొన్న ఒక సంస్కారానికి పేరు అది.

సంస్కారం గల ప్రతిమనిషీ ఆర్యుడే.

లోకోత్తరమైన వైదికార్య ధర్మం ఎప్పుడో నశించిపోయింది. దాని మృత శరీరంలోకి కులతత్వ స్వార్థం పరకాయ ప్రవేశం చేసింది. నేటి హిందూమతం ఒక స్వప్రయోజకుల వ్యవస్థ. దాని రక్షణ కోసం కల్పించబడ్డ బానిస చట్టమే అస్పృశ్యత.

అస్పృశ్యత తొలగకుండా, కులవ్యవస్థ నశించకుండా భారత జాతికి పురోగతి లేదు.

## 13

ఇంతకూ– "హిందూ" అనే మాట కూడ మనది కాదు. అది పారసీక పదం. దాని అర్థం ఏమిటో తెలుసుకొన్నారా?

అసమత్వ పోషకాలు, అన్యాయ దూషితాలు, పారసీక దండయాత్రల తర్వాత పుట్టుకు వచ్చిన కుక్కమూతి పిందెలు అయిన నేటి హిందూమత మూఢ విశ్వాసాల దౌర్జన్యాలను నిరోధించకుండా ఆర్షమతానికి మోక్షంలేదు.

ఋషుల మతమే ఆర్షమతం.

## 14

**శం**కరాచార్యుడికి అద్వైత వేదాంత తత్వాన్ని బోధించిన వాడు ఒక చండాలుడు. రామానుజాచార్యుల గురువు ఒక చండాలుడు. హరిశ్చంద్ర చక్రవర్తినే కొనగలిగిన వాడొక చండాలుడు. భారతీయ వేద వేదాంగ పురాణేతిహాసాలకు మూల పురుషుడొక చండాలుడు. ఆధునిక స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాత ఒక చండాలుడు. చండాలు డంటే మాలమాదిగవాడు. హరిజనుడు! వీళ్ళంతా అవతార పురుషులే. అపర శివులే కదా? గుర్తించండి!

భారత దేశంలో – ఒక్క భారత దేశంలోనే కాదు, మొత్తం ప్రపంచంలో – పుట్టిన మహర్షులంతా నిమ్నజాతుల వారే అనే సత్యాన్ని గమనించండి! ఈ సత్యం ఐతిహాసిక సత్యం. ఇప్పుడు నేను ఊహించి చెపుతున్నది కాదు.

ఇంతటి గొప్ప వారసత్వాన్ని, ఆస్తిని వదలుకొని, ఎంతో మంది ఎందుకు మత నిర్వాసితులై, పరమతాలపాలై పోయారు? బుద్ధి ఉన్న ప్రతి భారతీయుడూ ఆలోచించ వలసిన విషయం కాదా ఇది?

## 15

**హిం**దూ సమాజం నుంచి అస్పృశ్యతను, కుల భేదాన్ని తొలగించి, సంస్కరించి, దానికి మళ్ళీ ఒక నూతనోత్తేజాన్ని కలిగించడానికి జినదేవుడు, బుద్ధుడు, రామానుజాదులు, వేమనయోగి, వీర బ్రహ్మం, రామ మోహన రాయలు, వివేకానందుడు, శ్రద్ధానంద సరస్వతి, గాంధీజీ, అంబేద్కరు, హరిజన సేవక సంఘం, ఆర్యసమాజం వంటి ఎందరో మహానుభావులు, ఎన్నో మహోద్యమాలు తలలు బద్దలు కొట్టుకొన్నప్పటికీ – ఈ రెండు పిశాచాలూ ఇంకా వదిలిపోలేదు. ఎందుచేత?

అసంఖ్యాకంగా పరమతాల పాలైపోయినా, ఈ నాటికీ పోతూ ఉన్నా, ఇంకా కోట్ల కొలది మాలమాదిగలు అంటరాని వాళ్ళనిపించుకొంటూ, హిందూ మతంలో మిగిలే ఉన్నారెందుచేత?

మాలమాదిగ పేటలకూ, అక్కడ కుళ్ళి చస్తున్న మాలమాదిగ జనులకూ ఎప్పటికీ విమోచనే లేదా? ఎంతటి మహాత్ములూ వాళ్ళని ఉద్ధరించనే లేరా?

ఏమిటి తరణోపాయం?

## 16

మాల మాదిగ సమస్య ఒక అనాధ ప్రేతం. దిక్కులేని శవం. దాన్ని మరొకడు ముట్టుకోడు. దాని కది కదిలి పోదు.

అది పూర్తిగా పరిష్కారమై పోకుండా భారత జాతికి ఆరోగ్యం లేదు. పురోగమనం లేదు. ప్రపంచ జాతుల మధ్య గౌరవస్థానం లేదు.

శవాన్ని ఇంట్లో పెట్టుకొని, శౌచలోకం మధ్య శంకరా చార్యుడు కూడా తలెత్తుకోలేడు.

అనాధ ప్రేత సంస్కారం పుణ్యం కదా అంటే – నేటి హిందూ సమాజంలో డబ్బు తప్ప, పుణ్యం కావలసిన వాడెవడు?

ప్రపంచ జాతుల మధ్య భారత జాతి మాన మర్యాదలతో బ్రతకాలంటే, భారత దేశం సర్వ మానవ సమానత్వంగల సోషలిస్టు దేశంగా అభ్యుదయం పొందాలంటే, సమాజం నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ తొలగించక తప్పదు. అలా జరగాలంటే, ఈ శవం దానంతట అదే ముందుకు కదలక తప్పదు.

## 17

సర్వ మానవ సమ సమాజ నిర్మాణమే తమ లక్ష్యంగా ఉద్ఘాటిస్తున్న కాంగ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు వగైరా రాజకీయ పార్టీలేవీ కూడ అసలు సమస్యను అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోడానికి ప్రయత్నించలేదు. ఆయా పార్టీలు తమ తమ కార్యరంగాలలో ఓడి పోవడానికి కారణం అదే.

## 18

అస్పృశ్యతను తొలగించడం కోసం, ఆత్మ గౌరవంతో జీవించడం కోసం, మాల మాదిగ యువకుల్లారా- ముందుగా మీరు మేల్కోవలసి ఉంది! మేల్కొని, ముందుకు సాగవలసి ఉంది!

మీ విమోచన కోసం ముందుగా మీరే లేచి నడుం కట్టుకోకపోతే - భగవంతుడు కూడా మిమ్మల్ని ఉద్ధరించలేడు. మిమ్మల్ని ఉద్ధరించకుండా దేశాన్నీ, ధర్మాన్నీ ఉద్ధరించడం అసాధ్యం.

## 19

దోచబడే బలహీను డున్నంతకాలం, దోచే బలవంతు డుంటాడు.

దోపిడీ జరగడానికి కారణం బలహీనుడు. దోమలు పుచ్చడానికి కారణం మురికి.

మాలమాదిగ యువకుల్లారా - బలవంతులు కండి! మీరు బలవంతులైతే - మిమ్మల్ని అన్యాయం చేసేవాళ్ళు, అవమానించేవాళ్ళు, అవతలుండమనే వాళ్ళు, అర్థాకలితో మాడ్చి చంపే వాళ్ళు ఎవళ్ళూ ఉండరు.

బలవంతులు కావాలంటే, ఏకం కావాలి. మాలమాదిగ లేకమైతే ధర్మాన్ని పాలించగలరు. లోకాన్నే జయించగలరు.

## 20

గతంలో ఎంతో మంది మహా పురుషలు అస్పృశ్యతను నిర్మూలించడానికి ఎన్నో తంటాలు పడ్డారు.

ధర్మ బలంతో, శాస్త్ర చర్చతో, హేతువాదంతో, ఎందరో దార్శనికులు అస్పృశ్యతా పిశాచిని ముక్కలుగా నరికి పారబోశారు.

అయితే - అది జరాసంధుడి కాయంలా ఎప్పటికప్పుడు అతుక్కొంటూనే ఉంది. బలం పుంజుకొంటూనే ఉంది. ఇతోధిక క్రౌర్యంతో భారత జాతిని పీడిస్తూనే ఉంది. అభ్యుదయ పురోగామి శక్తుల్ని ధిక్కరిస్తూనే ఉంది.

## 21

జరాసంధుణ్ణి చంప గల్గినవాడు భీమ సేను డొక్కడే. అస్పృశ్యతా పిశాచిని చంపగల్గిన శక్తి భీమసేనకే ఉంది.

భీముడు కృష్ణుడినుంచి వలె – దళిత జనోద్ధరణ ప్రవక్త అయిన అంబేద్కరు ప్రబోధం నుంచి ఆత్మశక్తిని గ్రహించి – కృత నిశ్చయంతో జబ్బ చరచండి!

## 22

అస్పృశ్యత మన శత్రువు. ఒకటో నంబరు శత్రువు. కుల వ్యవస్థ రెండో శత్రువు. ఈ శత్రుద్వయం నశించకుండా భారతజాతికి అభ్యుదయం లేదు.

## 23

అస్పృశ్యత, కుల వ్యవస్థ – ఇదొక జంట. ఈ జంటకు పుట్టిన మరో జంట అన్యాయం, అనైక్యత. ఈ నాలుగూ కలిసి భారత జాతిని విడని దారిద్ర్యంలో, విదేశీ దాస్యంలో ముంచివేసినై. ఆధునిక భారతంలోని దుష్టచతుష్టయం ఇవి.

మాల మాదిగ యువకుల్లారా, ఏకం కండి! శత్రు నాశనం చేసి విజయులు కావటానికి అజ్ఞాతవాసం నుంచి బైట పడండి! ఇంకా ఎంతకాలం ఉంటారా మురికి పేటల్లో? ముదనష్టపు దాస్యంలో?

## 24

"డాక్టరు అంబేడ్కరు భయంకరుడు, భయరహితుడు. చేతికేది దొరికితే దానితో ఈ హిందూ కుక్కను కొట్టడానికి జంకడు" అన్నాడు గాంధీజీ ఒకసారి.

గాంధీజీ అంతటివాడు హిందూ సమాజాన్ని కుక్కతో ఎందుకు పోల్చాడు? అస్పృశ్యత, కులతత్వం, అన్యాయం, అనైక్యత – ఈ దుష్టగుణా లున్నందువల్లనే కదా?

ఈ శత్రు చతుష్టయాన్ని మట్టుపెట్టడానికి, అంబడ్కరు వలెనే, మీలో ప్రతి ఒక్కడూ భయంకరుడూ, భయ రహితుడూ కండి!

## 25

"నాల్గు పడగల హైందవ నాగరాజు" అన్నాడు మహాకవి జాషువా.

హిందూ సమాజాన్ని జాషువా పాముతో పోలిస్తే, గాంధీజీ కుక్కతో పోల్చాడు.

అది పాము కావచ్చు, కుక్క కావచ్చు. ఏదైనా - దానికి గల ఆ నాలుగు విషపు పడగల్నీ పీకి పారవెయ్యక తప్పదు.

మీరు బెదిరే కొలదీ అది బుస కొడుతూనే ఉంటుంది. ఉపేక్షించే కొలదీ ఉట్టెలు కొరుకుతూనే ఉంటుంది.

## 26

"అస్పృశ్యత బ్రతికి ఉండడంకంటే, హిందూమతం చచ్చినా మంచిదే" అన్నాడు గాంధీజీ! హిందూ పెద్దల మూర్ఖత్వంతో ఎంత విసిగి పోకపోతే అలా అంటాడాయన!

హిందూమతం ఇప్పటికే ఇంతగా క్షీణించి పోవడానికి ప్రధాన కారణం అస్పృశ్యతే! అది ఇప్పటికీ పోకపోతే, హిందూమతమే రూపుమాసి పోతుంది.

## 27

నీతుల్నీ, సిద్ధాంతాల్నీ, వేదాంతాన్నీ అలా విడిచి పెట్టండి! మానవ స్వభావాన్నీ, సమాజాన్నీ సంస్కరించే బలం వాటికి లేదు. వాటికి అంతటి బలమే ఉంటే - మనకు ఈ దైన్యమే దాపురించేది కాదు.

బలం కలవాడే రాజు అన్న దొక్కటే సార్వకాలిక సత్యం. శక్తి కలవాడే సజీవుడు అన్నదొక్కటే వాస్తవం.

బలాన్ని సమకూర్చుకోండి! మీరూ మనుషులే అని తెలుసుకోండి! మనుషులవలె బ్రతకడానికి పూనుకోండి!

## 28

మాలమాదిగ యువకులకే ఈ ఉద్బోధ ఎందుకు చేస్తున్నానంటే -

(1) అస్పృశ్యత వల్ల బాధపడుతున్న వాళ్లు మాలమాదిగలు.

(2) ఈ బాధను తొలగించుకోడానికి ప్రధానంగా ప్రయత్నించవలసిన వాళ్ళు మాలమాదిగలే.

(3) అస్పృశ్యత ఒక సామాన్యమైన పిశాచం కాదు. అదొక బ్రహ్మ రాక్షసి. మాటలు, మంత్రాలు ఏవీ దానిమీద పని చెయ్యవు.

(4) ఈ రాక్షసి మాలమాదిగల అభ్యుదయ మార్గంలో తిష్ఠ వేసుకు కూర్చుని ఉంది.

(5) దాన్ని ఎదిరించి, ఓడించి, అవతల పారవేసి, ముందుకు పోవలసిన విధ్యుక్త ధర్మం మాలమాదిగల మీదే ఉంది.

(6) అందుకు కార్యక్రమం మాలమాదిగ పేటలలోనే ప్రారంభం కావలసి ఉంది. ప్రత్యేకంగా మాలమాదిగలకే నేను ఈ ఉద్బోధ చెయ్యడానికి అదీ కారణం.

## 29

అస్పృశ్యతకు, కుల వ్యవస్థకు వ్యతిరేకులైన - అభ్యుదయ గాములైన - విప్లవ చైతన్యం కల యువకులెందరో ఇతర కులాలలో ఉన్నారు.

అట్టి వారంతా మాలమాదిగలకు ఈ విషయంలో తోడ్పడవలసి ఉంది. మాలమాదిగలు చైతన్యవంతులై, తమ శృంఖలాలను త్రెంచుకొని బైటపడడానికి సహాయపడవలసిందిగా - కుల మత విచక్షణ లేకుండా - భారతీయ యువకులందర్నీ నేను ఆహ్వానిస్తున్నాను.

## 30

గాంధీజీ హరిజన సేవక సంఘాన్ని నెలకొల్పినప్పుడు - దాని నిర్వహణ బాధ్యతను పూర్తిగా అగ్రకులాల వారికే అప్పగించాడు. " అస్పృశ్యత అనేది అగ్రకులాల వాళ్ళు చేసిన పాపం. వాళ్ళ పాపాన్ని వాళ్ళే తొలగించుకోవాలి" అన్నాడాయన.

అయితే – ఏం జరిగింది? పాపం ఎంత వరకు తొలగింది? స్వాతంత్ర్యం వ్రత అది ఇంకా పెరిగింది. పగటి వేషం కట్టి తాండవిస్తోంది! హరిజన సేవక సంఘం కూడ పని చెయ్యడం మానేసింది!

## 31

హరిజనులు ఇప్పటికే పైకి వచ్చేశారని ప్రచారం చేస్తున్న వాళ్ళు పచ్చి వంచకులు. ప్రభుత్వాన్నీ, హరిజనాభివృద్ధి కార్యక్రమాలనూ తప్పుదారి పట్టించడం కోసం జరుగుతున్న దుష్ప్రచారం అది.

హైదరాబాదు నగరంలోను, పట్టణాలలోను, గ్రామాలలోను ఉన్న మాలమాదిగ పేటల్నీ, అక్కడ బ్రతుకుతున్న మాలమాదిగ ప్రజల్నీ చూస్తే. వాస్తవం కళ్ళబడుతుంది.

పడక కుర్చీలలో తాంబూలం సేవిస్తూ కూర్చుని, ప్రపంచమంతా ఉద్ధరించబడిందని కలలు కంటున్న పెద్దలెవరైనా ఉంటే – అట్టి వారిని తీసుకువెళ్ళి, మాలమాదిగ పేటల్ని చూపండి!

## 32

శుభ్రంగా ఉండమనడం, మత్స్య మాంసాదులు మానమనడం, గుడుల్లోకి ప్రవేశం కల్పించడం, కొద్దిమంది చదువుకున్న వాళ్ళతో రాసుకు తిరగడం, ఏదో పదిమందికి ఊరికి దూరంగా ఇళ్ళ స్థలాలివ్వడం – ఇదీ ఇంతవరకు జరిగిన హరిజనాభివృద్ధి కృషి !

## 33

లక్ష ఎకరాల పొలాన్ని దోసెడు నీళ్ళతో సాగు చెయ్యడానికి ప్రయత్నించడం ఎలాంటిదో – మాలమాదిగల అభివృద్ధికి నేడు జరుగుతున్న కృషి అలాంటిది.

ఇది కళ్ళనీళ్ళు తుడిచే పని. ఇందులో నిజాయితీ లేదు.

బాధితులైన వాళ్ళు ఎంతకాలం కళ్ళు మూసుకొని మూలుగుతూ పడి ఉంటారో – అంతకాలం వాళ్ళకు న్యాయం జరగదు.

కనుక - ఓ మాలమాదిగ యువకుల్లారా! కళ్లు తెరిచి కర్తవ్యం యోచించండి!

## 34

హరిజనులు అభివృద్ధి పొందటం అంటే మాలమాదిగ పేటలు వాస యోగ్యంగా మారడం.

అస్పృశ్యత పోవడం అంటే నడిబజారులో ఒక మాలమాదిగవాడు మిఠాయి దుకాణం పెట్టుకొని బ్రతకడం.

కుల వ్యవస్థ నశించడం అంటే ఒక మాలమాదిగ పేటలో అమ్మాయిని ఆ ఊరి అగ్రవర్ణ యువకుడు వేదోక్తంగా పెళ్ళాడడం.

## 35

ఆంధ్ర దేశంలో మాలమాదిగ పేటల్ని ఒక ఏభై సంవత్సరాలుగా ఎరుగుదును నేను. ఈ ఏభై సంవత్సరాలలోను ఎన్నో ఉద్యమాలు నడిచినై. ఎంతోమంది నాయకులు, సంస్కర్తలు గొప్పవాళ్ళై చచ్చిపోయారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. పాత జమీందార్లు పోయారు. కొత్తవాళ్ళు జమీందార్లైనారు. మూడు పంచవర్ష ప్రణాళికలు గడిచినై. కోటానుకోట్ల స్వదేశీ విదేశీ ధనం ఖర్చయింది. ఎంతోమంది హరిజనులు శాసనసభ్యులు, మంత్రులు కూడ అయినారు.

అయితే - మాల మాదిగలకు ఏం జరిగింది?

మాల మాదిగ పేటలు ఏభై ఏళ్ళనాడు ఎలా ఉన్నాయో ఈ నాడూ అలానే ఉన్నై.

అవే మురికిపేటలు, అవే పూరిగుడిసెలు, అవే చిల్లుకుండలు, చింకి చాపలు, గుడ్డ పేలికలు, ఎముకల గూళ్ళు, అదే కూలిపని, అర్ధాకలి, పస్తులు.

మరీ ఘోరమైన విషయం ఏమిటంటే-స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైన తర్వాత, పంచాయితీ రాజ్యం అమలులోకి వచ్చిన తర్వాత, మాల మాదిగల బ్రతుకు మరీ దీనంగా, దిక్కులేనిదిగా తయారైంది. వాళ్ళ అతీగతీ కనుక్కునే నాథుడే లేకుండా పోయాడు.

## 36

పత్రికలు చూడండి. ప్రకటనలు చూడండి. సమాజాభివృద్ధి కోసం, దరిద్రుల ఉద్ధరణకోసం, సాంస్కృతిక వికాసం కోసం ఎన్నో సంఘాలు, కమిటీలు, కమీషన్లు, చర్చలు, సెమినార్లు, పథకాలు, ఖర్చుల మంజూర్లు, నిధుల కేటాయింపులు, గ్రాంట్లు, ఋణాలు ప్రతిరోజూ వందలు, వేలు కనిపిస్తూనే ఉంటై. అవన్నీ ఏం పని చేస్తున్నై? ఏమిటి సాధిస్తున్నై? రోజు రోజుకూ దేశం ఇలా దారిద్ర్యంలోకీ, అసమర్థతలోకీ, అవినీతిలోకీ, అశిక్షణలోకీ, అంధకారంలోకీ దిగజారి పోతున్నదేమీ?

పోనీ, ఏదో సాధించ బడుతున్నదనే అనుకున్నా- అది మాల మాదిగల పేటల దాకా రావడం లేదేమి?

మొత్తం మీద ప్రజల జీవన ప్రమాణం పెరిగింది కదా, ప్రజలలో మాల మాదిగలు ఒక భాగమే కదా, అంటే- న్యాయంగా అంతే. కాని మాల మాదిగల విషయంలో న్యాయం జరిగిందెప్పుడు?

"ప్రజలు" అన్న మాటలో మాల మాదిగలు కూడ ఇమిడి ఉన్నా రన్న జ్ఞానం ఈ దేశంలో ఎంత మంది కుంది?

"ప్రజలకు తిండి" అంటే, అగ్రవర్గాల వారికి తిండి అనే కదా ఇప్పటికీ అమలులో ఉన్న అర్థం?

"గ్రామాభివృద్ధి" అంటే అగ్రవర్గాల వారుండే ప్రాంతం అభివృద్ధి అనే! అందులో మాల మాదిగ పేటలు చేరవు!

గ్రామాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి చూడండి! ఒక్క మాల మాదిగ పేటకైనా రోడ్లు వేయబడ్డాయా? విద్యుద్దీపాలు ఇవ్వబడ్డాయా?

## 37

చదువులు స్కాలర్షిప్పులు, హాస్టళ్ళు, ఉద్యోగాలు – ఈ రంగాలలో జరిగినట్టు కనిపిస్తున్న కృషి నిజమైంది కాదు. అభివృద్ధి స్థిరమయింది కాదు.

నేటి హరిజన విద్యార్థులు, హరిజన ఉద్యోగులు గారడీవాడి చేతిలో మెరుస్తున్న వెండి రూపాయల లాంటి వాళ్ళు. నిజమైన ధనం కాదది. వట్టి కనుకట్టు!

పట్టణాలలోను, గ్రామాలలోను కూడ అగ్రవర్గాల వారుండే ప్రాంతాలతో సమానంగా మాల మాదిగలుండే ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే తప్ప, నిజమైన అభివృద్ధి జరిగినట్టు కాదు.

## 38

**భా**రత రాజ్యాంగ నిర్మాణ సంఘాధ్యక్షుడు డాక్టరు అంబేద్కరు.

భారత దేశంలో ప్రజాస్వామిక సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం మన రాజ్యాంగ లక్ష్యం.

స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి ఇరవై సంవత్సరాలయింది.

ఈ లక్ష్యంవైపు ఒక్క అంగుళమైనా పురోగమించామా?

కొన్ని ఆర్థిక సంస్థల్ని జాతీయం చేశాం. కొన్ని పరిశ్రమల్ని ప్రభుత్వ రంగంలో నెల కొల్పాం. అవి కూడా అంతంత మాత్రంగానే ఉన్నై. ఎందువల్ల?

ప్రతిపార్టీ లక్ష్యమూ సోషలిజమే అయినప్పుడు, వయస్సు వచ్చిన ప్రతివ్యక్తికీ ప్రభుత్వాన్ని శాసించే హక్కున్నప్పుడు, లక్ష్యం రోజు రోజుకూ ఎందుకు దూరమై పోతున్నది?

లక్ష్యాన్ని అవతలకు నెట్టి పార్టీల నాయకులూ, హక్కుల్ని అవతలకి నెట్టి వోటర్లూ – స్వార్థంతో, కుల మత పక్షపాతంతో, ధనాశతో, పదవీ వ్యామోహంతో కళ్ళు మూసుకొని ఎందుకు వ్యవహరిస్తున్నారు?

లోపం ఎక్కడుంది?

## 39

**కాం**గ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు వంటి పార్టీలు, ప్రణాళికలు అన్నీ కూడ చేసిన పొరపాటు, చూపిన బలహీనత ఒకే ఒక్కటి. అది దేశంలోని పెట్టుబడి దారుల, భూస్వాముల, మత దురహంకారుల పలుకుబడికి లొంగిపోయి, సామాన్య ప్రజల శ్రేయస్సును విస్మరించడం.

## 40

నాయకత్వం క్రింది వర్గాల నుంచి రావాలి. నాయకులు ధనాశ, పదవీ కాంక్ష లేనివారై, సమిష్టి శ్రేయోదృష్టి కలిగినవారై ఉండాలి.

ఏ నిర్మాణమైనా పునాదుల నుంచి జరగాలి, ఆకాశం నుంచి కాదు.

భారత దేశంలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలనుకొంటే - అట్టి నిర్మాణం మాల మాదిగ పేటల నుంచి ప్రారంభం కావాలి. భారత సమాజానికి పునాదులు మాల మాదిగ పేటలే.

## 41

మన రాజ్యాంగం క్రింద, మన దేశంలో ప్రజాస్వామిక సోషలిజం నెల కొనాలంటే - అందుకు జరగవలసిన కార్యక్రమం ఇది.

(1) భూమి యావత్తూ జాతీయం చేయబడి, వ్యవసాయం ప్రభుత్వ రంగంలో నిర్వహించబడాలి.

ఏ గ్రామంలోని భూమి ఆ గ్రామ వ్యవసాయ శాఖ అధీనంలో ఉంటుంది. గ్రామ ప్రజల అవసరాలకు సరిపడ్డ ధాన్యం అక్కడి ప్రభుత్వ గోదాములో ఉంచబడుతుంది. మిగిలింది పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు సరఫరా చెయ్యబడుతుంది.

(2) అగ్ర వర్గాలుండే గ్రామాల మధ్యలో - ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ - అక్కడి హరిజనులకు ఇళ్ళు కట్టబడాలి.

ఆ ఇళ్ళు మామూలు గుడిసెలు కారాదు. ఆ ప్రాంతపు అగ్రకులాలవారి ఇళ్ళకు అవి ఏ విధంగానూ తీసిపోరాదు.

(3) ఏ గ్రామం మధ్యలో అయినా ఖాళీ స్థలాలు లేకపోతే గ్రామానికి ఆనుకొని, వీధులతో వీధులు కలిసిపోయే విధంగా, హరిజనులకు ఇళ్ళు కట్టబడాలి.

ఈ విధంగా గ్రామం మధ్యలోగాని, గ్రామానికి చేర్చికాని, ఆ గ్రామం హరిజనులకు ఇళ్ళు కట్టబడ్డప్పుడు - మాలమాదిగ పేటలు వేరుగా ఉండడ మనే దుస్థితి తొలగిపోతుంది.

(4) కాపు, కమ్మ, రెడ్డి వగైరా కులాల వారంతా ఒక గ్రామంలో ఎలా కలిసిపోయి నివసిస్తున్నారో, అలానే హరిజనులు కూడ వారితో కలిసిపోయి నివసించే విధంగా గ్రామ పునర్నిర్మాణం జరగాలి.

ఈ పునర్నిర్మాణానికి అవసరమైన డబ్బును సమకూర్చడానికి ప్రత్యేక ఫైనాన్సు కార్పొరేషనులను ఏర్పాటు చేయ్యాలి.

ప్రతి జిల్లాకు ఒక కోటి రూపాయలతో ఒక ఫైనాన్సు కార్పొరేషనును ఏర్పాటు చేసి, జిల్లాకు రెండు మూడు గ్రామాల చొప్పున ఎంచుకొని, ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తే చాలు. కొద్ది సంవత్సరాలలోనే అద్భుతమైన ఫలితాలు వాటికవే సాధించ బడగలవు.

మాల మాదిగల పునరావాసం కోసం ఈ విధంగా జిల్లా కొక కోటి రూపాయల చొప్పున కేటాయించడం ప్రభుత్వానికి కష్టమైన పనేమీ కాదు.

ఎన్నో లక్షల, కోట్ల రూపాయలను ప్రణాళికల కోసం ఖర్చు చేస్తున్న ప్రభుత్వం - దేశం జనాభాలో అయిదోవంతు ప్రజలైన మాల మాదిగలకోసం ఈ మాత్రం చిన్న ప్రాజెక్టును నిర్వహించవచ్చు. అన్ని ప్రాజెక్టుల కంటే ఇదే నిజమైన, సరియైన ప్రాజెక్టు.

(5) ఈ ప్రాజెక్టు క్రింద హరిజనుల ఇళ్ళను గ్రామాలతో చేర్చి పునర్నిర్మిస్తున్నప్పుడు, వెనుకబడిన కులాలవారి పేటలను కూడ, అవి వేరు వేరుగా ఉన్న సందర్భాలలో, ఈ కార్యక్రమంలో చేర్చాలి.

పేటలు కులాల వారిగా ఉండకూడదు. కులాల పేర్లతో పిలువ బడగూడదు.

ఇలా జరిగినప్పుడే అస్పృశ్యత తొలగిపోయినట్టు. కులతత్త్వం నశించినట్టు

(6) అస్పృశ్యతతో పాటు కుల వ్యవస్థను తొలగించడానికి పూనుకోవాలి. అందుకు వర్ణాంతర వివాహాలు విరివిగా జరగాలి.

అస్పృశ్యతా, కుల వ్యవస్థా తొలగిపోవడంతో, భూమి జాతీయం చేయబడడంతో, దేశంలో సోషలిస్టు సమాజ నిర్మాణం ప్రారంభ మవుతుంది. అంతవరకు కాదు.

(7) శిశు రక్షణ, విద్యాబోధన, వృత్తి నిర్వాహణ, వైద్య చికిత్స, వృద్ధాప్య సహాయం వంటి మానవ జీవిత ప్రాథమికావసరాలన్నీ ప్రభుత్వమే ఉచితంగా కల్పించడంతో, సోషలిస్టు సమాజనిర్మాణం పూర్తి అవుతుంది.

(8) భావన, భావ ప్రకటన, రచన, ప్రవర్తన – ఈ నాలుగు విషయాలలోను వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండి, జీవిత ప్రాథమిక సౌకర్యాలు అందరికీ సమానంగా లభించే సమ్యక్ సామాజిక వ్యవస్థే ప్రజాస్వామిక సోషలిజం నా దృష్టిలో. అట్టి సోషలిజం దేశంలో నిర్మించబడాలి. దేశ దేశాలకు అందజెయ్యబడాలి.

(9) దేశంలో కుల వ్యవస్థను వలెనే, గ్రామ వ్యవస్థను కూడ రద్దు చేయాలి.

కనీసం పదిమంది డాక్టర్లను, పదిమంది లాయర్లను, ఒక హైస్కూలును, ఒక నాటకశాలను పోషించుకోడానికి తాహతులేని గ్రామాలన్నిటిని రద్దు చేయ్యాలి. అట్టి చిన్న గ్రామాలను సమీప పట్టణంలో కలిపి వెయ్యాలి. పట్టణాల అభివృద్ధిని ప్రోత్సాహించాలి. కుగ్రామాల రద్దుతో, భూమి జాతీయకరణతో, వ్యవసాయం ప్రభుత్వ రంగంలో పెద్ద యెత్తున్న జరగడానికి వీలు కలుగుతుంది. ప్రజలంతా పట్టణాలలో, ఆధునిక సౌకర్యాలన్నిటినీ అనుభవిస్తూ జీవిస్తూనే, పరిశ్రమలలో కృషి చేస్తూనే – వేలకొలది ఎకరాల పొలాలను సాగుచేసి పండించడానికి, జన బాహుళ్యానికి తిండిని పుష్కలంగా అందించడానికి వీలు కలుగుతుంది.

## 42

వైద్యం, విద్య, వికాసం లేకుండా పల్లెటూళ్ళలో పశువుల్లా బ్రతుకుతున్న వేలకొలది మానవుల్ని ఉద్ధరించాలంటే – కుగ్రామాలను రద్దుచేసి, పట్టణీకరణను ప్రోత్సహించడం కంటే గత్యంతరం లేదు.

ప్రజా స్వామిక సోషలిజమే భీమసేన లక్ష్యం.

అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించే కృషితో దాని కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

నేను ఈ గ్రంథంలో పేర్కొంటున్న లక్ష్యాలను సాధించడానికి, సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి ప్రజలందరి విశ్వాసాన్ని చూరగొన్న ఏదో ఒక పార్టీ

అవసరం. అట్టి పార్టీని భీమసేన అంటున్నాను. మీరంతా కలిసి అట్టి సంస్థకు లోక సమాఖ్య, ప్రజా పరిషత్తు వంటి మరో పేరేదైనా పెట్టుకోవా లనుకుంటే – అలాగే పెట్టుకోవచ్చు. పేరేదైనా– అట్టి సంస్థకు విప్లవమే ప్రధాన లక్ష్యంగా ఉండాలి.

## 43

**ఆ**కాశం, గాలి, అగ్ని, జలం, భూమి– అయిదూ పంచభూతాలు. వీటిని అనుభవించే హక్కు ప్రతిప్రాణికీ సమానంగా ఉంది.

ప్రకృతి సిద్ధమైన ఈ హక్కును కొద్దిమంది వ్యక్తులు తమ స్వాధీనంలోకి తెచ్చుకొని, తక్కిన ఆశేష ప్రజానీకాన్ని దారిద్ర్యంలో అణిచిపెట్టి ఉంచడానికి ప్రయత్నం ప్రారంభించిన నాటి నుంచే మానవ జాతికి త్రిప్పలు మొదలైనై.

## 44

**పం**చ భూతాలలో ఒకటైన భూమి కొందరిదే ఎలా అయింది?

కొందిరికి వేల కొలదీ ఎకరాలు ఉండి – మరి కొందరికి ఇళ్ళ స్థలాలు కూడ ఎందుకు లేకుండా పోయినై?

బ్రిటీషు ప్రభుత్వమూ, సర్వే పద్ధతీ రాకముందు దున్నేవాడిదే భూమి కాదా?

దున్నే వాళ్ళలో అధిక సంఖ్యాకులు మాల మాదిగలే కాదా?

భూమిని దున్ని పండించే వాళ్ళు సెంటు నేల కూడా లేని నిర్భాగ్యులెలా అయారు?

స్వయంగా ఆహారోత్పత్తికీ, ధనోత్పత్తికీ, ఏ విధంగానూ తోడ్పడని అధికార భోగలాలసులకు అంత ఆహారమూ, ధనమూ ఎలా వస్తున్నై?

## 45

**భూ**ముల్నీ, ఆస్తుల్నీ జనం అందరికీ సమంగా పంచాలని మనం కోరడం లేదు. అవి జాతిపరం కావాలనీ, మొత్తం జాతియొక్క సాముదాయిక అభివృద్ధికి తోడ్పడాలనీ మాత్రం కోరుతున్నాం.

# 46

భూమిని జాతీయం చేయడం, హరిజనుల్ని కలుపుకొని గ్రామ పునర్నిర్మాణం జరగడం, కుగ్రామాలను రద్దుచెయ్యడం – ఈ మూడు కార్యక్రమాలూ ప్రారంభమయ్యేలోగా, అందుకు నాందిగా, ఈ క్రింది కార్యక్రమం వెంటనే చేపట్టబడాలి!

(1) ప్రస్తుతం నగరాలలోను, పట్టణాలోను, గ్రామాలలోను మంజూరవుతున్న గృహ నిర్మాణ పథకాలలో – అవి ప్రభుత్వానివి కానీ, ప్రైవేటువి కానీ – జనాభాను బట్టి నూటికి ఇరవై ఇళ్ల చొప్పున హరిజనులకు ప్రత్యేకించబడాలి. అందుకు తగిన పరపతిని వారికి ప్రభుత్వం కలిగించాలి.

(2) వ్యాపారం, పరిశ్రమలు, కాంట్రాక్టులు, కళలు మొదలైన వివిధ వృత్తులలోను, జీవిత విధానాలలోను ధైర్యంగా మాల మాదిగలు ప్రవేశించడం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక ఆర్థిక సహాయ సంస్థను నెలకొల్పాలి.

(3) జనాభాను బట్టి మంత్రి వర్గాలలోను, తదితర అధికార అనధికార సంఘాలలోను, సంస్థలలోను విధిగా ప్రాతినిధ్యం కల్పించాలి.

(4) అప్పుడప్పుడు, అక్కడక్కడ హరిజనులకు మంజూరు చేయబడుతున్న ఇళ్ళ స్థలాలు తరచు ఊరికి దూరంగా ఇవ్వబడుతున్నాయి. అలా జరగరాదు. అట్టి స్థలాలు ఊరు మధ్యలోగాని, ఊరికి చేర్చిగాని ఇవ్వబడాలి.

(5) వర్ణాంతర వివాహాలను ప్రభుత్వం ఆర్థిక సహాయం ద్వారా ప్రోత్సాహించాలి.

(6) ప్రమోషనులలో కూడ షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వాలి. సర్వీసు కమిషను, సెన్సారుబోర్డు, పారిశ్రామిక కార్పొరేషన్లు వంటి వాటిలోను, ప్రభుత్వ శాఖలలోను ఉన్నతాధికార సభ్యులుగా నియమించాలి.

(7) సనాతనమైన భారతీయ కళాసంపద మాలమాదిగలలోను, వెనుకబడ్డ కులాలలోను దాగిఉంది. ప్రోత్సాహంలేక, చిక్కి శల్యావశిష్టంగా ఉంది. అది ఉద్ధరించబడాలి. అందుకు సాంఘిక సంక్షేమ శాఖలో సాంస్కృతిక పునరుజ్జీవన అధికారులను నియమించాలి.

అట్టి అధికారులు మాల మాదిగలలోను, తదితర వెనుకబడ్డ కులాలలోను సాంస్కృతిక ప్రబోధం చేస్తారు. నాటకాలు, నాట్యాలు, ఆటలు, పాటలు, సంగీతం, మోళీ, గారడీ, మాస్టిడి, గడ, రుంజా, సోది, జానపద నృత్యాలు, ఆటలు, కధలు, తోలుబొమ్మలు, చిందులు, దప్పులు, సాము, గరిడీ, కోలాటం వగైరా సనాతన జానపద కళలను పునరుద్ధరిస్తారు.

ఈ నాడు భారతీయ సంస్కృతిగా తైతక్క లాడుతున్న దేదీ భారతీయం కాదు. విదేశీ వెర్రి తలలకు అది నకలు మాత్రమే. అందుకే అంతర్జాతీయ రంగంలో మనం ఎందుకూ పనికి రాకుండా పోతున్నాం.

## 47

విప్లవ వాదుల మని చెప్పుకునే అగ్ర కులాలకు చెందిన వారికి సొంతంగా ఆలోచించే శక్తిలేదు. విదేశీ ఇజాలను స్వదేశీ నిజాలకు మలుచుకొనే ప్రతిభలేదు.

భారత దేశంలో ఉన్నవి వర్గాలు కావు, కులాలు. ఇక్కడిది వర్గ పోరాటం కాదు, కులపోరాటం.

వర్గాలలో అంత్య వర్గం కార్మికులు. కులాలలో అంత్యకులం మాల మాదిగలు.

కార్మికులకు లేని అదనపు అసౌకర్యం మాల మాదిగలకుంది. అది అంటరాని తనం.

అందుకే – ఈ భారత దేశంలో మానవుడు మానవుడుగా బ్రతకాలంటే, పురోగమించాలంటే, పూర్ణవికాసం పొందాలంటే అస్పృశ్యత పోవాలి. కుల వ్యవస్థ నశించాలి.

అట్టి పనికి పూనుకోగలవాళ్లు, ప్రాణాలను బలిపెట్టి అయినా దానిని సాధించగలవాళ్లు ఒక్క మాలమాదిగలే!

నే నిస్తున్న నినాదానికి మూల హేతువు కూడా అదే!

మాల మాదిగ యువకుల్లారా! ఏకం కండి! అస్పృశ్యతపై, కుల వ్యవస్థపై కత్తికట్టండి!

## 48

భారత దేశంనుంచి, హైందవ సమాజం నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ నిర్మూలించడం అంటే మాటలు కాదు. నీతులు, ఉద్బోధలు, ప్రచారం, మతాంతరీకరణ వంటివేవీ లాభంలేదు. ఈ పద్ధతులన్నీ తరతరాలుగా, మహామహులుగా పేరొందిన అనేక మందిచే అనుసరించబడుతూ వస్తున్నట్టివే. అవన్నీ విఫలం కావడానికి కారణం మాల మాదిగలలో చైతన్యం లేకపోవడమే. తాము కూడా ఇతరులవలె మానవులమే అన్న జ్ఞానం కలగకపోవడమే.

## 49

ఇప్పుడు జరగవలసిం దేమిటి? వాస్తవ కార్యక్రమం ఏమిటి? మన కార్యక్రమాన్ని మాల మాదిగ పేటల నుంచి ప్రారంభించాలనుకొన్నాం కదా. ఎలా ప్రారంభించాలి?

అందుకు క్రమబద్ధంగా అనుసరించవలసిన కార్యక్రమం ఇది:

(1) ముందుగా మాల మాదిగలు ఏకం కావాలి.

(2) హరిజన విద్యావంతులలోను, ఉద్యోగులలోను ధైర్యాన్నీ, త్యాగబుద్ధినీ స్వజన సేవాసక్తినీ, కళాహృదయాన్నీ పెంపొందించాలి.

(3) ఇతర వెనుకబడ్డ కులాల వారిలో ప్రస్తుతం ఉన్న అజ్ఞానాన్నీ, అపోహలనూ తొలగించాలి.

(4) అగ్రకులాల యువకులలో అభ్యుదయ భావాలు, దూరదృష్టి, జాతి సాముదాయక పురోభివృద్ధి కాంక్షా కలవారు అనేక మంది ఉన్నారు. అట్టి వారందర్నీ మన ఉద్యమంలోకి ఆకర్షించాలి. వారికి వాస్తవ పరిస్థితుల్ని వివరించి చెప్పి, లక్ష్యాన్ని స్పష్టంగా చూపి, కార్యక్రమాన్ని అసందిగ్ధంగా ఆవిష్కరించాలి.

(5) అభ్యుదయకరమైన ప్రభుత్వ శాసనాలు ఖచ్చితంగా అమలు జరిగేటట్టు చూడాలి.

(6) కులమత విచక్షణ లేకుండా– అన్యాయం, అక్రమం, ఎక్కడ ఎవరికి జరిగినా ప్రతిఘటించడానికీ, స్వపర బేధం లేకుండా ధర్మాన్ని పరిరక్షించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.

(7) వర్ణాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలి.

(8) పేదరికాన్ని రూపుమాపేందుకు, సంపదను పెంచేందుకు, కులమత భేదాలను తొలగించేందుకు, ఐక్యతను పోషించేందుకు జరిగే ప్రతి పనికీ తోడ్పడాలి.

## 50

మాల మాదిగలు ఏకం కాకుండా - దేశంలో ప్రజలకోసం ఏ మంచి పనీ జరగదు. అస్పృశ్యత పోదు. అస్పృశ్యత పోకుండా కుల వ్యవస్థ నశించదు. అది నశించకుండా జాతికి పురోగతి లేదు. స్వాతంత్ర్యం పేరుతో, ప్రజాస్వామికం పేరుతో ఈ ఇరవై సంవత్సరాలూ జరిగిన పరిపాలన ఈ సత్యాన్ని నిరూపిస్తున్నది.

## 51

హరిజనులు, షెడ్యూల్డు కులాలు, మాలమాదిగలు - ఈ మూడు మాటలను నేను ఒకే అర్థంలో అస్పృశ్యులుగా చూడబడే వర్గం ప్రజలకు వాడుతున్నాను.

రాజ్యాంగంలో, ఒక షెడ్యూలులో (అనుబంధంలో) పేర్కొనబడ్డ కులాలు కనుక షెడ్యూల్డు కులాలు అంటున్నారు. అంటరాని తనం పోతే, షెడ్యూలు కూడ పోతుంది.

దేశం మొత్తం మీద అంటరాని వారుగా పేర్కొనబడే వారిలో మాల మాదిగలే మెజారిటీ కులం. అందుకే షెడ్యూల్డు కులాలన్నింటికీ కలిపి మాలమాదిగ అనే మాటను వాడాను. నాకు బాగా ఇష్టమైన మాట ఇది.

హరిజన అనేది ఒక కవి వాడిన పేరు. ఎవరో గుజరాతీ కవి కాబోలు అంటరానివారు హరి (భగవంతుని) యొక్క బిడ్డలని, పవిత్రులని చెప్పడానికి ఆ మాట వాడాడు. ఆ మాటను గాంధీజీ తీసుకుని ప్రచారం చేశాడు.

ఇది ఒక కవి నోటి నుంచి వచ్చినమాట కనుకను, కుల వ్యవస్థలో శూద్రుల తర్వాత పంచమ కులంగా మాలమాదిగలు పిలవబడుతూ ఉండడం వల్లను, ఈ మాట దేశం మొత్తంమీద వాడుకలోకి వచ్చి ఉండడం వల్లను, "హరిజన" పదాన్ని కూడ వాడాను.

ఇవికాక– నిరుద్ధ అనేమాట ఒకటి ఉంది. దాని అర్థం నిరోధించబడ్డ, ఆటంక పరచబడ్డ అని అర్థం. నిరుద్ధకులాలు అనికూడ అనవచ్చు. నేను ఈ గ్రంథంలో ఈ నాలుగు పదాలను ఆనుకూల్యాన్ని బట్టి పర్యాయపదాలుగానే వాడాను.

## 52

హైందవ సమాజంలో నాలుగే వర్ణాలున్నాయనీ, అయిదోది లేదనీ మనుస్మృతిలో మనువు చెప్పాడు. అసలు మూడు వర్ణాలే. శూద్రులు నాలుగో వర్ణంగా తర్వాత చేర్చుకోబడ్డారు. ఇప్పుడు మాల మాదిగలు అయిదో వర్ణంగా (పంచమ వర్ణంగా) పరిగణించబడుతున్నారు.

శూద్ర వర్ణంలో అనేక కులాలున్నై. కాపు, కమ్మ, రెడ్డి, వెలమ, గౌడ, బలిజ, రజక, యాదవ, ముదిరాజ వగైరా ఎన్నో కులాలు అందులో కలిసి ఉన్నై. ఆ కులాలన్నీ కలిసి ఐక్య పోరాటం జరపడం వల్లనే, అగ్ర వర్ణాలుగా చెప్పబడే ఆ మూడు వర్ణాలు సమాధానపడి, శూద్ర వర్ణానికి తమ గ్రామ వ్యవస్థలో గౌరవ ప్రదమైన స్థానాన్ని ఇవ్వడం జరిగింది. వర్ణాలు నాలుగైనై.

కాలక్రమంలో, ఏ కారణం చేతనైతేనేమి, ఇప్పుడు పంచమ (అయిదో) వర్ణం తయారయింది. ఇది ఇంకా అంటరానిదిగానే పరిగణించ బడుతున్నది.

ఈ పంచమ వర్ణంలోని కులాలన్నీ కలిసి, ముఖ్యంగా మాల మాదిగలు కలిసి, ఐక్య పోరాటం జరపకుండా వీరికి న్యాయం ఎలా జరుగుతుంది? గ్రామ వ్యవస్థలో గౌరవ ప్రదమైన స్థానం ఎలా లభిస్తుంది?

చరిత్ర పునరావృత్తం కాక తప్పదు.

ఆ నాడు శూద్రులవలెనే, ఈ నాడు హరిజనులు కూడా, మానవత్వం

కోసం సమానత్వం కోసం, ధర్మం కోసం, దైవం కోసం- ప్రాణాలకైనా తెగించి నాల్గుపడగల హైందవ నాగరాజుపై తొడగొట్టక తప్పదు.

ఈ పరిస్థితిని వాయిదా వెయ్యగలమే కాని, తప్పించుకోలేం. కనుక, దాన్ని నేడే ఎదుర్కొని పరిష్కరించి వెయ్యడం ఉభయత్రా శ్రేయస్కరం కాదా?

అందుకే- హరిజనులకు, అంటే మాలమాదిగలకు, ఈ హెచ్చరిక చేస్తున్నాను.

దేశం జనాభాలో సుమారు అయిదోవంతు మాలమాదిగలే.

కులాల వారీగా లెక్క చూచుకుంటే, దేశంలో మెజారిటీ కులం మాలమాదిగలే.

మెజారిటీ కులాన్ని మైనారిటీ కులాలు అణచిపెట్టి ఎందుకు ఉంచుతున్నై?

హరిజన యువకుల్లారా! ఆలోచించండి!

## 53

వర్గాలున్నంత వరకు వర్గ పోరాటం ఎలా తప్పదో, కులాలున్నంత వరకు కుల పోరాటం అలా తప్పదు.

వర్గ రహిత సమాజాన్ని, కార్మికవర్గం మాత్రమే స్థాపించగలదు. కులరహిత ప్రజాస్వామిక సోషలిజాన్ని హరిజన కులం మాత్రమే నెల కొల్పగలదు.

## 54

హైందవ సమాజం నుంచి కుల వ్యవస్థ రూపుమాసిపోయేదాకా మాలమాదిగ కులం ఉండక తప్పదు.

(1) మాల మాదిగలు తమలో తమకు గల అంతర్విభేదాలను తొలగించుకొని ఒకే ఒక కులంగా రూపొందేవరకూ-

(2) ఆ తర్వాత - వెనుకబడ్డ కులాలూ, మధ్యతరగతి కులాలూ తమ కులతత్వ శృంఖలాలను త్రెంచేసుకొని, దేశంలో కులవ్యవస్థ లేని ఏక సమాజ గ్రామాలు ఏర్పడేవరకూ-

మాల మాదిగల అభివృద్ధికోసం ప్రత్యేక కృషి జరగకతప్పదు. అందుకు ముందుగా మాలమాదిగ యువకులు త్యాగాలు చెయ్యక తప్పదు.

## 55

అస్పృశ్యత పేరుతో అమానుషంగా అణచిపెట్టబడ్డ వాళ్ళు మాలమాదిగలు. అందువల్ల మాల మాదిగ యువకులలోనే విప్లవ చైతన్యం ఉరకలు వేస్తూ ఉండాలి. తెగింపు, త్యాగం, పట్టుదల పరాకాష్ఠ పొంది ఉండాలి. ఆగిపోయిన మానవతా జీవధారకు తిరిగి ప్రాణం పోయగల నవయువకులు ఒక్క మాలమాదిగ పేటలలోనే ఉన్నారు. కనుక, వారికే నేను ఈ ఉద్బోధ చేస్తున్నాను. ఏకం కమ్మంటున్నాను. ధర్మంకోసం పోరాడమంటున్నాను.

## 56

మాల మాదిగలు ఏకం కావడం ఎలా?

మాల మాదిగ– ఈ రెండూ వేరు వేరు కులాలుగా ఉంటున్నై కదూ ఇప్పుడు?

ఈ రెంటికీ మధ్య పరిస్థితులలో కాని, ఆహార విహారాలలో కాని, వేషభాషలలో కాని, ఊరికి వెలపల గుడిసెల్లో ఉండడంలోకాని, అగ్రవర్గాలకు వెట్టి చాకిరీ చెయ్యటంలో కాని, దారిద్ర్యంలో కాని–ఏ విషయంలో అయినా కానీ, తేడా ఏమైనా ఉన్నదా?

మాల మాదిగ పేటల మధ్య కాని, వారి వృత్తులమధ్య కాని, పరిశుభ్రతలో కాని తేడా ఏమైనా ఉన్నదా?

తేడా ఏమాత్రమూ లేనప్పుడు, ఉభయులూ ఒకేరకమైన బాధలకు అవమానాలకు, అన్యాయాలకు గురి అవుతున్నప్పుడు మాలమాదిగలు ఏకమై, ఒకే ఒక కులంగా కలిసిపోవడం విజ్ఞత కదా?

నియోగులు, వైదికులు, వైష్ణవులు, ద్రావిడులు వగైరా ఎన్నో శాఖలు కలిసి ఒక్క బ్రాహ్మణకులం అయినట్టు మాల, మాదిగ, పాకీ, చచ్చుడి, రెల్లి వగైరా దళిత శాఖలన్నీ కలిసి ఒకేఒక కులం ఎందుకు కారాదు?

## 57

కొన్ని కొన్ని ప్రాంతాలలో మాలలు, మాదిగలు అనువంశికంగా అనుసరించే కొన్ని కొన్ని ప్రత్యేక వృత్తులకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే ఉండవచ్చు. ఎముకలు, కొమ్ములు, చర్మం, మాంసం, చేపలు, కోళ్లు, పందులు మొదలైన వాటికి చెందిన పరిశ్రమలు కొంత అపరిశుద్ధ వాతావరణాన్ని కల్పించవచ్చు. కొన్ని కొన్ని పరిసరాలు కొంత కొంత మందికి కంపరం పుట్టించ వచ్చు. నిజమే.

నా మట్టుకు నాకు కుక్కల్నీ, పిల్లుల్నీ, కోళ్ళనీ ఇండ్లలో పెంచే వాళ్ళని చూస్తే చాలా అసహ్యం. అలాంటి ఇళ్ళు, అవి ఎంతటి గొప్ప వాళ్ళవైనా సరే, మృగశాలల్లా బోనుల్లా కనిపిస్తై. అయితే నాకు అసహ్యంగా కనిపించినంత మాత్రంచేత, వాటి గొప్పతనానికి ఏమీ లోపం ఉండదుకదా?

వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలు, అభిరుచులు సమాజ శ్రేయస్సుకు భంగకరాలూ, పీడాకరాలూ కాకూడదు.

పైగా– అటువంటి కొన్ని వృత్తుల్నీ, పరిశ్రమల్నీ అనుసరిస్తున్న కులాలు అగ్రవర్ణాలలో కూడ ఎన్నో ఉన్నై. వారంతా అస్పృశ్యులుగా పరిగణించబడడం లేదుకదా!

అస్థి, చర్మ, మాంస, మృగ, మత్స్య మొదలైన పరిశ్రమలకు, ఆధునికమైన పద్ధతులలో కర్మాగారాలను నెలకొల్పుకుంటే – అన్నివిధాలా శ్రేయస్కరంగా ఉండగలదు. అందుకు ప్రభుత్వం వారి లెదర్‌బోర్డు, కుటీర పరిశ్రమల సంస్థ వంటివి సహాయపడగలవు.

కాగా– మాలమాదిగలు ఏకమై, ఏక కులంగా కలిసిపోవడానికి వృత్తి భేదాలు ఆటంకం కాజాలవు.

ఇక మిగిలిన వెల్లా మూఢ భ్రమలు. అవి సహించరానివి. తాతల నాటి నుంచీ వస్తున్న ఆచారాన్ని వదులుకోవడం ఎలా అనేది ప్రతీకులంలోనూ ముసలమ్మలలో ఉండే మూఢాచార జాడ్యం. అట్టి జాడ్యాన్ని ఏ యువకులూ, ముఖ్యంగా మాల మాదిగ యువకులు సహించకూడదు.

అందువల్ల మాల మాదిగ యువకుల్లారా! మీరంతా కలిసి ఏక కులం కండి!

## 58

ఇప్పుడు మీరంతా ఒకే కులం మాలమాదిగ.

మాల అంటే పుష్పమాల అని అర్థం. మాదిగ అంటే మాదే కదా అని అర్థం. ఈ రెండు మాటలు వేరు వేరుగా ఉన్నప్పటికంటే కలసి ఉంటే ఎంత సొగసైన అర్థం వస్తుందో చూడండి!

మాలమాదిగ అంటే ఏమిటి? పుష్పమాల మాదేకదా అని! విజయం మాది అని!

ఎప్పటికైనా విజయం మీదే. మీరు కాకపోతే మీ బిడ్డలు, వాళ్ళు కాకపోతే వాళ్ళ బిడ్డలు, మనుమలు ఈ ఉద్యమాన్ని ఏదో ఒక పేరుమీద, ధైర్య సాహసాలతో, ధర్మ దీక్షతో ముందుకు తీసుకపోకమానరు. దేశంలో కులరహిత సమ సమాజం ఏర్పడకమానదు. అప్పుడైనా విజయం మీదే కదా?

## 59

ఒక మాల మాదిగను ఎవరైనా కులం అడిగినప్పుడు, జవాబు ఇలా ఉండాలి.

"ఏ కులం నీది!"

"మాలమాదిగ"

"మాలవా? మాదిగవా?"

"మాలమాదిగను."

ఇక నుంచి ఇలానే చెప్పుకుంటానని ప్రతి మాలమాదిగ యువకుడూ నేడే శపథం తీసుకోండి!

చాలా కాలంగా నేను ఇలానే చెప్పుకొంటున్నాను. మాలమాదిగలు రెండు కులాలన్న సంగతే మరిచిపోయాను.

నాకు సాధ్యమయింది మీకు ఎందుకు సాధ్యంకాదు?

హరిజన అని చెప్పితే, అందులో ఏ ఉపకులమో చెప్పకూడదు. అది ఒక్కటే కులం, బహు సనాతన కులం. నేడు నిరుద్ధకులం.

నిమ్న జాతి అని మీరెప్పుడూ చెప్పుకోకండి. మనది నిమ్న జాతికాదు. మనం తక్కువవాళ్ళం కాదు. ఎవరికంటె తక్కువ?

ఒక మనిషి మరొక మనిషి కంటె, ఒక కులం మరొకకులం కంటే, ఒకజాతి మరొక జాతికంటే తక్కువ ఎన్నటికీ కాదు.

## 60

"బ్రాహ్మణులు నియోగులమనీ, వైదికులమనీ, మరొకటనీ తమ శాఖా భేదాలను చెప్పుకోవడం లేదా? మనం మాలల మనీ, మాదిగల మనీ చెప్పుకోవడంలో తప్పేమిటి?" అని మీరడుగవచ్చు.

బ్రాహ్మణులలోను, తదితర అగ్రకులాలలోను కూడ అంతశ్శాఖాభేదాలెన్నో ఉన్నై. ఆయా శాఖల మధ్య తిండి తిప్పలూ ఇచ్చి పుచ్చుకోడాలూ కూడ ఉండవు. అయినా వారంతా కలిసే ఉంటున్నారు. ప్రక్క ప్రక్క ఇళ్ళలో కాపురాలు చేస్తున్నారు. తమలో తాము అస్పృశ్యతను పాటించుకోవడం లేదు. ఒకే బావి నీళ్ళు తాగుతున్నారు. కనీసం అలాగైనా మీ రెందుకుండరు? అగ్రకులాలకు సాధ్యమైన పని మీ కెందుకు సాధ్యంకాదు?

## 61

గుంటూరు జిల్లాలో, తెనాలి వద్ద కొలకలూరు అనే గ్రామంలోని మాల మాదిగలు ఈ సమస్యను చాలాకాలం క్రితమే పరిష్కరించుకున్నారు. అదొక చక్కని చరిత్ర.

మాల మాదిగలు ఏకం కావాలన్న వాంఛ గాఢంగా ఉన్న యువకులు ఆ గ్రామం వెళ్ళి, అక్కడి యువకులతో కలిసి దాన్ని ఎంత దీక్షతో, ప్రతిభతో సాధించారో పరిశీలించి తెలుసుకోండి.

ఆ గ్రామం జనాభాలో సగానికి సగం ఉన్న మాలమాదిగలు ఇప్పుడు ఒక్కటే కులంలా, కుటుంబంలా కలిసిమెలసి ఉంటున్నారు. తాము రెండు కులాలన్న మాటే మరిచిపోయారు.

కొలకలూరిలో సాధ్యమైన మాలమాదిగ సమైక్యం తక్కిన ఊళ్ళలో ఎందుకు సాధ్యం కాదు?

## 62

గ్రామంలో ఒక మాలపేట, ఒక మాదిగపేట దూరదూరంగా ఉన్నై. అయితే - మాదిగ పేటకు దగ్గరగా కొన్ని మాలకొంపలూ, మాలపేటకు దగ్గరగా కొన్ని మాదిగకొంపలూ ఉన్నై. రెండు పేటలకూ రెండు మంచినీళ్ళబావులున్నై.

మాల పేటకు చేరి ఉన్న మాదిగలు మంచినీళ్ళకోసం దూరంలో గల మాదిగ పేటకు పోవలసి ఉంది. అదే పరిస్థితి మాలలకూ ఉంది.

ఎండ, వాన, చీకటి, పనితొందర - ఎన్ని అసౌకర్యాలకైనా, ఇబ్బందులకైనా ఓర్చుకుంటున్నారే కాని, ఒకరి బావిని ఒకరు ముట్టుకోడానికి అంగీకరించలేదనడం కంటే, అలాంటి ఆలోచనే వాళ్ళకు రాలేదనడం సమంజసమేమో.

తాతల నాటినుంచీ వచ్చే ఆచారం గుడ్డిగా సాగిపోతూనే ఉంటుంది. ఎవడో ఒక బుద్ధిమంతుడు పుట్టి దాని ఔచిత్యాన్ని ప్రశ్నించేదాకా!

మంచినీళ్లు మైలపడతాయా? గంగకు అంటు దోష ముందా?

ఎవడో ఒక చాదస్తపు బ్రాహ్మడు వ్రాసిపెడితే, ఎవడో ఒక భూపాలుడు తన స్వప్రయోజనం కోసం దాన్ని అమలుపెడితే - జనం గుడ్డిగా దానికి లొంగిపోవలసిందేనా? సొంత ఆలోచనే అఖ్కర లేదా? అక్కడ బావిని వాళ్ళంతా, ఇక్కడి బావిని వీళ్ళంతా వాడుకుంటే ఈ ఇబ్బందులన్నీ తొలగిపోయి, ఉభయులకూ సుఖంగా ఉంటుంది కదా? అలా వీళ్ళెందుకు చెయ్యరు?

మాలపేటకూ మాదిగపేటకూ చెందిన కొంతమంది కుర్రవాళ్ళు కలిసి ఈ ఆలోచన చేశారు. దాన్ని అమలు పరచడానికి ఒక పథకం వేశారు.

ప్రతి కొత్త పథకానికి ప్రతిఘటన ఉంటుంది. ప్రతిఘటనను జయప్రదంగా ఎదిరించి ముందుకు పోయినప్పుడే అది ప్రగతి అవుతుంది.

ప్రగతి కాముకులైన ఆ మాలమాదిగ యువకుల పథకాన్ని ఆచార మూఢులైన పెద్దలు, ముసలమ్మలు ఎదిరించారు. మాలమాదిగల మధ్య మనస్పర్థలు

కలిగించి, జుట్లు ముడివేసి, కలహాలను పెంచి అందువల్ల తాము లాభపడుతూ ఉండే అగ్రకుల లౌక్యులు అట్టి పెద్దలకు, ముసలమ్మలకు హుషారిచ్చారు.

అయినా - యువకులు భయపడలేదు. తమ పట్టు విడువలేదు. తమ కార్యక్రమాన్ని విడవకుండా సాగించారు.

ఏమిటా కార్యక్రమం?

మాలల బావిలోని నీళ్ళను మాదిగల బావిలోను, మాదిగల బావిలోని నీళ్ళను మాలల బావిలోను పోయడం! అక్కడి పరిస్థితులకు వాతావరణానికి అనుకూలమైన అలాంటివే ఉభయ కులాలనూ కలిపే పనులు కొన్ని కొన్ని చెయ్యడం!

రోజులు గడిచే కొలదీ ప్రతిఘటన సడలిపోయింది. తర్వాత ఈ ప్రాంతపు మాలమాదిగలు కలిసి ఈ బావినీ, ఆ ప్రాంతపు మాల మాదిగలు కలిసి ఆ బావినీ వాడుకోవడం సాగించారు. ఉభయులకూ హాయిగా ఉంది.

ఆ తర్వాత మాల యువకులు మాదిగల ఇళ్ళలోను, మాదిగ యువకులు మాలల ఇళ్ళల్లోను కాఫీ ఫలహారాలను తీసుకోవడం ప్రారంభించారు.

ఉభయ కులాలకు చెందిన, చదువుకొన్న, ఆత్మబలం కల యువకులు ఈ కార్యక్రమాన్ని సాగిస్తున్నప్పుడు ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

ఇప్పుడా గ్రామంలో మాలమాదిగలు సంఘటితులై, బలాధిక్యులై, తిరుగులేని పలుకుబడి కలవారై ఉన్నారు. ఎప్పుడైతే మాలమాదిగలు ఒక్కటై పోయారో అప్పుడే తక్కిన కులాలవారు అంటరానితనాన్ని పాటించడం మానివేశారు.

అట్టి మార్పు ప్రతి గ్రామంలోనూ సాధ్యమే - మాలమాదిగ యువకులు పట్టుదలతో పూనుకొని పని చేస్తే.

## 63

ఇప్పుడు కూడ మాలమాదిగల మధ్య చదువుకొన్న వాళ్ళలో భేదాలు లేవు. విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు అంతా కలిసే ఉంటారు. కలిసే తింటారు. కొన్ని కొన్ని చోట్ల వివాహ సంబంధాలు కూడ జరుగుతున్నై. ఉన్న సమస్య కేవలం గ్రామాలలోని పేటలలోనే. పరిష్కరించాలనుకుంటే యువకులకు ఇది పెద్ద సమస్యేమీ కాదు.

నిజానికి తమలో తాము అంటరానితనం పాటించుకొంటున్న పేటలు ఎక్కువగా ఉండవు. అలా ఉన్న పేటలలోనే మనం కొలకలూరును ఆదర్శంగా తీసుకొని పని చెయ్యవలసి ఉంటుంది.

## 64

కొన్ని ప్రాంతాలలో మాలలు, మరికొన్ని ప్రాంతాలలో మాదిగలు మెజారిటీగా ఉంటారు. ఎక్కడ ఎవళ్ళు మెజారిటీగా ఉంటే, వాళ్ల ఈ సమైక్యం విషయంలో పట్టుదలతో, సహనంతో, త్యాగబుద్ధితో పని చెయ్యవలసి ఉంది.

## 65

మాలమాదిగలలో ఏ వర్గం అంటరానితనం అనే పాపాన్ని పాటిస్తున్నదో ఆ వర్గమే దాన్ని తొలగించుకోవడానికీ, సమైక్యం పొందడానికీ ముందడుగు వెయ్యాలి. అందుకు ఆ పేటలోని విద్యార్థులు, ప్రగతికాములు నాయకత్వం వహించాలి.

## 66

మాలమాదిగలలో అంటరానితనం పోయి, వారు ఉభయులూ ఒకే కులంగా మారిన తక్షణం మొత్తం అంటరానితనమే అదృశ్యమై పోతుంది.

అంటరానితనం పోవడంతో కుల వ్యవస్థ సడలిపోతుంది. సోషలిస్టు ప్రాతిపదికపై అభ్యుదయ గ్రామ పునర్నిర్మాణం ప్రారంభమవుతుంది.

## 67

ఊడిస్తేగాని వీధులు శుభ్రపడవు. తోమితేనే గాని అంట్లు తెల్లబడవు. అస్పృశ్యతను, కులవ్యవస్థను, అసమానతను, అభ్యుదయ నిరోధకతను సమాజం నుంచి తుడిచి పారవెయ్యడానికి మాలమాదిగ యువకుల్లారా! చీపుళ్లు చేతపట్టండి.

## 68

రాజకీయ పార్టీలను నమ్మవద్దు. దేశంలోని అసలు సమస్యలను అర్థం చేసుకొన్న పార్టీ ఒక్కటీ లేదు.

ఏ రాజకీయ పార్టీకైనా లక్ష్యం అధికారం. ప్రజల అభ్యుదయం కాదు. కష్టపడకుండా ఎక్కువ డబ్బు సంపాదించుకోవడానికి అనువైన మాయాబజారు

రాజకీయ రంగం. ఏ పనీ చేతకాని వాళ్ళకది ఆటపట్టు. అబద్ధాలు, మోసాలు, లంచాలు, కుట్రలు, లాటరీలు, పక్షపాతం, జూదం వంటి వాటితో నిండి ఉంటుందది.

అలాంటి రాజకీయాలతో, పార్టీలతో మనకు పనిలేదు.

తమ స్వార్థం కోసం నాయకులే కులతత్వాన్ని రెచ్చగొడతారు. కులాలమధ్య అనైక్యతను, అసూయను రగులుస్తారు, జాగ్రత్త!

ఎన్నికలు, సభ్యత్వాలు, అధికార పదవులు వంటి వాటికోసం ఎన్ని అకార్యాలకైనా పాల్పడే నాయకులున్నారు. అలాంటి వారు ఏమి చెప్పినా వినవద్దు.

ఈ నాడు దేశంలో రాజకీయాలే వృత్తి అయినై చాలామందికి. అవే ఆశ్రిత పక్షపాతానికి, అసమర్థతకు, అవినీతికి, అన్యాయవర్తనకు దారితీసి దేశాన్ని అధోగతికి ఈడ్చుకు పోతున్నాయి.

పరిస్థితిని అర్థం చేసుకొండి. అంతరాత్మ సాక్షిగా ప్రవర్తించండి. ఐక్యతే లక్ష్యంగా పురోగమించండి. కేవలం ధర్మం కోసమే పోరాడండి.

## 69

మాలమాదిగలు ఏకం కావడం చాలా మందికి ఇష్టం ఉండదు. పైకి సమైక్యత కావాలని ఉపన్యాసాలు ఇస్తారు. లోలోపల తద్విరుద్ధమైన పనులు సాగిస్తారు. ఇలాంటి ద్విపాత్రాభినయం చేసే నాయకులు అగ్ర వర్గాలలోనే కాదు మాల మాదిగలలో కూడ ఉంటారు. సభలో ఒకమాట, చాటున ఒకమాట చెప్పే వాళ్ళెవర్నీ నమ్మవద్దు. అట్టివాళ్లు స్వార్థపరులే కాదు, మోసగాళ్లు కూడా.

## 70

మాల మాదిగల ఐక్య సంఘటనకు, ఆ తర్వాత కుల వ్యవస్థ నిర్మూలనకు, ఆ తర్వాత సర్వజన సమతా సమాజ నిర్మాణానికి పునాదులు మాలమాదిగ పేటలలోనే పడవలసి ఉంది. అందుకు మాలమాదిగ యువకులు, విద్యార్థులు నాయకత్వం వహించవలసి ఉంది. ఈ విషయంలో హరిజనోద్యోగులపై ప్రధానమైన బాధ్యత ఉంది.

## 71

మాలమాదిగ పేటలలో పుట్టి, బాల్యంలో అక్కడి కష్ట సుఖాలనుభవించి, కులం పేరుమీద స్కాలర్షిప్పులతో చదువుకొని, ఆ పేటలలో మాలమాదిగలందరికీ ఆశాజ్యోతులుగా పరిగణించబడి, కులంపేరు మీదనే ఉద్యోగాలు సంపాదించుకొన్న మాలమాదిగ యువకులకు ఆ పేటలపట్ల ఒక తీరని బాధ్యత ఉంది. ఆ బాధ్యత ఎట్టిదో చాలా మంది హరిజనోద్యోగులు గుర్తించలేకుండా ఉన్నారు. దానిని మనం వివరంగా వారికి స్పష్టపరచాలి.

## 72

పేదపేట అనే ఒక మాలమాదిగ పేట ఉన్నదనుకోండి. ఆ పేటలో వంద గుడిశెలు ఉన్నై. సుమారు ఐదువందలమంది మాలమాదిగలున్నారు. వాళ్ళంతా వ్యవసాయ కూలీలు, పిల్లలు, స్త్రీలు, వృద్ధులు కూడ ఏ పూటగంజి ఆ పూట కాయకష్టం ద్వారా సంపాదించుకోవలసిందే.

రాజ్యాంగాన్ని అనుసరించి ప్రభుత్వం షెడ్యూల్డు కులాలలకు చేస్తున్న గొప్పగొప్ప సహాయాలేవీ వాళ్ళదాకా రాలేదు. అవి ఆయాశాఖల సిబ్బంది ఖర్చులదాకా వచ్చి ఇంకిపోయినై. వాళ్ళదాకా వచ్చిన సహాయం ఒక్కటే. అది విద్యార్థులకు స్కాలర్షిప్పులు.

ఆ స్కాలర్షిప్పులతో చదువుకొన్న వాళ్ళలో పైకివచ్చి ఉద్యోగాలు సంపాదించుకోగలిగిన వాళ్లు నలుగురు.

ఆ నలుగురూ పట్నంలోనే ఉద్యోగం చేస్తున్నారు. పట్నంలోనే స్థిరపడి పోయారు. వాళ్ళెప్పుడూ ఆ పేటకు రారు. ఆ పేట వాళ్ళు ఆ పట్నం పోరు.

వారిలో ఒకడు పట్నంలో ఇల్లు కట్టుకున్నాడు. ఒకడు కారు కొన్నాడు. ఒకడు ఒక అగ్రవర్ణ యువతిని పెండ్లి చేసుకున్నాడు. మొత్తంమీద ఆ నలుగురూ మంచి అభివృద్ధిలోనే ఉన్నారు. వాళ్ళ స్నేహితులంతా అగ్రవర్ణాల వారే.

ఆ నలుగురూ పుట్టి పెరిగిన ఆ పేద పేటకు చెందిన ఒక వెంకయ్య వాళ్ళతో చిన్నప్పుడు గోళీలూ, చిత్రబిళ్ళా ఆడుకొన్న వాడు - చదువు మానుకొని కూలి పని చేసుకొంటున్నవాడు- ఒక రోజున తన బాల్య మిత్రుల్ని చూడాలన్న

కాంక్షతో పట్నం వచ్చి- అక్కడున్న వేలకొలది మేడలలో వాళ్ళ మేడ లేవో తెలియక, ఉసూరుమంటూ తిరిగి తన పేటకు వెళ్ళిపోయాడు!

వెంకయ్య ముఖంలో ఆ నలుగురినీ చూచి సంతోషిద్దామనుకొన్న ఆ పేదపేట మాలమాదిగలంతా అతడి ఆశాభంగాన్ని పంచుకొని కన్నీరు కార్చారు - ఒక కొన్ని రోజులపాటు!

## 73

'ఆ పేద పేటనుంచి నలుగురు మాలమాదిగ యువకులు విద్యాధికులైనారు. ఉన్నతాధికార పదవుల్ని నిర్వహిస్తున్నారు. ధనవంతులైనారు. అగ్రవర్గాలతో సమానంగా అభివృద్ధి పొందారు. అందరితో కలిసి తిరుగుతున్నారు. తింటున్నారు. ఇక అంటరాని తనం ఎక్కడున్నది? హరిజనులకు ఇంతకంటే ఏం కావాలి?" అంటుంది ప్రభుత్వం!

అంటే- ప్రభుత్వం ఉద్దేశం ఏమిటి? ఆ అయిదు వందలమంది పేదపేట మాలమాదిగలకు ఆ నలుగురు ఉద్యోగులు ప్రతినిధులనే కదా? తమ ప్రాతినిధ్య బాధ్యతను ఆ నలుగురూ ఎలా తీర్చుకుంటున్నారు? ఏమిటి జవాబు?

## 74

ఆ నలుగురిలో ఒకడు ఒక వర్ణాంతర భవనంలో అద్దెకుంటూ, నాయుడు గారు గా చెలామణి అవుతున్నాడు.

రెండవ వాడు ఒక ముస్లిం వీధిలో నివసిస్తూ, తెలుగే మాట్లాడడు.

మూడవ వాడికి క్లబ్బు మిత్రుల తోడిదే లోకం. ఆ మిత్రులంతా లక్షాధికారులైన అగ్రవర్గాల జూదగాళ్ళు.

నాలుగోవాడు ఒక అగ్రకులం అమ్మాయిని పెళ్ళాడి, తన తల్లి దండ్రుల్ని కూడ ఇంటికి రానివ్వడు.

ఇదీ ఆ నలుగురూ తాము పుట్టి పెరిగిన మాలమాదిగ పేటకు చేస్తున్న సేవ!

హరిజనులకు ప్రత్యేక ప్రాతినిధ్యం ద్వారా స్కాలర్షిప్పులను, ఉద్యోగాలను ఇవ్వడంలో ప్రభుత్వం ఆశించిన ఫలితం ఇదేనా?

కూలీ నాలీ చేసుకొని, గంజినీళ్ళు తాగి బ్రతుకుతూ, తమ బిడ్డల్ని శ్రమపడి చదివించుకొంటూ - వాళ్ళు పెరిగి పెద్ద ఉద్యోగాలు చేసి తమనూ, తమ పేటనూ ఉద్ధరిస్తారనుకొంటూ- గంపెడాశలు పెట్టుకొన్న ఆ పేద పేట మాలమాదిగల ఆశలు మట్టిగొట్టుకు పోవలసిందేనా?

ఆ పేట నుంచి పైకి వచ్చిన ఆ నలుగురూ ఇక ఆ పేటకు ఎందుకూ ఉపయోగపడరా? వాళ్ళు చచ్చిన వాళ్ళలో జమేనా? ఆ పేట వందేళ్ళనాడు ఎలా ఉన్నదో - ఇప్పుడూ అలానే హైన్యదైన్యాలలో క్రుళ్ళుతూ ఉండి పోవలసిందేనా?

## 75

మాలమాదిగ ఉద్యోగులారా! కళ్ళు తెరవండి!

మీ చదువులు, మీ ఉద్యోగాలు, మీ పదవులు, మీ జీతాలు, మీ విందులు, వినోదాలు అన్నీ మీరు పుట్టి పెరిగిన మాలమాదిగ పేటల కష్ట జీవుల ఆశాదృక్కుల ఆకాంక్షలే అన్న సత్యాన్ని మరచి పోకండి!

## 76

సుఖ భోగాలను అనుభవించ వద్దని కాదు. ధనం సంపాదించవద్దని కాదు. చదువులు, ఉద్యోగాలు, రాజ్యాంగ రక్షణలు, వాటి అమలు కోసం మన పోరాటాలు- అన్నీ న్యాయంగా మనకు రావలసిన సుఖ సంతోషాల కోసమే. అయితే, వాటిని మీరు అనుభవిస్తున్నప్పుడు, అవి మీకు ఎలా లభించాయో మాత్రం జ్ఞాపకం పెట్టుకోండి.

## 77

మాల మాదిగ ఉద్యోగులకు మాత్రమే నేనీ హెచ్చరిక చేస్తున్నాను.

మీరు కష్టపడి ఉద్యోగాలు చేస్తున్నారు, సంపాదించు కొంటున్నారు. మీ సంపాదనను మీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకునే హక్కు మీ కుంది.

అయితే- గుండెలమీద చేయి వేసుకొని, అంబేద్కరు ముఖం చూచి, ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి?

భారత రాజ్యాంగంలో మీ కులానికి కల్పించబడ్డ ప్రత్యేక సౌకర్యాల సహాయంతో చదువుకొని, ఉద్యోగాలు చేస్తున్న మీరు ఆ కులానికి ప్రతినిధులు మాత్రమే కారా? అట్టి మీకు మీ సంపాదనను ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకునే అధికారం నైతికంగా ఉన్నదా?

మీ సంపాదనలో ఏదో కొంత భాగం మీ కులానికి, మీ పేట అభివృద్ధికి చెందవలసి లేదా?

## 78

**మీ** అభివృద్ధే మాల మాదిగల అభివృద్ధి అని ప్రభుత్వం భావిస్తున్నది. అంటే మాల మాదిగల అభివృద్ధికి మీరు అన్ని విధాల తోడ్పడాలనే ప్రభుత్వం కోరుతున్నది. మీరు ఏ విధంగా తోడ్పడుతున్నారు?

నెల కొక్క రూపాయి అయినా మాల మాదిగల అభ్యుదయ నిధికి చందా ఇస్తున్నారా?

ఏడాది కొకసారైనా మీరు పుట్టి పెరిగిన పేటల దుస్థితిని గుర్తుకు తెచ్చుకుంటున్నారా?

ఈ నాటి మిమ్మల్ని స్వార్థపరులుగా, లోభులుగా, నడమంత్రపు సిరులలో మునిగిపోయి జాతిని మరచి పోయిన అంధులుగా వచ్చే తరాల యువకులు నిందించకుండా మీరు ఏ విధంగా జాగ్రత్త పడుతున్నారు?

మీ సంపాదనలో నూటికి పదివంతులైనా మాలమాదిగల సాముదాయక అభ్యుదయం కోసం, సాంస్కృతిక వికాసం కోసం కేటాయించడం మీ కనీస ధర్మం కాదా!

## 79

**టాల్**స్టాయి మహాశయుని ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని రష్యాలో మరో పేరుతో సోవియట్ ప్రభుత్వం అమలు జరిపింది. గాంధీజీ అదే సిద్ధాంతాన్ని భారతీయులకు బోధించాడు. కాని ఆస్తిపరులతో కూడిన కాంగ్రెసు దానిని అమలు జరపలేదు.

పేద వర్గాల నుంచి పైకి వచ్చిన మీరైనా దానిని అమలు పరచవలసి లేదా? మీ జీతంపై, మీ ఆస్తిపై మీ మొత్తం కులానికి హక్కులేదా? స్థిమితంగా ఆలోచించుకొని చూడండి.

త్యాగాలు చెయ్యడం, ఆదర్శప్రాయంగా బ్రతకడం మీకు అవసరం. మీ కులం పట్ల మీకు గల పవిత్ర ధర్మాన్ని మీరు నిర్వర్తించడానికి పూనుకొంటే మొత్తం జాతిపట్ల తమకు గల ధర్మాన్ని ధనిక వర్గాల యువకులు గుర్తించగలుగుతారు. దేశాభ్యుదయం కోసం మీతో కలిసి నడవ గలుగుతారు.

దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ నిలవాలంటే- అందుకు, ఓ హరిజన యువకులారా, మీరే మార్గదర్శకులు కాక తప్పదు. త్యాగాలు చెయ్యక తప్పదు.

## 80

రాజకీయాల జోలి మీకు వద్దు. అందుకు తగిన వారికి వాటిని వదిలేద్దాం.

మాల మాదిగ ఉద్యోగులు చెయ్యవలసిన పని సాంఘిక సాంస్కృతిక రంగాలలో ఎంతో ఉంది.

మీలో కవులున్నారు. గాయకులు, చిత్రకారులు, నర్తకులు ఎంతోమంది ఉన్నారు. ఉపజ్ఞ, ప్రతిభ, పాండిత్యం కలవారెంతోమంది ఉన్నారు. అయితే – వారికి ప్రోత్సాహం ఇచ్చే వారెవరూ లేరు. మీ వాళ్ళను మీ రెందుకు ప్రోత్సహించుకోరు? ఇతర కులాల వారిని చూసైనా ఎందుకు నేర్చుకోరు?

## 81

సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నృత్యం- ఈ రంగాలలోను, నాటక రంగంలోను, అకాడమీల ద్వారాను, ఆకాశవాణి ద్వారాను ఎన్నో కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు పెడుతున్నది. అందులో మాలమాదిగ కళాశీలురకు ఉపయోగ పడుతున్న దెంత?

ఈ కళారంగాలలో కూడ మాలమాదిగలు వెనుకబడి ఉంటే- వారిలో తదభివృద్ధికోసం మొత్తం ఖర్చులో నూటికి ఇరవై వంతులు ప్రభుత్వం ప్రత్యేకించవలసి లేదా?

ప్రభుత్వం అలా చెయ్యకపోతే- చెయ్యించ వలసిన బాధ్యత చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న మీపై లేదా?

## 82

ఎక్కడో ఎవరో పదిమంది ఆర్థికంగా బాగుపడడం, ఉద్యోగాలు చెయ్యడం, పదవులు అలంకరించడం నిజమైన అభివృద్ధి కాదు. జాతి మొత్తం సర్వతోముఖంగా వికాసం పొందడమే నిజమైన అభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధే స్థిరమైన అభివృద్ధి. ఈ సత్యం ఉద్యోగులు చాలామందికి తెలీదు. రాజకీయ నాయకులకు మొదలే తెలీదు.

ఆకాశవాణిలో మీ వాళ్లు ఎంతమంది పాడుతున్నారు? పాట వచ్చినవాళ్లు మీలో లేరా? రవీంద్ర భారతిలో మీ వాళ్లు ఎంతమంది ఆడుతున్నారు? ఆట వచ్చినవాళ్లు మీలో లేరా? ఎందుకు మీరు ఆలోచించరు?

చదువు లేని వ్యక్తికి ఉద్యోగం రాదు. సంస్కృతిలేని జాతికి అభ్యుదయం లేదు.

సంగీతం, సాహిత్యం, శిల్పం వగైరా కళలలో అభినివేశంగల ఎవరూ బానిసలు కాబోరు. అది లేని ఎవరూ స్వతంత్రులుగా మనలేరు.

నిజమైన అభివృద్ధి కోసం మీరు ఎందుకు కృషి చెయ్యరు?

## 83

క్రైస్తవులకు బైబిలు ఉంది. ముస్లింలకు ఖురాను ఉంది. బౌద్ధులకు ధమ్మపధం ఉంది. సిక్కులకు గ్రంథ సాహేబా ఉంది. హిందువులకు భగవద్గీత ఉంది. కమ్యూనిస్టులకు మార్క్సుభౌతిక వాదం ఉంది. ప్రజాస్వామ్యానికి ఆంగ్ల సంవిధానం ఉంది.

జీవిత సౌభాగ్యాన్నీ, జీవేశ్వర సమైక్యాన్నీ- స్వార్థాన్నీ తీర్థాన్నీ కూడ సమకూర్చి పెట్టే మతమో, మంత్రాంగమో ప్రతి ఒక్క వర్గం ప్రజలకూ ఉంది. తమ తమ మతాలకూ, మంత్రాంగాలకూ అనుగుణంగా సంస్కృతినీ, సంస్కారాన్నీ, కళలనూ, కాంతులనూ నిర్మించుకొంటూ, వికసింప జేసుకొంటూ ఆయా వర్గాల ప్రజలు

మానవుల్లా బ్రతుకుతూ, దైవత్వం కేసి పరుగులు పెడుతున్నారు.

ఓ మాలమాదిగ ప్రజలారా! మీరేం జేస్తున్నారు?

క్షుద్ర దేవతల్ని కొలుస్తూ, క్షుద్ర నాయకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, తరతరాలుగా ఎలా ఉన్నారో అలాగే ఇక ముందు కూడా క్షుద్ర జీవితాలు గడుపుతూ, బానిసలై పడి ఉంటారా?

మీ మతం ఏది? మీ దైవం ఎవరు? మీ లక్ష్యం ఏమిటి?

ఈ ప్రశ్నలకు స్పష్టంగా జవాబు చెప్పుకొని- దాని సాధనకై ప్రాణాలకు సైతం తెగించి పోరాడండి!

ఓ హరిజన ఉద్యోగీ! నీవు కోరుకోవలసింది- వెయ్యి రూపాయల జీతమో, కారో, మేడో, కాదు. ఒక పద్యాన్ని విని ఆనందించు. ఒక శిల్పాన్ని చూచి మెచ్చుకో. ఒక నాట్య ప్రదర్శనానికి అధ్యక్షత వహించు. నీ జన్మ తరిస్తుంది.

లక్ష్మి నిలకడలేని దయ్యా, మూఢయ్యా! స్థిర సౌభాగ్యాన్ని ప్రసాదించే సరస్వతిని నమ్ముకోవయ్యా! చాలు!

నిజానికి- నీకు ఉద్యోగం ఎలా వచ్చింది? సరస్వతి వల్లనే కాదా?

## 84

ఈనాడు మాలమాదిగ ఉద్యోగుల మనస్తత్వం చాలా విపరీతంగా ఉంది.

అందులో చాలా మంది తాము మాలమాదిగ కులానికి చెందిన వారమన్న విషయాన్నే మరచిపోయారంటే అతిశయోక్తి కాదు.

తాము పుట్టి పెరిగిన మాల మాదిగ పేటల్ని మరచిపోయి, మన ఉద్యోగులు తాము ఒక ప్రత్యేక కులంగా తయారవుతున్నారు. తమ చుట్టూ ఒక త్రిశంకు స్వర్గాన్ని సృష్టించుకొని, పిచ్చి సంతోషం పొందుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. వట్టి పేక మేడ.

పైకి వచ్చిన ప్రతీ మాలమాదిగ వ్యక్తీ మాలమాదిగ పేటలనుంచి దూరమై పోతుంటే- ఇక ఆ పేటల గతి ఏం కాను? అలా ఒళ్లు మరిచి పోతున్న వారిని మేల్కొలపడం, కర్తవ్యాభిముఖుల్ని చెయ్యడం ఎలా? ఆలోచించండి.

## 85

ఆమధ్య దేశ నాయకులలో అగ్రగణ్యులైన జగజ్జీవనరాంగారు హైదరాబాదు వచ్చినప్పుడు ఆయనకు షెడ్యూల్డు కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం సన్మానం చేసింది. అందుకు ఒక వెయ్యి రూపాయిల వరకు ఖర్చయింది. ఉద్యోగులు చందాలు వేసుకొన్నారు.

ఆ సందర్భంలో ఒక జ్ఞానయ్య, ఒక ఆఫీసులో ఒక మూఢయ్య వద్దకు వెళ్లి, అతని వంతు చందా ఇవ్వమన్నాడు. అతడు ఒక రూపాయి ఇవ్వబోయాడు.

చందా అన్నప్పుడు ఎంతైనా యివ్వవచ్చు. ఇచ్చేవాళ్ళ ఇష్టం. పుచ్చుకొనే వాళ్ళ అదృష్టం. అయితే నూరు రూపాయల జీతం తెచ్చుకొనే ఉద్యోగి కనీసం రూపాయి అయినా ఇవ్వాలని సంఘం నిర్ణయించింది. ఆ లెక్క ప్రకారం మూడయ్య తన మూడు వందల యాభై రూపాయలకు కనీసం మూడు రూపాయలైనా ఇవ్వవలసి ఉంది. అయిదువందల జీతం ఉద్యోగి ఒకాయన ఏభై రూపాయలిచ్చాడు. అలా ఉత్సాహంకొద్దీ పదులూ, పాతికలూ ఇచ్చిన వారు చాలమందే ఉన్నారు. మూఢయ్యలాంటి వాళ్ళు చాలా తక్కువమంది.

"మీరు న్యాయంగా నాలుగివ్వాలి. కనీసం మూడైనా ఇవ్వండి" అన్నాడు జ్ఞానయ్య. "నా దగ్గిర లేవు. జీతం చాలడం లేదు. చుట్టూ అప్పులు. ఈ రూపాయి అయినా సిగరెట్ల కోసం ధర్మయ్యవద్ద అప్పు తీసుకున్నాను. పట్టికెళ్ళండి" అన్నాడు మూఢయ్య.

"మీరే అలా అంటే ఎలా? మన నాయకుణ్ణి మనం గౌరవించుకోవాలి. మళ్ళీ ఇలాంటి శుభసందర్భం ఎప్పుడు వస్తుందో? సన్మానం గొప్పగా చేద్దామని కదా? పోనీ రెండైనా ఇవ్వండి!" అన్నాడు జ్ఞానయ్య తొందరగా పోదామని.

"ఇవ్వను. అసలు ఒక్క రూపాయైనా ఎందుకివ్వాలి? ఇవ్వక పోతే ఏం చేస్తారు?" అన్నాడు మూఢయ్య ముఖం బిగించుకుని.

"ఇది చేస్తారు–" అంటూ జ్ఞానయ్య ఉగ్రనరసింహావతారం తాల్చి– ఏం చేశాడో, మూఢయ్య కళ్లపొరలు ఎలా తొలగిపోయాయో, అతడి జేబునుంచి ఒక అయిదు రూపాయలనోటు– చిన్నప్పటి గోచీపాతను, పల్లెలోని గుడిసెను జ్ఞాపకం తెచ్చుకుంటూ, ఎలా బైటికి వచ్చిందో ఊహించడం కష్టమేమీకాదు.

ఒక మహానాయకుణ్ణి గౌరవించడానికి నూటికి రూపాయి ఇవ్వడానికి ఏడ్చిన వా ళ్ళున్నారు. అట్టివాళ్ళు మాలమాదిగ ప్రజల సాంస్కృతిక అభివృద్ధికోసం నెలకు నూటికి పదిరూపాయలు ఇవ్వమని నేను చెపితే, నా మాట వింటారా?

## 86

వింటారా, వినరా అనే ప్రసక్తేలేదు. చెప్పడం నా ధర్మం కనుక చెపుతున్నాను. వంద రూపాయల ఉద్యోగి నెలకు నాలుగైదు రూపాయలైనా ఇవ్వవచ్చు. వేయి రూపాయల అధికారి నెలకు నూరు రూపాయలయినా ఇవ్వవచ్చు. జీతం తొమ్మిది వందలే అనుకుంటే జరగదా? పస్తుండవలసి వస్తుందా?

మాలమాదిగ ఉద్యోగులారా! మీ జాతికి మీరు ధర్మకర్తలనే సత్యాన్ని విస్మరించకండి! మీరు పుట్టి పెరిగిన మాలమాదిగ పేటలు తక్కిన అగ్రవర్గాల గ్రామాలలో లీనమై పోయేదాకా మీ బాధ్యత తీరదని గుర్తించండి. త్యాగం చెయ్యండి. తక్కిన కులాల యువకుల కంటే ఎన్నో రెట్లు త్యాగాలు చెయ్యడానికే మనం ఈ కులంలో పుట్టామని తెలుసుకోండి!

## 87

అభివృద్ధి పొందిన అగ్రకులాల వారిలో కులతత్త్వం ఒకపాపం.

తరతరాలుగా అణిచి ఉంచబడ్డ బడుగు కులాలు, అమానుషమైన అంటరాని తనానికి గురిచేయబడ్డ మాలమాదిగలు తమ విమోచన కోసం పోరాడడం కులతత్త్వ మనిపించుకోదు.

అందువల్ల తమ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేసుకోడానికి మాలమాదిగలు సంకోచించ నక్కరలేదు.

## 88

బ్రిటిషు ప్రభుత్వ కాలంలో, గవర్నమెంటు పోరంబోకు పుంతలలో, గుడిసెలు వేసుకున్నారెన్నో గ్రామాలలో మాలమాదిగలు. అప్పుడా గుడిసెలు కొంత కొత్తగా కనిపించేవి.

(1) దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇరవై ఏళ్ళు ఐన తర్వాత (2) మూడు పంచవర్ష ప్రణాళికలు ముగిసిన తర్వాత (3) ఎన్నో కోట్ల కోట్ల రూపాయల స్వదేశీ విదేశీ ధనం ఖర్చయిన తర్వాత ఈ రోజున ఆ పుంతలకు వెళ్ళి చూడండి! ఆ గుడిసెలు కూలిపోతున్నై! ఆ మనుషులు చిక్కి శవాలై పోతున్నారు.

ఇదేనా మనం సాధించిన అభివృద్ధి?

బడుగు దేశాల అభివృద్ధి కోసం, పేదల పునరావాసం కోసం, అగ్రరాజ్యాలు చేస్తున్న సహాయమైనా మాల మాదిగ పేటలదాకా వస్తున్నదా?

## 89

అడిగితే గాని అమ్మ అయినా పెట్టదు. నిద్రపోయే వాణ్ని వదిలేసి ఏడ్చే వాడికే పాలుపడుతుంది ఏ తల్లి అయినా. ఆందోళన చేస్తేగాని అవసరాలు కూడ గుర్తించని కాలమిది. అందుకే మేల్కొనండి! ప్రజలను మేల్కొలపండి! ఏకం కండి! ఎలుగెత్తి అడగండి!

## 90

కొన్ని గ్రామాల్లో మాలమాదిగలు గుడిసెలు కట్టుకొన్న ఆ పుంతల్ని చూడండి!

గవర్నమెంటు పుంతలు సన్నంగా, మైళ్ల కొలది పొడుగ్గా ఉంటై. పొలాలకు, గ్రామాలకు పశువుల రాకపోకల కోసం వదలబడ్డ బాటలు అవి. వాటిని బ్రిటీషు ప్రభుత్వం ఉచితంగా మాలమాదిగలకిస్తే, అక్కడ గుడిసెలు వేసుకున్నారు వాళ్లు. అవి గుడిసె పక్క గుడిసెగా ఒకమైలు పొడుగు వరకు తోరణంలా ఉంటై. ఆ దృశ్యం మనక యితే అలవాటయి పోయింది కనుక మామూలుగానే కనిపిస్తుంది. విదేశీయులకైతే ఎలా కనిపిస్తుంది?

కోళ్ళు, కుక్కలు, పందులు కూడ అలాంటి ఇరుకు మురికి గూళ్ళలో ఉండగలవా?

ఓ మాలమాదిగ యువకుల్లారా! ఓ భారతీయ ప్రగతి కాముల్లారా! ఆ పుంతల్నీ, ఆ గుడిసెల్నీ ఇంకా ఎంత కాలం సహిస్తారు?

## 91

హైదరాబాదు నగరంలో మాలమాదిగ పేటల్ని ఒకసారి చూడండి! అందమైన నగర దేవత ముఖంమీద బొల్లిమచ్చలు కావా అవి?

నగరం జనాభాలో సగానికి సగం మాలమాదిగలుంటారు. పోనీ - నాలుగో వంతుంటారనుకొందాం. అయితే, నగరం వైశాల్యంలో మాలమాదిగలుంటున్న పేటల వైశాల్యం ఎంత? లక్షోవంతైనా ఉన్నదా?

మాలమాదిగలకు, గుడిసెల సంఘాలకు నాయకత్వం వహిస్తున్న మహాత్ముని శిష్యుల్లారా! లెక్కలుకట్టి ప్రకటించండి! అంతరాత్మలు తడిమి చూచుకోండి! బ్రతకడమే ముఖ్యం కాదు. కుక్కలు, గాడిదలు కూడ బ్రతుకుతున్నై.

## 92

నౌబత్ పహాడ్ దిగువ, ఆ కొండ మొదట్లో ఒక మాలమాదిగ పేట ఉంది. అక్కడ సుమారు రెండువందల కుటుంబాలు కొన్ని వందల తరాలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడేవరకు ఆ ప్రాంతంలో ఆ గుడిసెలు తప్ప జన సంచారమే లేదు.

ఇప్పుడు ఆ ప్రాంతంలో గొప్పగొప్పవారి మేడలతో, మిద్దెలతో ఒక ఆదర్శనగరమే ఆవిర్భవించింది.

ఆ మాలమాదిగ గుడిసెలు మాత్రం అలానే మూలుగుతున్నై - తుప్పుపట్టి చిల్లులుపడ్డ డబ్బారేకుల బరువుల క్రింద - గజాని కొక గుడిసెగా- అర్ధరాత్రి గోనెగుడ్డలు కప్పుకొని వణుకుతున్న కార్మిక శతవృద్ధుల్లా!

పరిసరాలలో, ఇతర కులాల ప్రజలలో వచ్చిన మార్పు, అభివృద్ధి మాలమాదిగలలో, ఆ గుడిసెలలో రాలే దేమి? ఎవరూ ఆలోచించరెందుకని?

నగరంలో మాల మాదిగ పేటల అసహాయ స్థితికీ, మాల మాదిగ ప్రజల అబలత్వానికీ ఇదొక ఉదాహరణ మాత్రమే. ఈ అన్యాయం, ఈ దౌర్భాగ్యం నగరం నిండా ఉంది. చూచే నాథుడు లేడు. అందుకునే నాయకత్వం లేదు.

## 93

మాలమాదిగ యువకుల్లారా! ఏకం కండి!

అస్పృశ్యతపై, కుల వ్యవస్థపై, వర్గ పక్షపాతంపై, స్వార్థ పరత్వంపై, అవినీతిపై, అన్యాయంపై, ధర్మయుద్ధం ప్రకటించండి!

సుప్రసిద్ధ, సనాతన, వైదిక భారత జాతి మళ్ళీ దాస్యజాతి కాకుండా కాపాడుకోడానికి నడుం కట్టండి!

స్వార్థపరులు, కుక్షింభరులు, లంచగొండులు, పదవీ లుబ్ధులు అయిన మీర్జాపరులు మనలో, మనచుట్టూ ఎప్పటికప్పుడు పుడుతూ, చస్తూ ఉంటారన్న సత్యాన్ని విస్మరించకండి! మీ ప్రాణాలైనా ఒడ్డి ఆర్ష భారత ధర్మాన్ని రక్షించడానికి కళ్ళు తెరవండి! మీ అజ్ఞానాన్ని, అధైర్యాన్ని, అబలత్వాన్ని ఒక ఒళ్లు విరుపుతో విదిలించి వేసుకోండి.

## 94

లంచం పుచ్చుకొన్న లక్ష రూపాయల కంటే ఒక్క తుపాకీ బలమైంది. తుపాకులు పుచ్చుకున్న లక్షమంది సైన్యం కంటే ఒక్క ఆటంబాంబు బలమైంది. లక్ష ఆటంబాంబుల కంటే కార్మికుని ఒక్క చెమటబొట్టు బలమైంది. లక్షమంది కార్మికుల చెమటబొట్ల కంటే ఒక్క మార్క్సు సిద్ధాంతం బలమైంది. లక్షమంది మార్క్సుల సిద్ధాంతల కంటే ఒక్క మహాత్ముడి రాజనీతి బలమైంది. లక్షమంది మహాత్ముల రాజనీతుల కంటే ఒక్క అంబేద్కర్ మానవ సమతా ధర్మం బలమైంది. అట్టి ధర్మం కోసం పోరాడటానికి - ఓ నిరుద్ధ జాతుల యువకుల్లారా! నడుంకట్టి ముందుకు దూకండి!

## 95

సొంత కులం చెప్పుకోడానికి జంకుతున్న వాళ్ళు, పరాయి కులం పేరుమీద బ్రతుకుతున్న వాళ్ళు, మాల మాదిగ యువకులలో చాలామంది ఉన్నారు. అది నిజంగా సహించరాని విషయం.

కులం దాచుకొంటున్న వారు ముఖ్యంగా విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు; అట్టి వాళ్ళంతా మొత్తంమీద తమ ప్రాంతాలకు దూరంలోను, పట్టణాలలోను ఉంటున్న వాళ్ళే.

సొంత కులాన్ని దాచుకోవడం, పరాయి కులంగా చెలామణి అవడం నిజంగా కుల ద్రోహమే కాదు – ఆత్మ పాతిత్యం కూడా అవుతుంది. అట్టి దుస్థితిని తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

## 96

మాల మాదిగ విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారులు కులం దాచుకోడానికి కారణాలు నాలుగు.

(1) ఏదో కొంచెం చదువుకొని, తెల్లబట్టలు వేసుకొని, పట్నంలో షికార్లు కొట్టే పైలాపచ్చీసుతనం.

పల్లెలోనే కాదు, మహాపట్టణంలోకూడ – మాలమాదిగ వాణ్ణనే కాదు, మహాత్ముడి నామం జపిస్తూ హరిజనుణ్ణని చెప్పుకొన్నా కూడ, అవమానం తప్పదు కనుక – అట్టి వాడు పరాయి కులం పేరు చెప్పుకొని, గౌరవ మర్యాదలు పొందుతాడు. ఎక్కువగా నాయుడు అనే కల్పవృక్షం క్రింద తలదాచుకుంటాడు!

(2) బాగా చదువుకొని – ప్రతిభా ప్రాభవమో, కళాసౌకుమార్యమో కలిగి ఉండి– సంస్కారం కల అగ్రవర్ణ యువకుల స్నేహానికి లొంగిపోయిన ఉత్తమ సహృదయత.

నా విద్యార్థి దశలో ఒకసారి ఇద్దరు బ్రాహ్మణ మిత్రులతో ఎక్కడెక్కడో తిరిగి ఒక అగ్రహారం చేరుకున్నాం. అక్కడ ఒక బ్రాహ్మణ గృహస్థు ఇంట ఆ రాత్రికి ఆగాం. ఆ గృహస్థు నా మిత్రులలో ఒకరికి పరిచయుడో, బంధువో.

నేను చచ్చినా నా కులం దాచుకోనని నా మిత్రులకు తెలుసు. అందువల్ల – ముందే నా దగ్గర ఒక వాగ్దానం తీసుకున్నారు వాళ్లు. ఏమని? ఆ ఇంటి వాళ్ళలో ఎవరయినా నా వద్ద కులమతాల ప్రసక్తి ఎత్తినప్పుడు నోరెత్తకుండా చిరునవ్వు మాత్రం నవ్వుతానని, వాదన వస్తే – బ్రహ్మ సమాజాన్ని నేను బలపరుస్తానని!

నేను అబద్ధం ఆడవలసిన అవసరం లేదు. కనుక అందుకు ఒప్పుకున్నాను.

అంతా సవ్యంగానే కాదు- ఎంతో ఉత్సాహంగా, ఆనందకరంగా గడచిపోయిందా మకాం.

ఆ తర్వాత చెప్పారు వాళ్లు నాకు- వాళ్ళు ఆడిన నాటకం గురించి! నేను ఏదో శాఖ బ్రాహ్మణ్ణనీ, బ్రహ్మ సమాజంలో చేరి జందెం తీసేశాననీ, కులమత భేదాలు పాటించని వట్టి చాదస్తపు ఆధునికుణ్ణనీ ఆ ఇంటి వాళ్లకు చెప్పారట! ఎంత ఘోరమైన అబద్ధం!

"ఈ కాలపు కుర్ర కారంతా అంతేలే. ఏం చెస్తాం!" అన్నారట ఇంటివాళ్ళు. ఎంత ఉదారమైన సహనం!

ఈ రకమైన స్నేహసమౌదార్యంవల్ల కులం చెప్పకపోవడం ఉంది. ఇది కూడా ఒక బలహీనతే.

(3) తమ కులం పేరుచెపితే తమ వద్ద ఎవరూ సరుకు కొనరనీ, వ్యాపార రంగంలో తమకు భవిష్యత్తు ఉండదనీ భావించే ఒక భయం.

ఈ భయం సహేతుకమైనట్టిదే. అయినా భయంతో బ్రతకడం ఎంత కాలం?

(4) ఉద్యోగ ధర్మంపై దూర ప్రాంతాలలోను, పట్టణాలలోను కాపురం ఉండవలసిన పరిస్థితిలో – కులం పేరు చెపితే అద్దెకు ఇళ్ళు దొరకని దుస్థితి.

ఇది మరీ ఘోరమైన, దుర్భరమైన దుస్థితి. హిందూ సమాజం ఎంత మూఢ పాశవిక నీచస్థితికి దిగజారిపోయిందో సూచించే తర్జని!

ఈ నాడు హైదరాబాదు వంటి నగరాలలో, హరిజనుల మని చెప్పుకుంటే అద్దెకు ఇళ్ళు దొరకవు. పోనీ- మాల మాదిగ గుడిసెల్లో ఉండరాదా అంటే, అవి వాళ్ళకే చాలని పూరి పాకలు, మురికి కూపాలు. ఇక కులం దాచుకోవడం కంటే గత్యంతరం ఏముంది?

ఎంతో అభిమాన ధనులైన హరిజనోద్యోగులు కూడ అద్దె ఇళ్ళకోసం నాయుళ్ళమని చెప్పుకొంటూ బ్రతుకుతున్న సందర్భాలు వందలూ, వేలూ ఉన్నై నగరాలలో. ఎంత హృదయ విదారకమైన పరిస్థితి!

ఈ పరిస్థితి కొనసాగినంత కాలం భారత జాతికీ, దేశానికీ పురోగతి ఉన్నదా!

## 97

"మేం హరిజనులం" అంటే అద్దెకు ఇల్లు ఇవ్వరు.

"మేం నాయుళ్ళం" అంటూ వాళ్ళే తిరిగివస్తే, అద్దెకు ఇల్లు ఇస్తారు.

అంటే - అస్పృశ్యత ఎక్కడుంది? వ్యక్తి రూపంలోనా? కులం పేరులోనా?

ఎంత అవివేకం! ఎంత మూర్ఖత్వం!

ఒక్క భాగ్య నగరంలోనే కాదు. తదితర పట్టణాలన్నిటిలో కూడా - అద్దెల కుంటున్న పెద్దమనుషులలో అధిక సంఖ్యాకులు హరిజన నాయుళ్ళే అని చెపితే- ఆ అద్దె ఇళ్ళ యజమానులు గుండెలు పగిలి చస్తారా?

## 98

భారత దేశంలో - వివిధ కులాల, మతాల వ్యక్తుల్ని - ఒకే ప్రాంతం వాళ్ళని - ఒకే వయస్సు, చదువు, వృత్తి కలవాళ్ళని - ఒకే రకం దుస్తులు ధరించిన వాళ్ళని - ఒక వరుసలో నిలబెడితే - ఎవడు ఏ కులంవాడో, ఏ మతంవాడో, ఎవడు హరిజనుడో, ఎవడు సిరిజనుడో ఎవరైనా చెప్పగలరా?

పోనీ - రక్తపరీక్ష చేసైనా చెప్పగలరా?

ఇలాంటి సవాలునే ఒకసారి గాంధీజీ చేసిన జ్ఞాపకం.

"అంటరాని వారెవరు?" అన్న తన గ్రంథంలో రక్త పరీక్షనే ప్రాతిపదికగా డాక్టరు అంబేద్కరు ప్రతిపాదించాడు. ఈ దేశంలో ఆయా ప్రాంతాలలో నివసించే హిందువులంతా ఒకేజాతికి చెందినవారని నిరూపించాడు.

అస్పృశ్యతా, కులతత్వమూ వ్యక్తిలో లేదు. కులం పేరులో ఉంది. ఎంత అజ్ఞానం! ఈ అజ్ఞానాంధకారాన్ని ఆధునిక విజ్ఞాననిధులైన యువకులెంత కాలం భరిస్తారు?

## 99

ఆఫ్రికా, అమెరికా వంటి దేశాలలో తెల్ల జాతివాళ్ళు రంగుజాతుల పట్ల చూపుతున్న వివక్షణకు- ఇక్కడ హిందూ అగ్ర కులాలు హరిజనులపట్ల చూపుతున్న వివక్షణకు పోలిక లేదు.

అక్కడ రెండు వేరువేరు జాతుల మధ్య పోరాటం.

ఇక్కడ ఒకే రక్త సంబంధ జాతిలో ఆర్థిక సాంఘిక విశిష్టతకోసం అంతర్ఘర్షణ. మీ పోరాటంలో ఈ సత్యాన్ని గుర్తుంచుకోవడం అవసరం. ఎందుకంటే– ఇక్కడ అగ్రకుల యువకులలో చాలామంది ఈ సత్యాన్ని గుర్తించినవాళ్ళే. వాళ్ళంతా మీ కుల నిర్మూలనోద్యమంలో మీతో కలిసేవాళ్లే!

## 100

సిగ్గుపడి కాని, మొగమాటపడికాని, భయపడికాని, అవసరార్థం కాని, మాలమాదిగ లెవరూ తమ కులాన్ని దాచుకోరాదు. అలా దాచుకోవడం ఉభయ భ్రష్టత్వం.

ధైర్యాన్ని కూడగట్టుకోండి! అవమానాలకు, ప్రాణ త్యాగాలకు కూడ సిద్ధం కండి! అప్పుడే మీరు మానవులుగా బ్రతుకగలుగుతారు.

## 101

అస్పృశ్యత యొక్క అసలు స్వరూపం ఏమిటి?

ఏ సమస్యకైనా రెండు స్వరూపాలు ఉంటై. ఒకటి బాహ్య స్వరూపం. ఒకటి అంతస్స్వరూపం. ఈ రెండు స్వరూపాలను, స్వభావాలను మనం నిశితంగా పరిశీలించి, స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

పరిష్కారానికి ఏ సమస్య అయినా లొంగడం లేదంటే – అదొక గోముఖ వ్యాఘ్రంగా ఉన్నదన్నమాట. దాన్ని పరిష్కరించాలంటే దాని అసలు స్వరూపాన్ని పట్టుకోవాలి.

## 102

అస్పృశ్యతకు కారణం ఏమిటి?

(1) వాళ్ళు మురికిగా ఉంటారు అని.

(2) మురికి వృత్తులు చేస్తారు కనుక దూరంగా ఉంచబడ్డారని

(3) ఏదో తప్పు పనికి వాళ్ళ పూర్వీకులు జాతి భ్రష్టులు కావించబడి, వెలివేయబడ్డారని.

(4) పాపం చేసిన వాళ్లు శిక్ష అనుభవించడానికి ఈ కులాలలో పుడతారని

ఎవరికి తోచిన జవాబులు వారు చెప్పి, ఆయా కారణాలను నిర్మూలించు కుంటే అంటరాని తనం తొలగిపోతుందని పరిష్కారం సూచించారు - చాలమంది సంస్కర్తలు.

(1) ఆవు, గేదె, పంది, కుక్క, వంటి వన్నీ మురికిగా లేవా?

(2) పందులు వగైరాలను పెంచేవాళ్ళు, తోళ్ల వర్తకులు, మాంస విక్రేతలు, చేపల అంగడిదార్లు - ఈ అందరూ మురికి వృత్తులు చేసేవారే కదా? వాళ్లెవరికీ అంటరాని తనం లేదుకదా?

(3) "చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేన యు" అనేది ఏ నాటిది? కృతయుగం నాటి వెలి ఇంకా కొనసాగుతూనే ఉన్నదా?

(4) పాపం చేసిన వాళ్లు ఉత్తమమైన మానవ జన్మకు ఎందుకు వస్తారు? కుక్క, పంది వంటి నీచ జన్మలకు పోతారు. అవన్నీ మళ్లీ స్పృశ్య జంతువులే కదా?

ఆయా కారణాలకు జవాబులుగా, ఇలాంటి హేతువాద ప్రశ్నలతో సాయుధులై - ఎంతోమంది ప్రవక్తలు, యోగులు, సంస్కర్తలు, మహాత్ములు, ఎంతో కృషి చేసినప్పటికీ అస్పృశ్యత తొలగి పోలేదు. ఎందుచేత?

అశుభ్రత, వృత్తి హేయత, జాతి బహిష్కారం, పూర్వజన్మ దుష్కర్మవంటి వన్నీ కేవలం పైకి చెప్పుతున్న కారణాలు. అవి అసలు కారణాలు కానే కావు. ఈ అశుభ్రత వంటివన్నీ అగ్రకులాలలో కూడా ఎక్కువగా ఉన్నట్టివే.

## 103

అస్పృశ్యతకు అసలు కారణం ఆర్థిక దుస్థితి. మతం పేరుతో హిందూ సమాజం ఒక వర్గంగా తయారై, అనేక దుష్ట శాసనాల ద్వారా శూద్రుల్ని బానిసలుగా చేసుకొన దలచింది. శూద్రులు తిరగబడగా వారిని తనలో లీనం చేసుకొని, ఆ తర్వాత హరిజనులపై పడింది. ఇప్పుడు హరిజనులు కూడ తిరగబడితే తప్ప - ఈ సమస్య పరిష్కారం కాదు.

తన కింద శాశ్వతంగా ఒక బానిస వర్గాన్ని సృష్టించి అణచి ఉంచుకోవడానికి హైందవ సమాజం పన్నిన పన్నాగమే అంటరాని తనం. ఇది సాంఘిక సమస్య కాదు. కేవలం ఆర్థిక సమస్య. అందుకు అనుగుణమైన విధంగానే దాన్ని పరిష్కరించ వలసి ఉంది.

## 104

మాల మాదిగ యువకులు ముందుగా సంఘటితం కావాలి. తర్వాత తదితర పీడిత కులాల యువకుల్నీ, ఆ తర్వాత అభ్యుదయ కాములైన అగ్రకులాల యువకుల్నీ కూడగట్టుకోవాలి.

అగ్రకులాల వారి సహకారం ఇందుకు లభిస్తుందా అని అనుమానించకండి! అస్పృశ్యతా నివారణకోసం శతాబ్దాలుగా కృషి చేస్తున్నవారు, ఈ శతాబ్దంలో అందుకు ఉద్యమాలనే లేవదీసిన గాంధీజీ, వీరేశలింగం పంతులు, వెంకట రత్నం నాయుడు. పొట్టి శ్రీరాములు, మంగిపూడి వెంకటశర్మ వంటి వారు అంతా అగ్రకులాలవారే అన్న సత్యాన్ని విస్మరించకండి!

## 105

ప్రతివ్యక్తి ఏదో ఒక కులంలో పుడతాడు కదా? ఆ కులం యొక్క తత్వం, ప్రభావం ఆ వ్యక్తిపై తప్పకుండా ఉంటుంది. అలా ఉండడం ఆ వ్యక్తి దోషంకాదు.

ఆయా వ్యక్తుల్ని ఆయా కుల మతాల ప్రభావం నుంచి తప్పించి, వాస్తవ పరిస్థితుల్ని వారు అవగాహన చేసుకొనేటట్టు మనం చెయ్యాలి. అదంత సులభమైన పనికాదు. అందుకు ఎంతో ఓర్పు, తెలివితేటలు, చాక చక్యం, వాస్తవిక, దృష్టి, గ్రంథ పరిచయం, సంప్రదాయజ్ఞత, వాద పటిమ, పట్టుదల, ఒప్పించేశక్తి, నిరంతర కృషి, వేచిఉండే ఓర్పు ఉండాలి.

భ్రమలు, మూఢాచారాలు అంధ విశ్వాసాలు, ఆనువంశిక స్వప్రయోజనాలు చాలా బలంకలవి. వాటి నుంచి విముక్తే నిజమైన విముక్తి. ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి, అట్టి విముక్తిని సాధించాలి. అగ్రవర్గాల యువకుల్ని ఉద్యమంలోకి తీసుకురావాలి.

## 106

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఒకళ్ళిచ్చేవి కావు. ఆత్మబలంతో, ఐక్య ప్రతిఘటన ద్వారా సాధించుకోవలసినట్టివవి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని వ్యక్తిగాని, జాతిగాని, దేశంగాని కేవలం జీవచ్ఛవం.

వేద ఋషులంతా హరిజనులకు, గిరిజనులకు, బహుజనులకు చెందినవారే. వైదిక సంస్కృతి, ఆర్ష సంప్రదాయం, భారతీయ వేదాంతం అంతా మనదే. సనాతనమైన ఈ మన ఆస్తిని కాపాడుకోడానికి - మాల మాదిగ యువకుల్లారా, ఏకం కండి!

## 107

ఈనాడు దేశంలో కాపిటలిజం, సోషలిజం, కమ్యూనిజం, మార్క్సిజం అంటూ - రకరకాల పార్టీలమధ్య రాజకీయ పోరాటాలు జరుగుతున్నై. ఏ ఇజానికీ, ఏ లక్ష్యానికీ కట్టుపడని పార్టీలు కూడా చాలా ఉన్నై. నాయకత్వం, పదవి- ఈ రెంటికోసమూ తాపత్రయం తప్ప మరో పరమార్థం ఉన్న పార్టీ ఒక్కటీ లేదు.

భారత దేశం బడుగు దేశం కావడానికి కారణమేమిటో, ఆ కారణాన్ని నిర్మూలించడం ఎలాగో తెలిసిన నాయకులు కాని, పార్టీలు కాని ఈనాడు మృగ్యం. లేని ప్రయోజనాలను సంపాదించుకోడానికి ఒక వర్గం ఉన్నవాటిని రక్షించుకోడానికి ఒక వర్గం పోటీలు పడుతూ, పోరాడుకొంటూ ఉన్నై. అంతే.

ప్రజల సాముదాయక శ్రేయస్సును కాంక్షించే వారెవరూ రాజకీయ రంగంలో లేరు.

ఈ రకమైన రాజకీయాల జోలి మీకు వద్దు. మీ కార్యక్రమం ప్రజల మధ్య ప్రారంభం కావాలి. అస్పృశ్యతా నిర్మూలనతో ప్రారంభం కావాలి.

## 108

పాత కాపు పండితులు, స్వాములు, వాళ్ళకు పాద పూజలు చేసే నాయకులు, పెత్తందార్లు, కులాన్ని స్వార్థాని కుపయోగించుకునే కులపెద్దలు, భగవంతుడికి కూడా లంచం ఎరచూపే దోపిడీ దొరలు, శక్తి సామర్థ్యాలను అసహ్యించుకునే దుర్బలులు, అధికార దాహం తీర్చుకోడం కోసం దేశమాతను కూడ తాకట్టు పెట్టడానికి వెనుకాడని కుత్సితులు- ఇలా ఎన్నోరకాల స్వ ప్రయోజకులు తరతరాలుగా జాతి ప్రయోజనాన్ని

అడ్డుతున్నారు. దేశ పురో గతికి గుదిబండలుగా ఉన్నారు. వీరందర్నీ ఓడించుకొంటూ మీరు ముందుకుపోవలసి ఉంది.

## 109

"కృణ్వంతో విశ్వమార్యం" అనే నినాదంతో జైత్రయాత్రకు శంఖం పూరించిన వేదజాతి– నేడింతగా చిక్కి, శల్యావశిష్టమై, చిన్నాభిన్నమై మరణశయ్య మీద ఉండడానికి కారణం– దాసీ దేశమై మూలుగుతుండడానికి కారణం– మత మౌఢ్యానికి అట్టిపెట్టుకు బ్రతుకుతున్న ఈ స్వాములే! ప్రతిభను పట్టి పాతేస్తూ, తాము మాత్రమే బ్రతకాలనుకునే అసమర్థ కుక్షింభరులే!

దోమల బ్రతుకుతెరవు కోసం మురికిగుంటల్ని పెంచుకుంటామా? భారత జాతి పునరుజ్జీవం కోసం మూఢ మతవాదుల్నీ, స్వార్థపరుల్నీ, కులతత్వ స్వాముల్నీ ప్రతిఘటించండి!

## 110

*"తల్లి ఊర్వశి లంజ, తన అలు మాదిగ,*
*తాను బ్రాహ్మడయ్యె తగ వశిష్ఠ*
*డిలను గుణమె కాని, కులమేమి ముఖ్యము?*
*విశ్వదాభిరామ వినురవేమ!"*

అన్నాడు వేమన్న. జన్మ చేత అందరూ శూద్రులే. కర్మ చేతనే వర్ణాలు ఏర్పడుతున్నై. బ్రహ్మజ్ఞానం అనేది వైదిక మతంలో మకుటాయ మానమైన పరమజ్ఞానం. అట్టి బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించినవాడే బ్రాహ్మణుడు.

*జన్మనా జాయతే శూద్రః*
*కర్మణా జాయతే ద్విజః*
*వేద పాఠంతు విప్రాణాం*
*బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః*

జన్మ చేత అందరూ శూద్రులే. కర్మ చేత కొందరు ద్విజులై నారు. కర్మ అంటే వడుగు చేసుకొని, జందెం వేసుకొనడమేనా?

వేదాల ముఖమే చూడని నేటి ఈ గుమస్తా బ్రాహ్మలంతా విప్రులేనా?

బ్రహ్మజ్ఞానం, యోగసిద్ధి కలవాళ్ళు ఈనాడు బ్రాహ్మణుల మని చెప్పుకొనేవారిలోనే కంటె - తదితర కులాలలోనే - ముఖ్యంగా హరిజనులలోనే - ఎక్కువగా కలరన్న సత్యాన్ని గుర్తించండి.

అందువల్ల - గుణాన్ని బట్టి వృత్తీ, వృత్తిని బట్టి కులమూ ఏర్పడతాయే కాని, కులం పుట్టుకతో రాదు. బ్రాహ్మణత్వం అనేది ఒక డిగ్రీ. అది ఎవరికి వారే సాధించుకోవలసినట్టిది. గ్రాడ్యుయేటు కొడుకు పుట్టుకతోనే గ్రాడ్యుయేటు ఎలా కాడో, అలానే బ్రాహ్మణుడి కొడుకు పుట్టుకతోనే బ్రాహ్మణుడు కాడు.

వేద కాలంలో పుట్టుకకు ప్రాధాన్యం లేదు. గొప్ప గొప్ప ఋషుల, రాజుల పుట్టుకలను పరిశీలించి చూడండి. అందులో సహజంగా వివాహిత దంపతులకు పుట్టిన వాళ్లెంత మంది?

గ్రాడ్యుయేటు కొడుకు పుట్టుక తోనే గ్రాడ్యుయేటు కాడు. కూలి వాడి కొడుకు పుట్టుకతోనే కూలివాడు కాడు. అతడు చదువుకొని గ్రాడ్యుయేటు కావచ్చు. మిలిటరీలో చేరి సేనాధిపతి కావచ్చు. బట్టలకొట్టు పెట్టుకొని వర్తకుడు కావచ్చు. వ్యవసాయ దారూ కావచ్చు. పుట్టుకతో మాత్రం ఎవరూ ఏమీ కాదు.

అందుకే - పుట్టుకతోనే కులాలను నిర్ణయిస్తున్న నేటి కుల వ్యవస్థ అశాస్త్రీయమైనట్టిది. అసహజ మైనట్టిది. అన్యాయమై నట్టిది. అందుకే- దీన్ని రద్దు చేస్తేనే కాని మానవ పురోగతి సాధ్యం కాదని గుర్తించండి.

## 111

వేద వ్యాసుడు మున్నగు పరమర్షులు చెప్పిన త్వమేవాహం, తత్త్వమసి. అహం బ్రహ్మాస్మి, కృణ్వంతో విశ్వమార్యం వంటి ఆధ్యాత్మిక వైదిక సూత్రాలన్నీ సోషలిస్టు సూత్రాలే.

ఆర్య జీవన విధానం సోషలిజమే. మానవుడిలోని బాల్య యౌవన కౌమార వృద్ధాప్యాలు నాలుగూ, ధర్మ అర్థ కామ మోక్షాలు నాలుగూ, పురుషార్థాలను సాధించే

దశలు. శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ అనే నాలుగు వర్ణాలకు (అంటే గుణాలకు) ప్రతీకలు అవి.

ఒకే పురుషుడు బాల్యంలో ధర్మ ప్రధాని అయిన శూద్రుడు, యౌవనంలో అర్థ ప్రధాని అయిన వైశ్యుడు, కౌమారంలో కామ ప్రధాని అయిన క్షత్రియుడు, వృద్ధాప్యంలో మోక్ష ప్రధాని అయిన బ్రాహ్మణుడు అవుతాడు. వర్ణం అంటేకాదు. ఈనాటి కులాల వంటివి దానికి లేవు. ఉంటే ఆనాటి ఋషులంతా మాలమాదిగలో, వెనకబడ్డ కులాలవారో అయి తీరవలసిందే.

ప్రపంచమంతా ఆర్యం చెయ్యమంటే ఏమిటి? ఆర్యజీవన విధానాన్ని. పురుషార్థ ప్రణాళికను ప్రపంచ ప్రజలలో ప్రచారం చెయ్యమనే కదా? ప్రపంచ ప్రజలందర్నీ ఆర్యులుగా మార్చమనే కదా? గుణం ఆర్యమతం గుణ ప్రధానమైన జీవనవిధానం, నిజానికి అదొక మతం.

## 112

**నే**టి కమ్యూనిస్టు నినాదం లాంటి నినాదాన్ని అంతకంటే గొప్పదైన సర్వమానవ సమతా ధర్మ నినాదాన్ని ఆనాడే ఋగ్వేదం ఇచ్చింది. ఆ నినాదం ఎందుకు కార్యరూపం ధరించలేదో, ఏ అభివృద్ధి నిరోధక శక్తులు దాన్ని నిరోధించాయో తెలియదు. అప్పటినుంచే ఆర్థిక రాజకీయ స్వార్థశక్తులు విజృంభించి ఉంటాయి. వర్ణం అంటే కులం అనే అర్థం కల్పింపబడి ఉంటుంది. "జన్మనా జాయతే శూద్ర", అనే సిద్ధాంతాన్ని అణిచివేసి, కులం పుట్టుకతోనే వస్తుందన్న కృత్రిమ శాసనాన్ని చేసి ఉంటారు. అట్టి కృత్రిమ శాసనాల ఫలితంగానే - శాసన ధిక్కారాలు, శిక్షలు, వెలి, అంటరాని తనం, అష్టాదశ కులాలు వగైరా అన్నీ ఏర్పడి ఉంటాయి. అసలు ఆర్యధర్మం మంట గలసి ఉంటుంది. స్మృతులు రాబందుల్లా రెక్కలాడిస్తూ ఆ మంటల్ని మరింత రగుల్కొల్పి ఉంటాయి.

లేకపోతే -

మానవ జీవితం యొక్క సమస్త రంగాలలోను సర్వతోముఖాభివృద్ధిని సాధించి, ఆ నాటి సమస్త లోకాలకూ ఆదర్శ ప్రాయమై, గురు స్థానాన్ని ఆక్రమించి ఉన్న

భారతజాతి ఈ నాడు ఇంతగా పతనమై, కూటికీ, గుడ్డకూ కూడ ప్రపంచ వీధుల్లో భిక్షమెత్తుకోవడానికి ఏమిటి హేతువు?

అంతటి ఉదారమైన ఉన్నతమైన జాతి ఇంతటి సంకుచిత నీచదృక్కు ఎందుకయింది?

గతంలో ఏం జరిగిందో ఇప్పుడు మన కక్కరలేదు. ఆర్య వైదిక సోషలిజాన్ని ఏ సైంధవుడు నిరోధించాడో తెలియదు. అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించడం ద్వారా మళ్ళీ మన జాతికి ప్రగతి కల్పించడమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం.

## 113

పాత కాలానికి చెందిన కుల వ్యవస్థను నిర్మూలించి, దాని స్థానంలో కుల రహితమైన కొత్త వ్యవస్థను నెలకొల్పడమే మన లక్ష్యం.

అయితే – ఎంతో కాలంగా పాతుకుపోయిన పాత వ్యవస్థను నిర్మూలించడం సులభం కాదు. అందుకు తీవ్రమైన పోరాటం జరగడం తప్పకపోవచ్చు.

లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధి, కార్యసాధన శక్తి, ప్రాణాలను లెక్కచెయ్యని సాహసం, సూక్ష్మదృష్టి కల మిలిటెంటు కార్యక్రమం, నిస్వార్థ మనస్తత్వం కలవాళ్ళే భారత దేశంలో కుల రహిత ప్రజాస్వామిక సోషలిజాన్ని స్థాపించగలరు.

కడుపు నిండిన కామేశ్వరుల కది సాధ్యం కాదు. ఒక్క మాలమాదిగ యువకులు మాత్రమే అందుకు సమర్థులు.

## 114

ఈ నాడు దేశంలో ఒకే సిద్ధాంతం క్రింద లక్ష పార్టీలు, ముఠాలు, గ్రూపులు ఉంటున్నై, ఎందుకని? నాయకత్వాల కోసం, పదవుల కోసం, గౌరవం కోసం, ధనం కోసం మాత్రమే! ప్రజలను ఉద్ధరించడానికి మాత్రం కాదు!

పేదలకు భూములు పంచుతామన్న పార్టీలను, భూముల్ని జాతీయం చేస్తామన్న పార్టీలను పరిశీలించి చూడండి? ఆ పార్టీ పెద్దల భూములను, ఆస్తులను అంచనాలు కట్టండి! ఒక్కడైనా, ఒక్క సెంటు నేలనైనా వదులుకున్నాడా?

నేటి రాజకీయ పార్టీలన్నీ కుక్షింభరుల డిన్నరు పార్టీలు. వాటి జోలి మనకు వద్దు.

ప్రజల అవసరాలను తీర్చేది విశ్వజనీనమైన ఆర్థిక కార్యక్రమం. రాజకీయ పార్టీ కాదు.

## 115

విద్యావంతులు కండి!

మన ప్రవక్త అయిన అంబేద్కరు మానవ విజ్ఞాన రంగాలన్నిటిలోనూ మహా విద్వాంసుడన్న సత్యాన్ని ఎప్పుడూ మనసులో ఉంచుకోండి.

కవనం, గానం, నర్తనం, చిత్రలేఖనం వంటి కళల్ని– సాము, కుస్తీ వంటి విద్యల్ని అభ్యసించండి. వివిధ దేశాల చరిత్రలు, కావ్యాలు, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు పరిశీలించండి. ప్రతిభను, ప్రజ్ఞానాన్ని పెంచుకోండి.

విద్య శక్తి స్వరూపం. ఏదో ఒక విద్య అయినా స్వాధీనంలో లేనివాడు నిజమైన మానవుడుగా బ్రతకలేడు.

## 116

ధనం ఒక శక్తే. పుష్కలంగా ధనం సంపాదించండి. భూములు, గృహాలు, సమస్త సంపదలూ గడించండి. ఎవరికీ ఎందులోనూ వెనక పడకండి.

సమాజంలో గౌరవ మర్యాదలకు ధనమే ప్రధాన కారణంగా ఉన్నంతకాలం, వ్యక్తి గత ధనం సమాజపరం చెయ్యబడనంత కాలం– అందరితోపాటు మనం కూడ ధనం సంపాదించడంలో ముందడుగు వెయ్యవలసిందే.

అయితే– ఈనాడు ధనం పిచ్చివాడి చేతి రాయిగాను, గ్రుడ్డివాడి చేతి దివిటీగాను ఉన్నది. ధనం కల ప్రతివాడూ మతినీ, మానవతనూ పోగొట్టు కొంటున్నాడు. ఆ మందలో మాత్రం మీరు చేరకండి.

ఒక చేతితో సంపాదిస్తూ, రెండో చేతితో విద్యల కోసం ఖర్చు పెట్టేవాడే నిజమైన ధన వంతుడు.

## 117

షెడ్యూల్డు కులాల వారిని తక్కిన అగ్రకులాల వారి స్థాయికి అభివృద్ధి పరచడం కోసం ఎన్నో రాజ్యాంగ నిబంధనలున్నై. ప్రభుత్వ శాసనాలున్నై. జీఓలున్నై. ఉత్తర్వులున్నై. నిజమే.

అయితే - అవి అమలు జరుగుతున్నాయా? అమలు జరగక పోవడానికి, జరిగినా సఫలం కాకపోవడానకి ఏమిటి కారణం?

మాలమాదిగలు చైతన్య వంతులు కాకపోవడమే అందుకు కారణం.

ఎవళ్ళ కోసం భోజనం వడ్డించ బడిందో, వాళ్ళకు తినడానికి నోళ్ళు లేనప్పుడు ఎవరేం చెయ్యగలరు?

హక్కులూ, శాసనాలూ కాదు ముఖ్యం. మనిషి సుఖ స్వాతంత్ర్యాలకు కావలసింది ఆత్మబలమూ, అనుభవించే శక్తీ.

## 118

ప్రగతి పథంలో అభ్యుదయం సుఖ ప్రసవం కాదు. ఎన్నో నొప్పులకు, బాధలకు, రక్తస్రావాలకు, అస్త్రశస్త్రాలకు, ప్రాణత్యాగాలకు కూడా సిద్ధపడవలసి ఉంటుంది. ధైర్యంతో, చొరవతో, ఓర్పుతో, నేర్పుతో వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి ఉంటుంది.

పురోగామి శక్తులకు ప్రతిఘాత శక్తులు అడుగడుగునా అడ్డు తగులుతూ ఉంటై. వాటిని ఢీకొని, అధిగమించి ముందుకు పోవడమే చైతన్య లక్షణం.

మాల మాదిగలు చైతన్య వంతులు కాకుండా, తమ భవిష్యత్తును తామే దిద్దుకోడానికి సిద్ధం కాకుండా, వారికి ఏ అభ్యుదయమూ లభించలేదు.

## 119

మాల మాదిగల అభ్యుదయం వడ్డించిన విస్తరి కాదు.

కాశీ విస్తరాకుల దగ్గరనుంచీ - పాత్ర సామగ్రి, కాయకూరలు, కట్టెలు, వంటపొయ్యి వరకు కూడ-తామే కష్టపడి సంపాదించుకొని, వండుకొని,

వడ్డించుకోవలసిన శ్రమ జీవులు మాలమాదిగలు. అప్పుడైనా అది వాళ్ళకు దక్కుతుందనే నమ్మకం లేదు. ఈ మధ్యలో ఏ పిల్లో ఏ కుక్కో తినేసి పోవచ్చు. పేదవాడి బ్రతుకు లోకాని కొక చితుకు.

## 120

కులతత్వ వాదులు అస్పృశ్యతను సమర్థిస్తారు. కర్మవాదాన్ని ప్రతిపాదిస్తారు. అందుకు ఉపబలకంగా శాస్త్రాలను ఉదాహరిస్తారు. కూపస్థ మండూకాలుగా ఉండే స్థానిక ప్రజలు అదంతా నిజమని నమ్ముతారు.

అస్పృశ్యతను, కుల వ్యవస్థను, వర్గ పక్షపాతాన్ని సమర్థించే వాదాలన్నీ పచ్చి అబద్ధాలే. వాటి వెనుక ఉన్న సత్యం ఒక్కటే. అది ఆర్థిక స్వప్రయోజనం.

అమాయకులు, సాధువులు, దైవభీతి కలవారు అయిన ఒక వర్గపు ప్రజల్ని శాశ్వతంగా ఆర్థిక రాజకీయ దాస్య పంకంలో ఊరద్రొక్కి ఉంచడం కోసమే అస్పృశ్యత, కర్మ సిద్ధాంతం, శుష్క నీతులు సృష్టించబడ్డై.

## 121

జన్మ లన్నిటిలో మానవ జన్మ ఉత్తమమైంది.

మానవులందరిలో తన తిండిని తాను స్వయంగా కష్టపడి సంపాదించుకునే వాడే ఉత్తమ మానవుడు.

ఇతర మానవుల్ని అన్యాయం చేసి, మోసం చేసి, మై మరిపించి, దొంగ లాభాలు సంపాదించి, జూదమాడి, లంచాలు పట్టి, పిత్రార్జితాన్ని పోగులు పోసుకొని బ్రతికేవాడు ఖచ్చితంగా అధముడు.

మానవులలో హెచ్చుతగ్గులుంటే ఈ విధమైన గుణకర్మ విభాగంపై ఆధారపడి ఉండాలి. పుట్టుకతో అందరూ సమానులే. దైవానికి పక్షపాతం లేదు.

మానవులు కల్పించిన అక్రమాలకు, అక్రమ వ్యవస్థలకు, అక్రమ సిద్ధాంతాలకు మనం తల ఒగ్గ కూడదు. అవన్నీ స్వార్థపరుల అక్రమ కల్పనలు.

## 122

ఎవరూ మనకు శత్రువులు కారు.

కులతత్వ వాదులు సైతం పెడదారులు పట్టించబడిన వారే. తగిన ఉపపత్తులు చూపి, నచ్చచెప్ప గలిగితే - ఎంతటి మూర్ఖ కులతత్వ వాదులైనా సరే- సత్యాన్ని గుర్తించ గలుగుతారు.

వివిధ దేశాలలోని ఆధునిక సమాజాలను, అక్కడి ఆచార వ్యవహారాలను, వాటిలోని వైరుధ్యాలను, సమన్వయ ధోరణులను వివరించి చెప్పడం ద్వారా - హేతువాదం ద్వారా - సద సద్విమర్శ ద్వారా- ఎంతటి మూఢ పట్టుదలలు కలవారి నైనా సరే- చైతన్యవంతుల్ని చేయవచ్చు.

వెలుగు చూపితే ఆనందించని వాళ్ళెవ రుంటారు- కర్మ జబ్బుల వాళ్ళూ, గుడ్డి వాళ్ళు తప్ప?

## 123

వైరుధ్యమూ, ఘర్షణా- ఈ రెండే సృష్టికీ, సృష్టి వికాసానికీ మూల శక్తులు.

చీకటి, వెలుగు- అతివృష్టి, ఉగ్రాతపం- స్త్రీ, పురుషుడు- చావు, పుట్టుక- బాధ, సంతోషం- ఇలా, సృష్టి సమస్తమూ వైరుధ్యాల జంటలతో కూడుకొన్నట్టిదే. ఆ జంటల మధ్య నిత్యమూ జరుగుతుండే సంకుల సంఘర్షణే సృష్టి వికాసానికి దోహదకారి అవుతున్నది.

సృష్టిలో మానవ సమాజం ఒక భాగం. సమాజంలోని వైరుధ్యాలను చూచి నిరాశ పడగూడదు. ఘర్షణకు భయపడి పారిపోకూడదు.

## 124

ఋగ్వేద కాలంలో కష్టపడితేనే తిండి లభించేది. అందుకే అది పనికి ప్రాధాన్యం ఇచ్చింది. అధర్వ వేద కాలంలో తిండి పుష్కలంగా దొరికేది. అందుకే అప్పుడు కళలు, సైన్స్ అభివృద్ధి పొందాయి.

తిండి ఉంటే తీరిక ఉంటుంది. తీరిక ఉంటే కళా విజ్ఞానాలు అభివృద్ధి పొందుతై. కళ విజ్ఞానాల అభివృద్ధే జాతి అభివృద్ధి.

అయితే– ఈనాడు తిండీ, తీరికా ఉన్న అగ్రవర్ణాల యువకులలో కళా విజ్ఞానాలకు బదులు జూదం, తాగుడు వృద్ధి పొందుతున్నై. ఎందువల్ల? జాతి పతనోన్ముఖమై ఉన్నందువల్ల. వేద కాలం తర్వాత జాతిని సంస్కరించి, సన్మార్గంలో నడిపించగల ఋషులు పుట్టనందువల్ల.

ప్రతి మనిషీ పని చెయ్యాలి. ప్రతి పని లక్ష్యమూ సర్వజన శ్రేయమై ఉండాలి.

మనిషి లక్ష్యం తన స్వార్థమే అయితే, ఆ జాతి త్వరలో నశించి పోక తప్పదు.

## 125

**వే**ద కాలమే ఋషుల కాలం. ఆ తర్వాత ఋషులు పుట్టలేదు. స్మృతి కర్తలు పుట్టి ఆర్ష సమాజాన్ని నానా విధాలుగా పాడుపెట్టారు.

అంత వరకు ఋషుల నిత్య తపో వ్యవసాయంతో కలకల్లాడుతున్న వైదిక క్షేత్రం, ఆ తర్వాత సంస్కారం లేక బీడుపడిపోయింది. ముళ్ళ పొదలు, అడవి మొక్కలు దాని నిండా పెరిగాయి. అస్పృశ్యత, కులవ్యవస్థ వంటి విష వృక్షాలను కూడా స్మృతికర్తలు నాటారు. దానితో అదొక మానవ వాసయోగ్యం కాని విషమ గహనంగా తయారై, నేటి హిందూ మతంగా రూపుదాల్చింది.

## 126

**హైం**దవ సమాజంలో ఇన్ని వైరుధ్యాలు పుట్టుకు రావడానికి, హిందూ మతం హిందువులకే దుస్సహం కావడానికి, అనేక మంది పరమతాల లోకి పారిపోవడానికి, పర దేశ పర మతస్థులకు హైందవ సమాజం పాదాక్రాంతమై ఎంతో కాలం పడి ఉండడానికి ఏమిటి కారణం!

ఋషులు పుట్టడం ఆగిపోయిన తర్వాత, వైదిక సమాజం అచేతనమై పోవడమే. బీడు పెట్టబడడమే. సంస్కారమూ, సంస్కరణా లేని ముళ్ళడొంకల నిండా పాములూ, తేళ్లూ, తోడేళ్లూ, పెద్దపులులూ చేరడమే!

## 127

సామాజిక వ్యవస్థ వ్యవసాయ క్షేత్రం వంటిది. దాని శాసనాలను, విధి నిషేధాలను, తక్షణ కర్తవ్యాలను ఎప్పటికప్పుడు విమర్శించుకొంటూ, అవాంఛితాలను నిర్మూలించుకొంటూ, కలుపు తీసుకొంటూ, బూజు దులుపుకుంటూ, చెత్త ఊడ్చుకొంటూ, దేశ కాల పరిస్థితుల కనుగుణంగా సంస్కరించుకొంటూ ఉండాలి. హిందూ సమాజం విషయంలో అలా జరగలేదు. అది ఉపేక్షించబడి, అడవిలా పెరిగిపోయింది. ఉపనిష ద్విజ్ఞాన కాంతి మరుగు పడిపోయి, పౌరాణిక పాండితీ స్వార్థాంధకారం అంతటా ఆవరించింది!

ఇప్పుడు దీన్ని పరిశీలించి, విమర్శించి, ఆధునికం చెయ్యాలంటే కత్తి, గునపం, గొడ్డలి, నాగలి, ములుకోల, కొరడా వంటివన్నీ చేతబట్టక తప్పదు. పిడివాదాల, మూఢ సిద్ధాంతాల, అంధ విశ్వాసాల తుప్పల్నీ, రుప్పల్నీ, డొంకల్నీ నరికి పారేసి - ప్రజల ఆలోచనా పద్ధతి లోనే మార్పు తీసుకురాక తప్పదు.

వైదిక వేదాంత సూత్రాలకూ, హైందవ సామాజిక పద్ధతులకూ మధ్య - దున్నని చేలో ముళ్ళ మొక్కలలా - ఎన్నో వైరుధ్యాలు పుట్టుకొచ్చినై. ఘర్షణ ద్వారా వాటిని నిర్మూలించక తప్పదు.

వివేకవంతులూ, విజ్ఞానవంతులూ, తత్వవేత్తలూ, మానవతావాదులూ అయిన యువకులంతా ఈ ఘర్షణలో, ఈ ధర్మ పోరాటంలో మన పక్షం వహిస్తారు, ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తారు.

## 128

వైరుధ్యాలు రకరకాలుగా ఉంటై.

సిద్ధాంతాలుగా పైకి కనిపించే వాటి వెనుక స్వార్థ ప్రయోజనాలుంటై.

వ్యక్తిగత ఆస్తి, స్వలాభాపేక్ష, అధికార దాహం - ఇవే హిందూ సంఘంలోని అస్పృశ్యతకూ, కుల వ్యవస్థకూ ప్రధాన హేతువులు.

ప్రపంచంలో వివిధ జాతులకూ, దేశాలకూ మధ్య యుద్ధాలకు దారితీస్తున్న కారణాలు కూడా ఇవే.

ఇవి పోతేనే కాని మానవులలో భయాందోళనలు తొలగవు. శాంతి సౌఖ్యాలు వెలగవు.

## 129

దేశ కాల పాత్రలతో సంబంధం లేకుండా - ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే - మానవులకి కావలసింది శాంతి. హిందువులకు కావలసింది కూడా శాంతే.

"ఓం శాంతి: శాంతి:" అంటూ శాంతి మంత్రం పఠిస్తూనే, కొన్ని కోట్లమంది మాలమాదిగలను అశాంతిలో ముంచి ఉంచడంలో హిందువుల ఉద్దేశ్యం ఏమిటి?

శాంతి అంటే తమకు మాత్రమే శాంతి, తక్కిన అందరికీ అశాంతి అని అర్థమా?

"లోకా స్సమస్తా స్సుఖినోభవంతు" అంటూ హిందువులు చెపుతున్న దాంట్లో నిజాయితీ ఉన్నదా?

తమ ప్రక్క ప్రక్కనే బ్రతుకుతున్న ఇన్ని కోట్లమంది మాలమాదిగల్ని అశాంతిలో ముంచి, తాము మాత్రం శాంతిని అనుభవించడం ఎలా సాధ్యం? అందుకు సర్వ సముడైన భగవంతుడెలా అంగీకరిస్తాడు?

## 130

వేదాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు వెలిసిన ఆనాటి ఆర్షమతం వేరు కులాలు, కుత్సితాలు, కుట్రలు కుళ్ళి కంపుకొడుతున్న ఈనాటి హిందూ మతం వేరు.

సంస్కరించడం సాధ్యం కాకపోతే శస్త్రం చేసైనా, సమాజం నుంచి కుల వ్యవస్థను తొలగించి, వ్యాసప్రోక్తమైన ఆర్ష సోషలిజాన్ని నెలకొల్పడానికి - మాల మాదిగ యువకుల్లారా, ఏకంకండి!

## 131

**శాం**తి కోసం యుద్ధం చెయ్యి వలసిన దుస్థితి మానవుడిది.

ఒక్క మానవుడిదే కాదు – సృష్టిలోని అన్ని జీవరాశులదీ ఇదే స్థితి అనవచ్చు.

ప్రకృతి లోని ప్రతి జీవరాశినీ పరిశీలించండి. కనీసం పొలం లోని పశువుల మందను పరిశీలించి చూడండి. అందులోని ప్రతి పెయ్యా, ప్రతి గిత్తా ఎప్పుడో ఒకప్పుడు కోట్లాటలలో పాల్గొని, బలాబలాలు తేల్చుకొని, సమాధానపడి, సాధువులుగా బ్రతుకుతున్నట్టివే.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే అనడంలో భగవద్గీత ఉద్దేశం ఏమిటి? శాంతి కోసం యుద్ధం తప్పదు. యుద్ధానికి భయపడే వాళ్ళకు శాంతి ఉండదు.

## 132

**మ**నకు న్యాయం జరగాలంటే – ఇతరుల న్యాయబుద్ధి మీద కాక, మన స్వశక్తి మీదనే మనం ఆధారపడాలి.

త్యాగ శక్తి, ఆత్మ రక్షణ శక్తి, పరాక్రమ శక్తి – ఈ మూడు శక్తులూ కలిసిందే స్వశక్తి.

## 133

**తా**ను తన ఒక్కడి కోసమూ బ్రతికే కంటే, పదిమంది కోసం చావడం ఉత్తమం. పదిమంది కోసం బ్రతికే కంటే మొత్తం జాతి కోసం చావడం ఉత్తమోత్తమం.

జాతీయత లేకుండా అంతర్జాతీయత లేదు. మీ జాతి రక్షణే మీ ఆత్మరక్షణ.

## 134

**ఒ**క్కొక్క కులం ఒక్కొక్క ప్రత్యేక జాతి వలె పరస్పర వైర భావంతో ఘర్షణ పడుతున్న హిందూ సమాజం నేడు ఒక పగిలి బీటలు దీసిన గోడలా ఉంది. బీటల్ని పూడ్చడం కంటె పూర్తిగా పడగొట్టి మళ్ళీ కట్టడం క్షేమం కాదా? అప్పుడు భారతజాతి ఏకజాతిగా, జగజ్జేయమానంగా వికసించదా?

## 135

అంటరానితనం నిర్మూలించబడి, అగ్ర కులాలతో సమాన ప్రతిపత్తిగల కులంగా హరిజన కులం గుర్తించబడి, గ్రామాల మధ్య వాసయోగ్యమైన గృహాలలో గౌరవంగా హరిజనులు స్థిరపడే వరకు నా ప్రబోధం మాలమాదిగ యువకులకు.

బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, హరిజన వర్ణాలు అయిదూ సమాన ప్రతిపత్తి కలిగి మెలగడం ప్రారంభమైన తర్వాత – వర్ణాంతర భోజనాల ద్వారా, వర్ణాంతర వివాహాల ద్వారా హైందవ సమాజం నుంచి కుల వ్యవస్థ నిర్మూలించబడేదాక నా ప్రబోధం హిందూ యువకులకు. హిందూ సమాజం నుంచి కుల వ్యవస్థ నిర్మూలించబడిన తర్వాత – మత, భాష, ప్రాంతీయ విభేధాలు తొలగిపోయి, ఏక భారతజాతి రూపొందే పర్యంతరం నా ప్రబోధం మొత్తం భారతీయ యువకులకు.

## 136

మన విద్యావిధానం పూర్తిగా మారాలి. తల్లిదండ్రుల ఆర్థిక సాంఘిక పరిస్థితులకు అతీతంగా బిడ్డలు పెంచబడాలి. విద్య గరపబడాలి.

దొంగ కొడుకు దొంగ, బ్రాహ్మణుడి కొడుకు బ్రాహ్మణుడు, అంటరానివాడి కొడుకు అంటరానివాడు, ధనికుడి కొడుకు ధనికుడు, కూలివాడి కొడుకు కూలివాడు – అన్న ధోరణిలో పెరుగుతున్నారు నేటి బిడ్డలు. సంఘంచే అలా చూడబడుతున్నారు. ఇది వట్టి అవాస్తవిక మూర్ఖ ధోరణి. మానవ జాతిని పట్టి పీడిస్తున్న అన్ని వ్యాధులకు మూలం ఇదే.

కుల మత వంశానుగతమైన కృత్రిమ వారసత్వం పోవాలి. ప్రతి వ్యక్తిలోను సహజ ప్రతిభ స్వేచ్ఛగా వికసించాలి. అందుకు వారి కుటుంబ వాతావరణం నుంచి బాలల్ని ఉద్ధరించి, వారిని అసూయాద్వేషాలకు అతీతంగా పెంచాలి. తల్లిదండ్రుల ఆచారాల దృష్ట్యా కాక, బిడ్డల అభిరుచుల దృష్ట్యా అక్షరాభ్యాసం మొదలు అణువిజ్ఞానం వరకు ఉచితంగా విద్య గరపబడాలి.

ఈ విధంగా విద్యావిధానం మారకుండా, వ్యవసాయమూ, పరిశ్రమలూ జాతీయం కాకుండా భగవంతుడు లక్షల అవతారాలెత్తినా, లక్షమంది మహా ప్రవక్తలు తన్నుకు చచ్చినా కూడ సమాజానికి ప్రగతి లేదు.

## 137

**కూ**డు, గుడ్డ, కొంప - ఈ మూడిటినీ కలిగి ఉండడం ప్రతి వ్యక్తికీ జన్మ హక్కు

ఒకడు తీరికగా కూర్చుని మూడు పూటలూ విందులు గుడుస్తుంటే మరొకడు రెక్కలు ముక్కలు కొట్టుకున్నా గంజినీళ్ళు దొరకని పరిస్థితి - ఒకడికి వెయ్యి ఎకరాల భూమి ఉంటే, మరొకడికి ఇళ్ళ స్థలం కూడా లేని పరిస్థితి ఎందుకు వచ్చింది? ఒకడికి బేంకులో లక్ష రూపాయలు ఉంటే, మరొకడికి చేతిలో పదిపైసలు కూడ లేవెందుకు? ఒక్క క్షణం ఆగి ఆలోచించి చూడండి.

## 138

**ల**క్షాధికారి కోటీశ్వరు డెలా అవుతున్నాడు? డబ్బు పిల్లల్ని పెడుతుందా?

ఒక్క ప్రక్క మెజారిటీని మోసం చేసి మైనారిటీ ఆస్తులు ప్రోగు చేసుకొంటూ - మరో ప్రక్క మెజారిటీకి శుష్కనీతులు చెపుతున్నంతకాలం మానవుడికి అభ్యుదయం లేదు. కనుక - ఓ మెజారిటీ ప్రజలారా ! కళ్లు తెరవండి ! మీ జన్మ హక్కులను సాధించుకోవడం ద్వారా మొత్తం మానవ సమాజాన్నే ఒక మజిలీ ముందుకు నడిపించండి !

## 139

**న**మ్మేదానికీ, చెప్పే దానికీ, చేసే దానికీ సమన్వయం ఉండాలి.

మన ఉపనిష ద్వేదాంతం ఆత్మవత్ సర్వభూతాని అంటూ సర్వజన సమత్వాన్ని భోదిస్తున్నది. ఆ తర్వాత వచ్చిన కర్మకాండ ఉపనిషన్మతాన్ని నాశనం చేసి, నేటి కులతత్వాన్ని తెచ్చి పెట్టింది. ఆనాటి వైదిక సమాజానికీ, ఈనాటి హిందూ కులతత్వ సంఘానికీ ఏమీ సంబంధం లేదు. కులతత్వంతోను, హిందూ మతం వేదమతం కాదు కనుక - కులవ్యవస్థను తొలగించి, ఉపనిషత్సామ్య వాదాన్ని నెలకొల్పడానికి సిద్ధం కండి!

## 140

కర్మ అనేది ఏదైనా ఉంటే అది ఈ జన్మకు సంబంధించినదే !

మానసిక శక్తి, శరీర బలం, ప్రతిభ, సామర్థ్యం వంటి వాటిలోని తేడాలు ప్రకృతి స్వభావం తోడివి. స్వభావం, అవసరం, పరిస్థితి – ఈ మూడిటి మీదా ఆధారపడి, వ్యక్తుల మధ్య తరతమ భేదాలు ఉత్పన్నమవుతై.

ప్రకృతి సిద్ధమైన ఒక లక్షణాన్ని తెలివైన వాళ్ళు ఉపయోగించుకొని, తెలివితక్కువ వాళ్ళను దోచుకోడానికి కర్మవాదాన్ని కల్పించారు.

కర్మవాదాన్ని, జన్మవాదాన్ని ఖండించి, మీ దాస్య శృంఖలాలను త్రెంచుకోవడానికి విజ్ఞానాభిముఖులు కండి !

## 141

వాస్తవంగా కులం, మతం అనేవేవీ ఈనాడు లేవు. వాటికి చెప్ప బడ్డ విధి నిషేధాలు మొదలే లేవు.

కుల పెద్దలు, మత పెద్దలు తమ తమ ఆర్థిక రాజకీయ స్వప్రయోజనాల కోసం అమాయక ప్రజల్ని దోచుకోవడానికి కులం పేరును మతం పేరును ఉపయోగించు కొంటున్నారు.

తస్మాత్, జాగ్రత ! జాగ్రత !

## 142

ఈనాడు ప్రపంచంలోని మనుషులు రెండే రెండు వర్గాలు.

1. పనిచేసికొని బ్రతికేవాళ్ళు – శ్రమ జీవులు.

2. పని చెయ్యకుండా బ్రతికేవాళ్ళు – జడ జీవులు.

తాము పని చెయ్యకుండా తప్పించుకోడానికి, ఇతరుల చేత తమ పనులు చేయించుకోడానికి జడజీవులు ఎన్నో నీతులు చెపుతారు, భక్తి సూత్రాలు బోధిస్తారు, శాసనాలు నిర్మిస్తారు. శ్రమజీవులారా ! మోసపోకండి.

సుఖ దుఃఖాలు, లాభ నష్టాలు ప్రకృతి సహజ మైనట్టివి. శక్తి సామర్థ్యాలలోని తేడాలు పరిసరాలకు, తిండికి, పెంపకానికి సంబంధించినట్టివి. సర్వసముడైన భగవంతుడి దృష్టిలో మనిషికీ, మనిషికీ మధ్య తేడా ఉండదని గుర్తించండి!

## 143

దైవ శక్తిని ఆవాహన చేసి, ఆత్మశక్తిని పెంచుకొని, జీవిత విజయాన్ని కోరేది వేదమతం. అదే ఆర్యమతం.

భక్తిని ఆశ్రయించి, దైవం దగ్గర దాస్యం కోసం, జీవితం నుంచి పారిపోయేది పౌరాణిక మతం. అదే నేటి హిందూమతం.

ఈనాటి కులతత్వ దుష్టమైన మూఢ మతమే అసలు భారతీయ సంప్రదాయమని భ్రమ పడకండి.

ఏ మతం తోనూ మనకు ప్రమేయం లేదు. మత మూఢులైన వారి భ్రమలకు సమాధానం కోసం మాత్రమే ఈ సత్యాలు వెల్లడిస్తున్నాను.

కులమత భేదం లేకుండా మొత్తం భారతీయులందరి కోసమూ ఈ ఉద్బోధ చేస్తున్నాను.

## 144

ఈనాడు దేశంలోని పెద్దలకు ఆలోచన లేదు. ఆలోచించే చిన్నలకు పెద్దరికం లేదు.

విద్య, రాజకీయం, మతం, సాహిత్యం – అన్ని రంగాలలోను ఇదే పరిస్థితి.

తిండి, డబ్బు – ఈ రెండూ తప్ప, మరో పరమార్థం లేదీనాడు.

ఈ దుస్థితి నుంచి దేశాన్ని, ఓ మాలమాదిగ యువకుల్లారా, మీరే ఉద్ధరించగలరు ! స్వార్థ త్యాగులై, సర్వ మానవ సమతాధర్మం కోసం లేచి నిలబడండి!

## 145

దేశానికి పునాదులు మాలమాదిగ పేటలు. జాతికి పునాదులు మాలమాదిగ ప్రజలు.

పునాదుల్ని అలక్ష్యం చేసి, మహా సౌధాలు నిర్మించడానికి పూనుకోవడం వల్లనే ఎందరో మహానాయకులు అపజయం పొందారు. ఎన్నో మహోద్యమాలు విఫల మైనాయి. ఎన్నో ప్రణాళికలు బూడిద పాలైనాయి.

నాయకులు, విద్యాధికులు, అధికారులు - ఎవరూ కూడ ఆలోచించడం లేదు. దేశం ఇంతగా రోగిష్టి దెందుకై పోయిందో పరీక్షించడం కూడ లేదు.

అందుకని - పునాదులకే నేనీ హెచ్చరిక చేస్తున్నాను.

ఓ పునాదులారా! మీ వంక ఇతరులు చూడకపోతే, మీ వంక మీరైనా చూచుకోండి! మిమ్మల్ని ఇతరులెవరూ బలపరచకపోతే, మిమ్మల్ని మీరే బలపరచుకొని, భారత సౌభాగ్య సౌధానికి స్థిరత్వం కల్పించండి !

## 146

అస్పృశ్యత, కులతత్వం, మతోన్మాదం, భాషాహంకారం, ప్రాంతీయ సంకుచితత్వం, అధికార దర్పం, లంచగొండితనం, బంధు పక్షపాతం, పదవీ దాహం, చీకటి వ్యాపారం - ఇన్ని దుష్ట వ్యాధులతో మంచం పట్టి ఉన్న రోగిష్టి జాతి, వట్టి పటాటోపమే ప్రధాన లక్ష్యమైన నాటు డాక్టర్ల చేతుల్లో పడడం నిజంగా దురదృష్టమే.

రోగి శరీరంలోని సహజ రక్తాన్ని పీల్చి వేస్తూ, విదేశీ ఎర్రనీళ్ళతో రక్తనాళాలను నింపుతూ, శుష్కోపన్యాసాల నోటి తుపర్ల గ్లూకోజును ఇంజక్షను చేస్తూ - ఈ డాక్టర్లు ఎంతకాలం రోగిని బ్రతికించి ఉంచగలరు.?

వ్యాధుల్ని నిర్మూలించి, జాతిని కాపాడడం కోసం - వివేకం కల యువకులారా, ముందుకు రండి ! వ్యాధి హేతువుల్ని తెలుసుకోండి. మందులు పని చెయ్యకపోతే, శస్త్రం చెయ్యడానికి సిద్ధం కండి:

## 147

ప్రజలకు ఆత్మ విమర్శ నేర్పండి !

పొరపాట్లను, పొర పొచ్చాలను, అపోహలను, అసూయలను ఎప్పటి కప్పుడు నిర్మూలించి వెయ్యండి!

సమస్యలను చెత్తలా పెరగ నివ్వకండి.

మనం ఉంటున్న గదిని ఒక్కరోజు ఊడ్చకపోతేనే అంత చెత్త పెరుగుతుంది కదా? ఒక్క రోజు స్నానం చెయ్యక పోతేనే శరీరంపై అంత మురికి పేరుకొంటుంది కదా? ఒక్క రోజు విరేచనం కాకపోతేనే కడుపులో అంత తీట బైలుదేరుతుంది కదా?

మానవుని బాహ్య పరిసరాలకే, భౌతిక శరీరానికే ఎప్పటి కప్పుడు అంతటి ప్రక్షాళనం అవసరమవుతున్నప్పుడు - మానవ జీవితాన్నే నిత్య నవోన్మేషశీలంగా ఉంచవలసిన మెదడుకు, ఆలోచనకు, సాంఘిక నీతికి ఎంతటి నిశిత నవీకరణ అవసరమో యోచించండి !

రోజు కొకసారి కాదు, ఏడాది కొకసారి కాదు, శతాబ్దాని కొకసారైనా మన ఆలోచనలను, జీవిత పద్ధతులను, సాంఘిక నీతులను, విధి నిషేధ శాసనాలను పున: పరిశీలన చేసుకోవడం లేదుకదా! ఇక ఈ సమాజం నిండా, ఈ మతం నిండా, ఈ బ్రతుకుల నిండా చెత్తాచెదారం చేరకుండా ఎలా ఉంటుంది?

మనిషి ఎక్కడ ఉంటే అక్కడ చెత్త, మురికి, దురలవాట్లు, మూఢాచారాలు స్వార్థపరత, పరపీడన వంటి అవాంఛితాలన్నీ పెరుగుతై. వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ, శుభ్రం చేస్తూ ఉండాలి. అలా చెయ్యకపోవడం వల్లనే హైందవ సమాజం నిండా కుళ్లు పేరుకొని, శిధిలావస్థ ఏర్పడింది!

## 148

భీమ సేనను ముందుగా మాలమాదిగ యువకులతో, మాల మాదిగ పేటలలో ఆర్గనైజు చెయ్యండి. ఈ నాడు ఆరోగ్యకరమైన విప్లవ చైతన్యం కలవాళ్లు ఒక్క మాలమాదిగలే.

ఆ తర్వాత - సాంఘిక హైన్య దైన్యాలకు గురిచేయబడి ఉన్న తదితర కులాల వారినీ, మతాల వారినీ భీమ సేనలో చేర్చుకోండి. సేన లక్ష్యాలతో పూర్తి ఏకీభావంకల ఎవరైనా సరే సేనలో చేరవచ్చు. మాలమాదిగ పేటలను ప్రధాన గ్రామాలతో కలిపి వెయ్యడం ప్రాతిపదికగా కార్యక్రమం ప్రారంభం కావాలి. ఇది సేన కార్య ప్రణాళికలో అతి ప్రధానమైన భాగం.

## 149

సేనలో స్త్రీలకు, విద్యార్థులకు ప్రత్యేక విభాగాలుండాలి. విద్యార్థులకు సృజనాత్మకమూ, నిర్మాణాత్మకమూ, ఉత్తేజకరమూ అయిన కార్యక్రమాన్ని నిర్దేశించాలి.

ఈ నాడు విద్యార్థులలో క్రమశిక్షణ లోపించడానికి కారణం వారి శక్తికి, ఉత్సాహానికి, భావోద్వేగానికి తగిన జాతీయ కార్యక్రమం లేకపోవడమేనని గుర్తించండి.

ఇంటివద్ద తల్లిదండ్రులు కాని, బడిలో ఉపాధ్యాయులు కాని విద్యార్థులకు ఉత్తేజం కలిగించలేక పోతున్నారు. చాలీ చాలని రాబడితో, తెలిసీ తెలియని ప్రణాళికతో సతమతమై పోతున్న వాళ్లు కుర్ర వాళ్ళలో ఉత్తేజాన్ని ఎలా కలిగించ గలరు? అందుకే విద్యార్థులు తమ యౌవన భావోద్వేగాల్ని కార్య రూపంలో పెట్టడానికి వీధిని పడుతున్నారు. ఏం చేస్తారు మరి? ఉరకలు వేసే యౌవన శక్తుల్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకో గల్గిన ప్రణాళిక దేశంలో ఎక్కడుంది? ఎవరికుంది? విద్యారంగం ఈ నాడున్నంత నిస్సారంగా, నిస్తేజంగా, అయోమయంగా, అంధకార బంధురంగా మరెప్పుడుంది?

అందుకే- విద్యార్థులకు తగిన నిర్మాణాత్మక జాతీయ కార్యక్రమం చూప మంటున్నాను.

## 150

చిన్నప్పుడే స్త్రీ సాంగత్యం మొదలు పెట్టిన వాడు యౌవనంలోనే నిర్వీర్యుడై ఎలా నశించి పోతాడో, అలానే విద్యార్థి దశలోనే రాజకీయాలు మొదలు పెట్టిన జాతి ప్రౌఢ ప్రపంచపు పోటీకి తట్టుకోలేక నశించి పోతుంది.

సమస్త విద్యలలోను ఆరితేరిన తర్వాతనే జీవిత రంగంలో ప్రవేశించాలి. జీవిత రంగంలో రాజకీయ రంగం ఒక తరంగం మాత్రం.

అధికారంలో ఆనందం లేదు. రాజకీయ జీవితం కృతకమై నట్టిది. అది ప్రౌఢులకే కాని, యువకులకు పనికిరాదు. విద్యార్థులకు అసలే పనికిరాదు.

రాజకీయ నాయకులు, పార్టీలు ఈ నాడు తమ తమ స్వప్రయోజనాల కోసం విద్యార్థుల్ని వాడుకొంటున్నారు. అంతకంటే నైతిక దారిద్ర్యం మరొకటి ఉండదని గుర్తించండి. పిందెల్ని కోసి మార్కెట్లో పారబోయడాన్ని సహించకండి.

## 151

విద్యార్థులను చదువులలో వలెనే - యువకులను జాతి నిర్మాణ కార్యక్రమాలలో నిమగ్నులను చేసి ఉంచాలి.

మానసికమైన అపరిపక్వత, దైహికమైన నిర్వ్యాపారత- ఈ రెండూ నిస్పృహకూ, తిరుగుబాటుకూ మూల బీజాలు.

జాతి జీవన ప్రగతికి దోహదం చేసే వ్యావసాయక, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాల వివిధ శాఖలలో ప్రభుత్వమే విప్లవాలను నడిపిస్తూ ఉండడం ద్వారా యువకులకు చేతినిండా పని కల్పిస్తూ ఉండాలి.

రాజకీయ రంగం నుంచి వృద్ధులు వైదొలగి, సలహాదార్లుగా మారుతూ - యువకులు కార్యరంగం లోకి ప్రవేశిస్తూ ఉండాలి.

ప్రకృతి - మానవ ప్రకృతి- నిత్య ప్రగతిశీలం. దాని గమనానికి అనుగుణంగా విప్లవం ముందుకు సాగాలి. అది ఎక్కడైనా ఆగిపోతే- రెట్టింపు వేగంతో అది ముందుకు దూకుతుంది.

యుద్ధాలకు, తిరుగుబాట్లకు, కల్లోలాలకు కారణం విప్లవ నిరోధమే.

ఇండియాలో, ముఖ్యంగా హైందవ సమాజంలో విప్లవం ఆగిపోయి ఎన్ని యుగాలైందో గుర్తించారా? కుల కక్షలకు, మత కలహాలకు, అన్నిటికీ మూల కారణం ఏమిటో గుర్తెరిగారా?

మానవత్వం చచ్చిన శవాలపై పదవీ వ్యామోహ పిశాచాలు విందులు గుడుస్తున్నై. చూస్తూ ఇంకా ఎంతకాలం సహిస్తారు?

## 152

కాయ కష్టంలో, త్యాగంలో, ఓర్పులో, బాధలను సహించడంలో, భవిష్యత్తుపై ఆశతో బ్రతకడంలో మాలమాదిగ స్త్రీలు తమకు తామే సాటి. సాంఘిక దురాచారాలను తుడిచి పారవెయ్యడంలో వారికి ప్రాధాన్యం ఇవ్వండి!

స్త్రీలు చైతన్య వంతులై, విప్లవ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర వహించకుండా ఏ జాతి అభ్యుదయాన్ని సాధించ జాలదని గుర్తించండి.

స్త్రీకి వివాహం ఒక్కటే పరమార్థమనే మూఢ విశ్వాసాన్ని వదిలి పెట్టండి. పురుషుడితో సమానంగా పోరాడే శక్తిని కలిగించండి.

ధనిక వర్గాలలోని ఎండ కన్నెరుగని సుకుమారులైన స్త్రీలే ఈనాడు ఉద్యోగాలలో, రాజకీయాలలో, సాంఘిక సేవలో, నాటకాలలో, నాట్యాలలో సంగీత సాహిత్యాది కళలలో ఎంతో ముందడుగు వేస్తుంటే– పురుషులతో సమానంగా కష్టపడే మీ స్త్రీలంతా ఎక్కడున్నారు?

ఇరవై సంవత్సరాలుగా ప్రభుత్వ సహాయంతో చదువుకొంటున్న మీ వేలకొలది అమ్మాయిల నుంచి చెప్పుకోదగ్గ ఒక్క గొప్ప మహిళ కూడ తయారు కాలేదు, ఎందువల్ల?

## 153

విప్లవ చైతన్యం అంటే ఏమిటి? అది ఎవరి కుంది?

మంచి యౌవనంలో ఉండడం, బలంగా ఉండడం, గొంతెత్తి అరవడం, ఉపన్యాసాలు దంచడం, చొరవతో ఎదుటి వాడి మీదకు దూకడం, నినాదాలివ్వడం ఈ లక్షణా లుంటే అది విప్లవ చైతన్యం అవుతుందా? అది ఈనాడు వామ పక్షాలుగా పిలుప బడుతున్న వారిలో అయినా ఉన్నదా?

ఈ దేశంలో ఈనాడు విప్లవ చైతన్యం అనేది ఒక్క మాల మాదిగలలోనే ఉన్నదని గుర్తించండి! కులానికీ, వర్గానికీ తేడా తెలియని వామ పక్షాలకు విప్లవ ధోరణే లేదని తెలియండి!

## 154

భీమ సేన ఒక సర్వ తంత్ర స్వతంత్రమైన జాతీయ సంస్థ. దీని లక్ష్యం హైందవ సమాజం నుంచి అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించడం. నిష్కులమూ, నిర్వర్గమూ అయిన భారతీయ ప్రజాస్వామిక సోషలిస్టు సమాజాన్ని దేశంలో నెలకొల్పడం. విశ్వమానవ సమావిర్భూతికి ప్రభాత భేరి మ్రోగించడం!

కుల వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో సహా పెరికి పారవెయ్య కుండా ఈ దేశంలో సోషలిజాన్ని స్థాపించడం అసాధ్యం.

ఈ దేశంలో సోషలిజాన్ని, అంటే శ్రేయోజన సమ సమాజాన్ని స్థాపించాలని మనస్ఫూర్తిగా విశ్వసించే ఏ పార్టీ అయినా సరే– ముందుగా అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించక తప్పదు.

అందుకు భీమసేన ఒక్కటే సర్వ సమర్ధవంత మైనట్టిది.

## 155

దేశంలోని నేటి ఏ రాజకీయ పార్టీకీ లక్ష్యశుద్ధి లేదు. చిత్తశుద్ధి లేదు. సార్వజనిక దృష్టి లేదు. ప్రజా హృదయావగాహన లేదు. విశ్వాభ్యుదయ కార్యక్రమం లేదు.

తమ వాళ్ళకు ఉద్యోగాలు, లైసెన్సులు, పర్మిట్లు, కాంట్రాక్టులు, ట్రాన్సుఫరులు, ప్రమోషనులు, తమ ఊరికి రోడ్లు, తమ పొలాలకు కాలువలు, తమ ఫేక్టరీకి విద్యుచ్ఛక్తి – ఇలాంటి వేవో సంపాదించు కోడానికి తాపత్రయ పడడం, అందుకు ముఠాలు కట్టడం, పదవుల కోసం కుట్రలు పన్నడం– ఇంతే తప్ప. ఏ పార్టీ నాయకులకూ మరో ఆదర్శం కనబడదు. సాముదాయక శ్రేయస్సు గాని, జాతి సర్వతోముఖాభివృద్ధి గాని ఎవరి మనస్సుకూ పట్టినట్టు లేదు.

అందుకే- దేశంలో సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నై. వాటిని పరిష్కరించే విజ్ఞత తరిగి పోతున్నది. పార్టీలు పడిపోతున్నై. నాయకులు నామరూపాలు లేకుండా పోతున్నారు.

స్వార్థం ప్రవేశించగానే సరస్వతి నిష్క్రమిస్తుంది. సరస్వతి లేని దేశం - ఇప్పుడు మన దేశం వలెనే- అయోమయమై పోతుంది.

నినాదాలు విప్లవాన్ని తేలేవు. మంత్రాలకు చింతకాయలు రాలవు.

ఇచ్ఛాశక్తి లేనిదే జ్ఞానశక్తి లేదు. జ్ఞానశక్తి లేనిదే క్రియాశక్తి లేదు. ఈ మూడూ సక్రమమైన మార్గంలో సర్వజనాభ్యుదయం కోసం పురోగమించినప్పుడే వాటికి దైవశక్తి తోడ్పడి, విజయం లభిస్తుంది.

ఇందులో- ఈ అన్నిటికీ ఆధారభూతమైన ఇచ్ఛాశక్తి మాలమాదిగలలో ఉన్నంతగా మరే కులంలోనూ లేదని గుర్తించండి! ప్రస్తుతం అది నివురు గప్పిన నిప్పులా, మర్రి విత్తులోని మహావృక్షంలా, భూగర్భం లోని అగ్ని పర్వతంలా ఉంది. అది ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రూపంలో క్రియాశక్తిగా మారక తప్పదు. దానికి దైవశక్తి తోడ్పడడం కోసం జ్ఞాన శక్తిని ఆశ్రయించండి!

స్వార్థ రహితమైన సర్వజనాభ్యుదయ కృషే జ్ఞానశక్తిగా గుర్తించండి ! అదే నిజమైన సరస్వతి.

## 156

**ప**నిచేస్తూ ఉంటే అనుభవం కలుగుతూ ఉంటుంది. అనుభవాన్ని మళ్ళీ ఆచరణలో పెడితే, పని మరింత చక్కగా సాగుతుంది. అప్పుడు అనుభవానికి మరింత పదునూ, కాంతీ లభిస్తుంది. వాస్తవ జ్ఞాన సముపార్జన పద్ధతి ఇది.

వాస్తవ జ్ఞానమే సరియైన జ్ఞానం.

మత, రాజకీయ, సాంఘిక, విద్యా, కళా, సాంస్కృతిక ఆది రంగాలలో ఏ ఆచారమైనా, ఏ సిద్ధాంతమైనా, ఏ కార్య పద్ధతి అయినా మానవుని వాస్తవ జ్ఞానం మీద ఆధార పడినట్టిదే. వాస్తవ జ్ఞానం ఎడతెగని పని ద్వారా, పరిశీలన ద్వారా లభించినట్టిదే.

వాస్తవ జ్ఞానం దేశ కాల పాత్రానుగుణమై ఉంటుంది. దేశ కాల పాత్రాను గు ంగా మారుతుంది.

స్వయం వరాలు, కన్యా దానాలు, కన్యా విక్రయాలు, వర విక్రయాలు, ప్రేమ వివాహాలు, విధవా వివాహాలు, ఏకపత్నీత్వాలు, బహు భార్యాత్వాలు, బహు భర్తృత్వాలు, ఈ అన్నిటి మీదా విధి నిషేధాలు, తిరుగుబాట్లు, సర్దుబాట్లు, రాజరికాలు, రిపబ్లిక్కులు, పిలకలు, క్రాపులు, తలపాగాలు, టోపీలు- ఈ విధంగా ఏ చిన్న విషయాన్ని తీసికొని మనం పరిశీలించినా, ఈ సత్యం కనిపిస్తుంది. మంచి చెడ్డలు, ఆచార వ్యవహారాలు, నీత్యవినీతులు, విధి నిషేధాలు అన్నీ దేశకాల పాత్రాను గుణంగా ఎలా మారిపోతున్నాయో స్పష్టమవుతుంది.

ఏ ఆచారమూ, ఏ సిద్ధాంతమూ, ఏ కార్యపద్ధతీ, ఆకాశం నుంచి ఊడి పడలేదు. మార్పుకు అతీత మయిందేదీ లోకంలో లేదు.

## 157

మేధావు లైనవాళ్లు, వివిధ రంగాలలో విప్లవాలను సాధించిన వాళ్ళు విజయాలకు ప్రజలను నడిపించిన వాళ్ళు అందరూ కూడ మొదట్లో మీ వంటి వాళ్ళే పని ద్వారా, త్యాగం ద్వారా, అనుభవాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా గొప్ప వాళ్లైన వాళ్లే.

ఆచరించే వాడికి అసాధ్య మయిందేదీ లేదు. కనుక-న్యాయం అనుకొన్న పనికి వెంటనే పూనుకోండి.

"అనగ ననగ రాగ మతిశయిల్లును నుండు, తినగ తినగ వేము తియ్యనుండు, సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్న వేమన యోగి మాట యదార్థమని గుర్తించండి.

## 158

సృష్టిలో వర్గ వైరుధ్యాలు సహజ సిద్ధ మైనట్టివి. వాటి వల్ల ఘర్షణ ఏర్పడుతుంది. దానివల్ల అభ్యుదయం కలుగుతుంది. ఆ అభ్యుదయంలో మళ్ళీ వైరుధ్యాలు మొలకెత్తుతై. ఇది పురోగమన క్రమం. దీనికి అంతం లేదు.

అంతం లేని ఈ క్రమం దేని చుట్టూ పరిభ్రమిస్తున్నదో దాన్ని తెలుసుకొని, స్వాధీనం చేసుకోవడమే భారతీయ తత్త్వ దర్శనం. దానిని చేరే అనంతకోటి దృక్పథాలలో గతి తార్కిక భౌతిక వాదం ఒకటి.

మార్క్సిజంలో ఉండే లోపాలను సవరించి– ఆర్ష వేదాంతం ప్రతి పాదించిన, బుద్ధ భగవానుడు ప్రయోగించి చూపిన, అంబేద్కరు ఉద్దేశించిన సర్వమానవ సమతా సమాజాన్ని నెలకొల్పవలసి ఉంది. అట్టి పనిని హరిజన బహుజన యువకుల నాయకత్వం క్రింద భీమసేన ఒక్కటే నిర్వహించ గలదని నా విశ్వాసం.

## 159

ఒక్క సత్యాన్ని మనం అసందిగ్ధంగా గుర్తించవలసి ఉంది. కులం అంటే పట్టింపు కలవాళ్ళూ, కులం పేరుతో కొట్లాటలకు దిగేవాళ్ళూ ఆయా కులాలలోని కొద్దిమంది రౌడీలు మాత్రమే. ఈ రోజులలో జనసామాన్యానికి కులంతో నిమిత్తం లేదు.

కొద్ది మంది రౌడీల నుంచీ, పదవీ వ్యామోహపరుల నుంచీ, కులం పేరుమీద బ్రతికే బిచ్చగాళ్ళ నుంచీ జనసామాన్యాన్ని కాపాడ గలిగితే చాలు, అన్ని కులాల ప్రజలూ మన ఉద్యమాన్ని బలపరచ గలరు.

## 160

ఎక్కడ చైతన్యం లేదో అక్కడ కాంక్ష లేదు. ఎక్కడ కాంక్ష లేదో అక్కడ ఘర్షణ లేదు. ఎక్కడ ఘర్షణ లేదో అక్కడ అభ్యుదయం లేదు.

మాల మాదిగలు తరతరాలుగా దాస్యంలో మునిగి ఉండడానికి హేతువు వారిలో వర్గ చైతన్యం లేక పోవడమే.

## 161

భారత దేశంలో వర్గం అంటే కులం. ఈ సత్యం తెలియ నందువల్లనే, ఈ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం సైతం విఫలమయింది.

ఈ దేశంలో కులాన్ని నిర్మూలించకుండా, ప్రగతి పథంలో ఒక్క అడుగైనా ముందుకు సాగడం సాధ్యం కాదు.

## 162

అగ్రశ్రేణి నాయకులలో, విద్యావంతులలో, పట్టణ వీధులలో, హొటళ్లలో, సినిమా హాళ్ళలో, క్లాసు రూములలో, సభలలో– అస్పృశ్యత చాలా వరకు పోయిన మాట నిజమే. అంత మాత్రం చేత లాభమేమీ లేదు.

ఎవళ్ళపట్ల అంటరానితనం పాటించబడడం లేదో, వాళ్ళు సమాజంలో బహుకొద్ది మంది. పైగా వాళ్ళకూ, గ్రామాలలోని మాలమాదిగ పేటలకూ ఈ నాడు ప్రత్యక్ష సంబంధం ఏమీ లేదు.

అస్పృశ్యత ఎక్కడ పోతే అది నిజంగా పోయినట్లో, అక్కడ అది అసలు పోనే లేదు.

పట్టణాల లోను, గ్రామాల లోను మాలమాదిగ పేటలు ఎక్కడి వక్కడే పడి ఉన్నై. వెలివేయబడే ఉన్నై. అంధ యుగాలనాటి అనాగరికతకూ, దారిద్ర్యానికీ, దిక్కులేని తనానికీ చిహ్నాలుగానే ఉన్నై.

## 163

పట్టణాలలో కాని, గ్రామాలలో కాని ఈనాడు అంటరానితనాన్ని అగ్రకులాల వారి కంటె కూడ, వెనుకబడ్డ కులాల వారే ఎక్కువగా పాటిస్తున్నా రనేది అందరికీ తెలిసిందే. ఇది ఒక విచిత్రమైన విపరీత పరిస్థితి. ఈ పరిస్థితిని చాలా నేర్పుతో ఎదుర్కోవలసి ఉంది.

మాల మాదిగ పేరు చెపితే పట్టణాలలో ఇల్లు అద్దెకు ఇవ్వరు. మ్యునిసిపల్ పంపు దగ్గర నీళ్ళు పట్టుకోనివ్వరు. హరిజనోద్యోగుల ఇళ్ళలో పనులు చెయ్యరు. అంతవరకు ఆనందంగా పనిచేస్తున్న వాళ్ళు కూడా కులం పేరు తెలియగానే చట్టుక్కున మానివేస్తారు. ఇలా చేసే వాళ్ళంతా ఎక్కువగా వెనుకబడ్డ కులాలకు చెందినవారే. ఎందుకు వారలా చేస్తున్నారు? ఈ సమస్యలో ఉన్న కిటుకు ఏమిటి?

## 164

దేశంలో కులతత్వం ఈ నాడున్నంత తీవ్రంగా పూర్వ మేనాడూ లేదు. అందుకు కారణం రాజకీయాలు కావచ్చు. అయితే అస్పృశ్యత మాత్రం పై కులాలలో లేనంత తీవ్రంగా క్రింది కులాలలో ఉంటున్నది. ఎందుచేత?

హైందవ సమాజంలో, స్మృతుల ప్రకారం, బానిసలుగా చూడబడ్డ వాళ్లు శూద్రులు. అట్టి శూద్రుల చేత కూడ హీనంగా చూడబడ్డ వాళ్ళు వెనుకబడ్డ కులాలవారు. అట్టి వెనుకబడ్డ కులాల వారే మాల మాదిగల పట్ల ఎవరికీ లేనంత అంటరాని తనాన్ని పాటిస్తున్నారంటే ఏమనుకోవాలి? దీన్ని వెనుక ఆర్థిక కారణ మేదైనా ఉన్నదా? వట్టి మూర్ఖత్వమేనా?

## 165

భగవద్భక్తి మొదలు బందిపోటు వరకు మానవ ప్రవర్తన ప్రతి దానికి కూడ వెనుక ఏదో ఒక ఆర్థిక కారణం ఉంటుంది. రాజకీయా ధిపత్యానికి కూడ మూల ప్రేరకం ఆర్థిక ప్రయోజనమే కదా?

కారణం సమసిపోయిన తర్వాత సైతం ఆ ప్రవర్తన మార్పు లేకుండా కొనసాగితే– అప్పుడది మూఢాచార మవుతుంది.

మాలమాదిగలతో చేతులు కలిపితే గ్రామంలోని అగ్రకుల పెద్దలకు కోపం వస్తుందనీ, అందువల్ల తమ వృత్తికి భంగం కలగవచ్చుననీ, అంటరానితనం పోతే ఆయావృత్తులలో హరిజనులే తమకు పోటీ రావచ్చుననీ వెనుకబడ్డ కులాలవారు భయపడుతూ ఉండవచ్చు. ఈ రోజులలో అట్టి భయం అక్కరలేదని వారికి మనం నచ్చ చెప్పవలసి ఉంది. వెనుకబడ్డ కులాలవారిలో అంటరానితనం పోతే తక్కిన వారిలో అది క్షణాల మీద పోతుంది.

అందుకే – మాలమాదిగ పేటల తర్వాత, వెనుకబడ్డ కులాలవారి పేటల్లో భీమసేన పని చెయ్యాలి.

## 166

ఎక్కడ ఎక్కువ విజ్ఞానం ఉంటుందో అక్కడ ఎక్కువ చైతన్యం ఉంటుంది. ఎక్కడ ఎక్కువ చైతన్యం ఉంటుందో అక్కడ ఎక్కువ పురోగమనం ఉంటుంది. ప్రతి

అభ్యుదయోద్యమం లోను, సంస్కరణోద్యమం లోను బ్రాహ్మలే ముందడుగు వెయ్యడానికి కారణం అదే.

ఈనాటి వాస్తవ పరిస్థితి గుర్తించి, వెనుకబడ్డ కులాలతో పాటు తాము కూడా కలిసి రావడానికి బ్రాహ్మణ ప్రజలు అంగీకరిస్తే వారిని కూడా కలుపుకోడానికి వెనుదియ్యకండి! ఈనాడు బ్రాహ్మలు కూడా ఎన్నో విధాల వెనకబడి ఉన్నవారే.

## 167

వేద, పురాణ, ఇతిహాస యుగాలను గమనించినా - బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు, ఇంద్రాది దేవతలకు, అప్సరసలకు, మునులకు, మహారాజులకు, రాణులకు కూడ కిరీటాలు, కుండలాలు, హారాలు, పంచెలు, చీరెలు, గదలు, ఆయుధాలు, పావుకోళ్ళు, చెప్పులు, కమండలాలు, పాత్రలు, రథాలు వగైరా వగైరా లన్నింటినీ తయారు చేసి ఇచ్చే చేతిపనుల నిపుణులు - వారి ఆరోగ్యానికి, శుచి శుభ్రతలకు, అందచందాలకు, విందు వినోదాలకు అవసరమయ్యే వర్గాలవారు - ఈనాడు దిక్కులేని దీనజాతు లెందుకయారో ఆలోచించండి!

శ్రీ మహావిష్ణువు పవిత్రుడూ, ఆయనకు పాదరక్షలు సమకూర్చిన మాదిగ అపవిత్రుడూనా?

చీకటిని తొలగించే సూర్యుడు పవిత్రుడూ, మురికిని తొలగించే పాకీవాడు అపవిత్రుడూనా?

ఆనాడు దేవ, దానవ, మానవ గుణ భేదాలే తప్ప - నేటి కుల భేదాలు లేవనే సత్యాన్ని గుర్తించండి! నేటి కులవ్యవస్థను నిర్మూలించకుండా భారత జాతికి మోక్షం లేదని గమనించండి!

## 168

మనకు కులతత్వం లేదు. అన్ని కులాలూ మనకు సమానమే.

అన్ని కులాల లోనూ మనకు మిత్రులూ, సానుభూతి పరులూ, సహాయకులూ ఉన్నారు. అన్ని కులాల లోనూ మన ఉద్యమాన్ని బలపరిచే యువకులున్నారు. ఉద్యమంలో పనిచేసే భీమ సైనికు లున్నారు.

నేను ప్రత్యేకంగా హరిజనులకే ఈ ఉద్బోధ చెయ్యడానికి కారణం వాళ్లు

అంటరానితనానికి గురి చెయ్యబడి ఉండడమే. కులవ్యవస్థ విషపు కోరలలో చిక్కుకొని ఉండడమే.

గిరిజనులు అస్పృశ్యులు కారు. వారి సమస్యల స్వరూపం వేరు. అయినా – వెనుకబడ్డ కులాలతో పాటు గిరిజనులు కూడ భీమసేన కార్య పరిధిలో వారే?

బాధితులే బాధా విముక్తి కోసం పోరాడవలసి ఉంది.

మన పోరాటం అస్పృశ్యత, కులతత్వం వంటి సమస్యల మీద. మనుష్యుల మీద కాదు.

## 169

ఏ ఉద్యమ మైనా జయప్రదం కావాలంటే డబ్బు అవసరమన్న మాట నిజమే. డబ్బు లేకుండా ఏ పనీ జరగని రోజులివి. అయితే అన్ని విషయాలలో వలెనే డబ్బు విషయంలోకూడ స్వయంశక్తి మీదనే ఆధారపడాలి. మాలమాదిగలు తమలో తామే చందాలు వేసుకొని ఉద్యమాన్ని నడిపించాలి. తర్వాత ఉద్యమంలో విశ్వాసం గల ఇతర కులాల వారి సహాయాన్ని పొందవచ్చు.

## 170

అస్పృశ్యత పోయి, మాలమాదిగ పేటలు ప్రధాన గ్రామంలో లీనమైపోయే వరకు – అంటే ఉద్యమం లోని తొలిదశ ముగిసే వరకూ ఉద్యమ బాధ్యత యావత్తూ హరిజనుల మీదనే ఉండవచ్చు. బహుజనులు కూడ చేరవచ్చు. ఏది ఏమైనా, ప్రధాన భారాన్ని మోయడానికి హరిజనులు సిద్ధంగా ఉండవలసి ఉంది.

హరిజనోద్యోగులు, హరిజన నాయకులు – ఒకరి నొకరు విమర్శించుకోవడం తోనే బాధ్యత తీరిందనుకోక ఈ పవిత్రోద్యమానికి ధారాళంగా తోడ్పడవలసి ఉంది.

కుల తత్వాన్ని కులతత్వం తోనే ఓడించక తప్పని క్లిష్ట స్థితి ఈనాడు ఏర్పడి ఉంది. నాగాస్త్రాన్ని గరుడాస్త్రంతో ఎదుర్కొనక తప్పదు.

మనది కులతత్వం కాదు. ఇతరులలోని కులతత్వాన్ని ఎదుర్కొనడానికి బాధితకులాలు సంఘటితం కావడం దోషం కాదు.

ముల్లును ముల్లుతో తీసి పారవేసిన తర్వాత, ఆ ముల్లును కూడ పారవేస్తాం.

## 171

భీమసేన ఒక పవిత్ర జాతీయ సంస్థ.

ఏక నాయకత్వ ప్రాతిపదికపై ఇది పనిచెయ్యాలని నా కాంక్ష.

రాష్ట్ర సేనకు రాష్ట్ర నాయకు డొక్కడే సర్వాధికారిగా ఉంటాడు. అతని క్రింద జిల్లా నాయకులు పనిచేస్తారు. జిల్లా నాయకుడి క్రింద తాలుకా నాయకులు, పట్టణ నాయకులు పని చేస్తారు. తాలుకా నాయకుడి క్రింద గ్రామ నాయకులు పని చేస్తారు. గ్రామ నాయకుని క్రింద ఆ గ్రామ జనాభానుబట్టి ఎన్నో యూనిట్లు అయినా పని చేయవచ్చు. ఒక్కొక్క యూనిట్టులో ఎంత మంది సభ్యులుండాలనే విషయం ఆయా స్థానిక నాయకులే నిర్ణయించుకుంటారు.

భీమసేనలో చేరిన సభ్యులందరూ భీమ సైనికులే.

అంటరానితనాన్నీ, కుల వ్యవస్థనూ నిర్మూలించడానికి తమ సర్వశక్తులూ ధారపోస్తామని ప్రతి భీమ సైనికుడూ ప్రతిజ్ఞచేస్తాడు.

ప్రతి నాయకుడుకీ ఒకో సలహా సంఘం ఉంటుంది. కార్య ప్రణాళిక ఉంటుంది. ఎన్నికల తంతు ఏమీ ఉండదు. ఏ విషయంలోనైనా సరే నాయకుడి ఆదేశానికి తిరుగుండదు. క్రింది నాయకుడి కార్యక్రమాన్ని పై నాయకుడు నిత్యమూ పరిశీలిస్తూ ఉంటాడు.

## 172

ప్రతి భీమ సైనికుడూ హృదయ వైశాల్యం, త్రికరణ శుద్ధి, స్నేహ పరాయణత కలిగి ఉండాలి.

ఎవరికి అన్యాయం జరిగినా, ఆపద కలిగినా సహించకూడదు. కష్టాలలో ఉన్న ఎవరికైనా సరే తోడ్పడడం భీమ సైనికుడి ప్రథమ కర్తవ్యం. ఈ విషయంలో అతడు బాలభటుడే. బాలభటుడు పొందే శిక్షణను ప్రధాన అర్హతగా భీమ సైనికుడు పొందాలి. ఈత, సాము, ప్రథమ చికిత్సా విధానాలు అన్నీ అభ్యసించాలి.

## 173

క్రమ శిక్షణ, నిగ్రహం, దూరదృష్టి, సూక్ష్మ గ్రహణ శక్తి, త్యాగనిరతి, స్నేహశీలత, పట్టుదల, ఆత్మ విశ్వాసం ప్రతి భీమ సైనికుడికి అవసరం.

సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. సరియైన కార్యక్రమాలను రూపొందించాలి. స్పష్టమైన ఆదేశాలను ఇవ్వాలి. ఎందులోనూ అస్పష్టత పనికిరాదు. చెప్పే మాట సూటిగా చెప్పాలి. ఊగిసలాట పనికిరాదు.

## 174

లోకంలో ప్రతి విషయమూ తప్పొప్పులతోనూ, మంచి చెడ్డలతోనూ కూడుకొని ఉంటుంది. తప్పొప్పులు, మంచిచెడ్డలు మహా పర్వతాలేం కావు. వ్యక్తిని బట్టి, పరిస్థితిని బట్టి, కాలాన్ని బట్టి మారుతూ ఉంటాయవి. ఈ సత్యాన్ని గుర్తించి ప్రతి సమస్యనూ దేశ కాల పాత్రోచితంగా మాత్రమే పరిశీలించాలి.

తండ్రి కమ్యూనిస్టు అయితే కొడుకు కూడా కమ్యూనిస్టే అనుకోరాదు. పండితుడి కొడుకు పండితుడే అనుకోరాదు. పరిసరాల ప్రభావం ఉంటుంది. కాని – పెంపకాన్ని, పరిసరాలను కూడ అధిగమించగల శక్తి ప్రతిభావంతుడైన వ్యక్తికి ఉంటుందని గుర్తించండి.

మూఢాచార పరుడైన తండ్రికి ప్రగతి గామి అయిన విప్లవకారుడు పుట్టవచ్చు. హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు పుట్టాడు.

ప్రతి వ్యక్తికి ఒక ప్రత్యేక స్వభావ ముంటుంది. అలానే, ప్రతి సమస్యకూ ఒక ప్రత్యేక స్వరూప ముంటుంది. ఒకే సమస్య రెండు ప్రాంతాల్లో రెండు విధాలుగా ఉండవచ్చు. రెండు కాలాలలో రెండు రూపాలుగా ఉండవచ్చు. ఈ సత్యాన్ని గుర్తించి పరిష్కారానికి పూనుకోండి.

## 175

ప్రజల సమస్యను మీ సొంత అభిప్రాయాలతో కాక – వాస్తవ పరిస్థితుల దృష్టితో పరిశీలించాలి.

మీ సొంత అభిప్రాయాలను, సొంత అభిరుచులను, సొంత అలవాట్లను మీ సొంతానికే ఉంచేసుకోండి. అవి ప్రజా సమస్యల పరిష్కారానికి అడ్డం రాకుండా జాగ్రత్త తీసుకోండి.

ప్రతి సమస్యనూ నిర్మలమైన మనస్సుతో, నిష్పక్షపాత దృష్టితో పరిశీలించండి. సమస్య ఎంత పాతదైనా – అది సమస్యగా ఉన్నంత కాలం అది కొత్తదే.

## 176

హృదయ పరివర్తనం, దైవ భీతి, పుణ్యం, పాపం అనే మాటలు అర్థం లేనివి. స్వార్థపరుల మీద అవి పనిచెయ్యవు. లంచగొండి అయినవాడు స్నేహితుడి సిఫారసును ఖాతరు చెయ్యడు.

ఇతరు లెవరికో హృదయ పరివర్తన కలిగి, మీకేదో భిక్ష పెడతారని ఆశించవద్దు. మీకు న్యాయంగా రావలసిందుంటే దానిని మీరు మీ స్వశక్తి ద్వారా సాధించుకో వలసిందే. శక్తి లేనివాడికి సామ్రాజ్యం ఇచ్చి మాత్రం ఏం లాభం?

రాజ్యం వీరభోజ్యం. ఎవరో ఇచ్చేదీ కాదు. ఎవరో పుచ్చుకునేదీ కాదు. హక్కు కూడా అంతే. బలం ఉంటే హక్కు ఉంటుంది. బలం లేని వాళ్ళకు ఏ హక్కులూ ఉండవు.

మాలమాదిగ తరతరాల దైన్యానికి కారణం హక్కులు లేకపోవడం కాదు. బలం లేకపోవడం.

## 177

ప్రభుత్వ శాసనాలు, రాజ్యాంగ రక్షణలు, పోలీసులు, కోర్టులు – ఇవన్నీ బలహీనుల కోసమే నని గుర్తుంచుకోండి.

బలవంతుడి కెప్పుడూ అన్యాయం జరగదు. బలవంతుడి హక్కుల కెప్పుడూ భంగం కలగదు. బలవంతు డెప్పుడూ, ఎందుకూ పోరాడవలసి ఉండదు. న్యాయం కోసమో, ధర్మం కోసమో సమానత్వం కోసమో పోరాటం జరిపే వాళ్ళంతా బలహీనులే.

బలహీనులు పోరాటం ద్వారా బలవంతు లవుతారు. మీకు కావలసింది లభించే వరకు లక్ష్యం సిద్ధించే వరకు పోరాడండి! బలవంతులు కండి!

## 178

అంతా తనకే తెలుసు ననుకోవడం, ఇతర్లు చెప్పేది వినక పోవడం, సమస్యను సమగ్రంగా పరిశీలించక పోవడం, ఇష్టం వచ్చినట్లు వాగడం, పేరుకోసం ప్రాకులాడడం, ప్రతిభ కల వాళ్ళను ద్వేషించడం, పని చేసే వాళ్ళను వెక్కిరించడం, ఊహాపోహాలకు తావివ్వడం, అహంభావం, మూర్ఖపట్టు, దురుసుతనం వంటివేవీ భీమ సైనికులకు పనికిరావు.

ఈ దుర్గుణాలన్నీ నేటి రాజకీయ వాతావరణంలో, విషపు గాలికి గొంగళి పురుగుల్లా పుచ్చి ఉన్నై. అవి మీకు అంటుకోకుండా జాగ్రత్తపడండి.

## 179

చిత్తశుద్ధి లేకుండా దేన్నీ సాధించలేం.

డబ్బు, పదవి, కీర్తి, అధికారుల దయ, నాయకుల అభిమానం– వీటి కోసం ప్రాకులాడే వాళ్ళను దూరంగా ఉంచండి. పేద గుండెలకూ, పిరికి పందలకూ భీమసేనలో స్థానం ఇవ్వకండి. అవకాశవాది హరిజనుడైనా మన కక్కరలేదు. అలాంటివాడు మీర్జాఫరో, క్విస్లింగో అయి, జాతి అభ్యుదయాన్ని బీరుకో, నారికో అమ్మి పారవేస్తాడు.

ఆదర్శమూర్తి అగ్రవర్గం వాడైనా మనవాడే. కాశీనాథుని నాగేశ్వరరావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, పిఠాపురం మహారాజా, కందుకూరి వీరేశలింగం పంతులు, వేమూరి రాంజీరావు, మాగంటి బాపినీడు, పొట్టి శ్రీరాములు మొదలైన వారంతా మాలమాదిగల అభ్యున్నతికి పాటుపడ్డ వారే నన్న సత్యాన్ని విస్మరించకండి.

## 180

భీమ సేనను నడిపించే కార్యకర్తల బుద్ధి గురి తప్పని బాణంలా మెరకాలి. మాట ఉగాది పచ్చడిలా ఉండాలి. ప్రవర్తన అంతరాత్మ ఆసిడు టెస్టుకు ఆగాలి. మనస్సు అంబేడ్కరు మూర్తిపై వెలగాలి. దృష్టి జాతి శ్రేయో లక్ష్యం మీద నిలవాలి.

ఆ ప్రాంతంలో ఒక్క భీమ సైనికుడున్నా ఆ ప్రాంత మంతా భద్రంగా ఉన్నట్టే ఆ ప్రాంతపు ప్రజలంతా భావించాలి. భీమసేన శక్తి సామర్థ్యాలపై, భీమ సైనికుల కార్య శూరతపై, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ శక్తిపై, ధర్మ నిరతిపై, న్యాయ పాలనపై అంతటి గాఢ విశ్వాసాన్ని ప్రజలకు కలిగించాలి.

అంతటి ఆత్మబలం కలవాళ్లే భీమ సేనలో చేరాలి.

## 181

భీమ సేన ప్రగతి సేనగా ముందుకు ఉరకవచ్చు. సేవా సంస్థగా పనిచేయవచ్చు. రాజకీయ పార్టీగా రూపం దిద్దుకోవచ్చు. రేపటి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. పరిస్థితికి అనుగుణంగా కార్య ప్రణాళిక మారుతూ ఉండక తప్పదు.

ఏది ఏమైనా భీమ సేన ఎప్పుడు, ఎక్కడ, ఏ ప్రణాళికను అమలు జరుపుతున్నా, అది అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలి. ఆదర్శ ప్రాయంగా ఉండాలి. ఆబాల గోపాలానికీ ఆశాజ్యోతిగా ఉండాలి. దాన్ని అలా నిర్వహిస్తామని ప్రతి భీమ సైనికుడూ ప్రతిజ్ఞ గైకొనాలి. ప్రాణం పోయినా, ప్రతిజ్ఞా భంగం జరగరాదు.

ధీరోదాత్తులు, స్థిత ప్రజ్ఞులు, సేవా నిరతులు, సద్గుణ శీలురు, సాహసోపేతులు,. కార్యచతురులు అయిన అలాంటి మెరకల్లాంటి కుర్రవాళ్లు జిల్లాకు పదిమంది ఉన్నా చాలు. భీమసేన తన లక్ష్యాన్ని సాధించ గలదు.

అలాంటి కుర్రవాళ్ళు జిల్లాకు పదిమందీ ఉండరా? మనం తర్ఫీదు ఇస్తే-ప్రతి హరిజన యువకుడూ, ప్రతి భారతీయ యువకుడూ అలాంటి వాడే కాగలడని నా విశ్వాసం. ఇందులో అత్యాశ ఏమీలేదు.

## 182

భీమ సైనికులు కార్యశూరులు. కార్యచతురులు, కార్య సాధకులు కండి. ఎక్కడి కక్కడ ఆర్గనైజు కండి. మాలమాదిగల్ని ఏకం చేసే కార్యక్రమంతో పని ప్రారంభించండి. ప్రారంభించిన పనిని చచ్చినా సరే ఆపబోకండి.

మీరు పదిమంది ఒక చోట చేరినప్పుడు, ముందుగా మీలో ఉన్న గుణ దోషాలను దాచుకోవద్దు.

భీమ సేనను ఆర్గనైజు చేసే ప్రథమ దశలో వ్యక్తిగత గుణదోషాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవద్దు. లక్ష్యం పట్ల విశ్వాసం, కార్యసాధన దీక్ష ఉంటే చాలు. అలాంటి ఒక నలుగురు కుర్రవాళ్ళు - ఉభయ వర్గాలకు చెందిన మాలమాదిగ కుర్రవాళ్ళు కలుసుకొని తలుచుకొంటే చాలు. ఆ నలుగురే ఆ రెండు పేటలకు కలిసి భీమసేన యూనిట్టు కావచ్చు. పేట కొకటి, రెండు యూనిట్లు కూడ ఏర్పడవచ్చు.

## 183

క్రమశిక్షణ, నాయకుడి పట్ల విధేయత - ఈ రెండూ చాలా ముఖ్యం. ఈ రెంటినీ ప్రతిజ్ఞ చేసి పాటించాలి.

త్రాగుడు, జూదం, వ్యభిచారం - వీటిని పరమ శత్రువులుగా చూడాలి.

దుబారా ఖర్చుకు, సుఖ భోగాలకు అలవాటు పడకూడదు. బుద్ధిని కరగ నివ్వకూడదు. బొజ్జను పెరగ నివ్వకూడదు.

సోమరితనాన్ని చేరనివ్వకండి. తీరిక లేని పనే ఆరోగ్యానికీ, ఆయుస్సుకూ, విజయానికీ, విశ్వ శ్రేయస్సుకూ అమృతప్రాయమని నమ్మండి. పనే భగవంతుడని గుర్తించండి.

## 184

సహచరులు, ప్రోత్సాహకులు, సుముఖులు, తటస్థులు, విముఖులు, వ్యతిరేకులు, విరోధులు – ఇలా అనేక రకాలుగా ఉంటారు ప్రజలు – ఏ ఉద్యమం విషయంలో అయినా సరే.

సాధారణంగా నూటికి తొంభైమంది తటస్థులుగా ఉంటారు. వాళ్ళే జన సామాన్యం.

మన కళ్ళ ఎదుట జరిగిన భారత స్వాతంత్రోద్యమంలో వాస్తవంగా పాల్గొన్న వారెంతమంది? ఈనాడు స్వాతంత్ర్య ఫలాన్ని రెండు చేతులతోను జుర్రు కొంటున్న వాళ్ళలో ఎక్కువమంది ఆనాటి జాతీయోద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్ళే నన్న సత్యాన్ని విస్మరించకండి.

ఉద్యమం కొనసాగుతున్నప్పుడు, దానికి విముఖులుగాను, విరోధులు గాను ఉన్నవాళ్ళే – అది జయప్రద మైనప్పుడు దాని ఫలితాన్ని అనుభవించడానికి ముందుకు తోసుకు వస్తారు. వాళ్ళు ఎంత దూకుడుగా వస్తారంటే – ఆ తాకిడికి అసలు ఉద్యమ కార్యకర్తలే వెనక్కి నెట్టి వేయబడతారు.

కార్యకర్తలు తాము ఉద్యమాన్ని ఎంత తీవ్రంగా నడిపిస్తారో అంత తీవ్రం గాను తద్వ్యతిరేకమైన అవకాశవాదులను అడ్డుకొనకపోతే– అసలు ఉద్యమ ఉద్దేశమే విఫలం కాగలదు. ఈ విషయంలో జాగ్రత్త తీసుకోండి !

## 185

మాలమాదిగల అభ్యుదయం కోసం పోరాటంలో దిగుతున్న మిమ్ము మాలమాదిగలే విమర్శించవచ్చు. వెక్కిరించవచ్చు. ఎదిరించవచ్చు. హాని చేయవచ్చు. ఆశ్చర్య పడకండి.

మాలమాదిగలు స్థానికులైన అగ్రకుల పెద్దల చేతులలో ఉంటారన్న సత్యాన్ని విస్మరించకండి. తరతరాలుగా ఆర్థిక దాస్యంలో ఉంటూ – పాలేరుతనం చేసుకొంటున్న వాడికి – చదువుకొన్న తమ్ముడి కంటె డబ్బున్న తన కామందే గొప్పవాడుగా కనిపించవచ్చు. లెక్క చెయ్యకండి. ఓర్పుతో అట్టి వారి దృక్పథంలో మార్పు తీసుకు రావడానికి ఎడతెగకుండా కృషి చేయండి.

## 186

గిరిజనులకు చెందిన కొన్ని తెగల ప్రజల్ని చూడండి. నవనాగరిక సమాజం మధ్య బ్రతుకుతున్నా – తమ పాత పౌరాణిక వేషాలను, పద్ధతులను, విశ్వాసాలను వారు వదులుకోవడం లేదు.

మోచేతుల దాకా ప్లాస్టిక్కు గాజులు, మోకాళ్ల దాకా అందెలు, మెడ నిండా పూసలపేర్లు, జాకెట్ల నిండా తళుకులు, చెవుల నిండా, ముక్కు నిండా రింగులు ధరించి – అన్ని బరువుల తోనూ మట్టి తట్టలు మోసే గిరిజన కార్మిక స్త్రీని చూస్తే – ఒక్క టెర్లిను చీర తప్ప మరే అలంకారమూ లేని కాలేజీ అమ్మాయికి ఏమనిపిస్తుంది?

నాగరికత, ప్రకృతి విజ్ఞానం బ్రహ్మాండంగా వికసించిన ఈ రోజులలో– రకరకాల విద్యుద్దీపాలతో రాత్రి కూడ పగలుగా భాసిస్తున్న ఈ రోజులలో – దేవుడికి అంధ యుగాల నాటి ఆ ప్రమిద దీపాలనే ఎందుకు పెడుతున్నారు?

వెలుగెక్కడ లేదో అక్కడ చీకటి ఉంటుంది. గుండె వర్తమానం లోను, మెదడు గతంలోను బ్రతుకుతున్న వాళ్ళే సమాజంలో ఎక్కువ. మూఢత్వాలు ముక్కోటి రీతులు. వాటి మధ్య ఎడతెగని ఘర్షణలు.

అటువంటి మూఢాచార పరులు, తాతల నాటి పిలకలే నేటి క్రాపులకంటె గొప్పవని వాదించే చాదస్తులు, మాలమాదిగలలో కూడ ఉన్నారు అటువంటి వాళ్ళని మార్చడం కష్టమైతే – ఉపేక్షించి ముందుకు సాగిపోండి.

## 187

ఏ గొప్ప పనీ, ఏ సంస్కరణా, ఏ మార్పూ ప్రతిఘటన లేకుండా ముందుకు సాగదు. ఇది ప్రకృతి రహస్యం.

మీ పురోగమనంలో కులతత్వ వాదుల, మూఢాచార పరుల, స్వప్రయోజకుల ప్రతిఘటనలకు, ఒత్తిడులకు మీరు గురికావచ్చు. వెనకడుగు వెయ్యకండి.

అవినీతిని బహిరంగంగా విమర్శించే మహా నాయకులలో ఎక్కువమంది నీతిని చీకటి బజారులో అమ్మి సొమ్ము చేసుకొనే ఘనులే అయి ఉండవచ్చు. బాహ్యాటోపాలకు భ్రమసి పోకండి.

డబ్బు ఎక్కువగా ఉండే వాళ్ళలో మెదడు తక్కువగా ఉంటుంది. మెదడు తక్కువగా ఉండే వాళ్ళలో అహంకారం ఎక్కువగా ఉంటుంది. అహంకారం ఎక్కువగా ఉండే వాళ్ళలో వివేకం తక్కువగా ఉంటుంది. అట్టివాళ్లు మీ విప్లవ కార్యక్రమాన్ని ఎదిరించగలరు. భయపడకండి.

ఏ సమస్య నుంచీ, ఏ బాధ్యత నుంచీ తప్పించుకు పారిపోకండి.

శత్రు పటాటోపమూ, మంది మార్బలమూ నిశ్చల బలోన్నతుడైన వీరుణ్ని ఏమీ చెయ్యజాలవు. ఉత్తర గోగ్రహణం నాటి అర్జునుణ్ణి తలచుకోండి. అర్జునుడు మాలమాదిగ వంశీయుడేననీ, వ్యాస భగవానుడి మనుమడనీ మరచిపోకండి.

అస్పృశ్యత, కులతత్వం హైందవ సమాజం నుంచి రూపు మాసి పోయేదాకా నిద్రపోం అని శపథం తీసుకొని పురోగమించండి.

## 188

ప్రజల సమస్యలను, ఉద్దేశాలను గ్రహించి, సేకరించి, తమ యూనిట్టు నాయకుడి దృష్టికి తీసుకు రావడం ప్రతి భీమ సైనికుడి ప్రధాన కర్తవ్యం.

ఆ తర్వాత ఆ సమస్యలు చర్చించబడి, పరిష్కార మార్గాలు యోచించ బడాలి. ఈ విషయంలో నాయకుడికి అతడి సలహా సంఘమే కాక, అందుకు సంబంధించిన స్థానిక పెద్దలు కూడ తోడ్పడవచ్చు. అట్టి సమస్యలను వీలైనంత వరకు అక్కడి కక్కడే స్థానికంగా పరిష్కరించి వెయ్యడానికి పూనుకోవాలి. అలా సాధ్యం కాని వాటిని పై నాయకుని దృష్టికో, ప్రభుత్వం దృష్టికో తీసుకుపోవాలి.

ఎక్కడ ఏ సమస్య ఉత్పన్న మయినా, భీమ సైనికులు కనీసం ఒకరిద్దరైనా అక్కడికి పోయి వివరాలు కనుక్కోవాలి. భీమసైనికు డెక్కడుంటే అక్కడ న్యాయం ఉంటుందన్న విశ్వాసం ప్రజలలో ఉంటుంది కనుక, అతణ్ని చూడగానే బాధితులకు

ధైర్యం కలుగుతుంది. బాధకులు వెనక్కి తగ్గుతారు. సమస్యా పరిష్కారం సులభమవుతుంది.

## 189

నాయకుల కుండే అహంభావంతో కాక, సేవకుల కుండవలసిన వినయ విధేయతలతో మనం ప్రజలలో పని చేయవలసి ఉంది.

ఏ విధమైన ఎక్కువ తక్కువలు లేకుండా మనం ప్రజలలో కలిసిపోయి పని చేసినప్పుడే వారి కష్ట సుఖాలు, బాధలు, సమస్యలు మన కర్థమవుతై. ఆయా సమస్యలపై వారి అభిప్రాయాలు మనకు తెలుస్తై. అప్పుడు వాటికి మనం స్పష్టమైన రూపం కల్పించవచ్చు. పరిష్కరించవచ్చు.

ప్రజలు తమ సమస్యల్ని తామే పరిష్కరించు కోలేక పోతున్నారంటే – ఆ సమస్య యొక్క స్వభావం వారికి స్పష్టంగా అవగాహన కాలేదన్న మాట. అట్టి సమస్యను పరిశీలించి, అర్థం చేసుకొని, దాని నిజ స్వరూపాన్ని ప్రజల ముందు పెడితే చాలు మనం. తక్షణం ప్రజలే దాన్ని పరిష్కరించి పారేస్తారు.

అంటరానితనం, కులవ్యవస్థ – వీటి నిజ స్వరూపాన్ని స్పష్టంగా ప్రజల ముందు ఉంచండి. ఏం జరుగుతుందో చూడండి.

## 190

వర్ణాశ్రమ ధర్మాలు గొప్పవంటూ చిలుక పలుకులు పలుకుతారు కొందరు. ఎన్నెన్నో విదేశీ దండయాత్రలకు తట్టుకొని హిందూమతం ఇంకా బ్రతికి ఉండడానికి కారణం మన వర్ణ వ్యవస్థ అంటూ బట్టతలను సవరించుకొంటారు కొందరు. అదంతా ఆత్మవంచనో, పరవంచనో తప్ప మరేమీ కాదు.

ఆశ్రమ ధర్మాలను అనుసరించిన వారు ఏనాడూ లేరు. శ్రీరాముడు వంటి రాజులు కాని, వశిష్టుడు లాంటి పురోహితులు కాని, విదురుడు వంటి గృహస్థులు కాని ఎవరూ వానప్రస్థులూ కాలేదు. సన్యాసులూ కాలేదు.

## 191

కొంత కాలం శూద్రుల్ని వెలివేసి ఉంచడానికీ, ఇప్పుడు హరిజనుల్ని వెలివేసి ఉంచడానికీ తప్ప – ఎప్పుడూ ఇతరులెవరి పట్లా వర్ణ ధర్మాలు అమలు

జరుగలేదు. ఈనాడు వర్ణ ధర్మాలను పాటించి వాటి ప్రకారం మనుషుల్ని విడదీయ దలిస్తే – ఉపాధ్యాయులుగా ఉన్న వారందర్నీ బ్రాహ్మలుగాను – మిలిటరీ, పోలీసూ, ఎక్సైజూ, రెవెన్యూ శాఖలలో ఉన్న వారందర్నీ క్షత్రియులుగాను – వ్యవసాయదారు లందర్నీ వైశ్యులుగాను – నౌకర్లు, ప్యూనులు, కూలీలు వంటి వారందర్నీ శూద్రులుగాను – వైద్యం, సంగీతం, నృత్యం, నాటకం వంటి కళలతో సంబంధమున్న వాళ్ళందర్నీ అంటరాని వాళ్ళుగాను పరిగణించ వలసి ఉంటుంది. ఇది సాధ్యమేనా?

వర్ణాశ్రమ ధర్మాలనేది కేవలం మిథ్యావాదం. అదెప్పుడూ అమలులో లేదు. ఈనాడింకా దాని పేరెత్తడం మూఢ ప్రజల్ని మోసం చేయడానికే. ఇంకా ఇంకా మన వాళ్లని పర మతాలలోకి తరిమి వెయ్యడానికే.

హిందూ మతం ఇంకా కొన ఊపిరితో అయినా బ్రతికున్నదంటే అందుకు కారణం దాని ఆధ్యాత్మిక వేదాంత సూత్ర శక్తే. ఆ శక్తి ఋషుల వల్ల వచ్చింది. ఈ ఋషులందరూ ఏ వర్ణానికీ చెందినవారు కాదని గుర్తించండి. వ్యాస వాల్మీకాదులు మాలమాదిగలు. అగస్త్య వసిష్ఠాదులు వర్ణసంకరులు. నారద కాళిదాసాదులు వెనకబడ్డ కులాలవారు. జాతి మనుగడకు ప్రధానమైన సంగీత సాహిత్య సాంస్కృతిక తాత్త్విక రంగాలలో మూల ఋషులంతా మొత్తం మీద మనవాళ్ళే అన్న సత్యాన్ని మరచిపోకండి.

కాగా – వర్ణాశ్రమా లనేవి ఎప్పుడూ లేవు. ఈనాడూ లేవు. లేని దాన్ని లేనట్టు అంగీకరించడానికి తటపటాయించడం ఎందుకు?

ఈనాడు నిజంగా వర్ణ వ్యవస్థ ఉన్నదా? గుండెల మీద చేయి వేసుకొని చెప్పండి. లేదు కదా? స్మృతులలో చెప్పబడ్డ వర్ణ వ్యవస్థే లేనప్పుడు మరి ఈ కులవ్యవస్థ ఎక్కడ నుంచి వచ్చింది?

సృష్టి ధర్మానికి వ్యతిరేకమైన ఈ వ్యవస్థను జాతిశ్రేయస్సు కోసం నిర్మూలించి పారవేయడానికి అభ్యంతరం ఎందుకు?

## 192

**మా**లమాదిగ పేటలలోను, తదితర వర్గాల వారిలోను పని చేసే భీమ సైనికులు ముందుగా ఆ ప్రజల కష్ట సుఖాలలో పాల్గొనాలి.

మీరు ఆయా పేటలకు చెందిన యువకులే కావచ్చు. మరొక ప్రాంతం

నుంచి పంప బడ్డవారు కావచ్చు. ఎవరైనప్పటికీ, ప్రజలతో కలిసిపోకుండా మనం ప్రజల్ని ఉత్తేజ పరచలేం.

ఇంతకూ మనమంటే ఎవరు? మనమూ ప్రజలమే. ఎవరి పని వారు చేసుకుంటూ, ఎవరి బ్రతకు వారు బ్రతికే వాళ్ళను ప్రజలంటున్నాం. మొత్తం మీద ప్రజల కష్ట సుఖాలను గురించీ, సుఖ దుఃఖాలను గురించీ ఆలోచిస్తూ, జాతి యావత్తునూ ఏక అభ్యుదయ మార్గంలో నడిపిండానికి పూనుకొన్న వాళ్ళం. మనం ముందు నడుస్తున్నాం. అలా నడవక తప్పదు. అలా నడిచేటప్పుడు ప్రజల్ని అనుకునే నడవాలనేది నా విజ్ఞప్తి.

## 193

ప్రజలలో పని చెయ్యడం అంటే – ప్రజల నిత్య కృత్యాలను గురించి, కష్ట సుఖాలను గురించి ఎల్లప్పుడూ తెలుసుకుంటూ ఉండడం, పేటలోని ప్రతీ గృహం గురించి అవగాహన కలిగి ఉండడం.

బియ్యం సులభంగా దొరుకుతున్నాయా? బ్లేకులోకి ఏ వస్తువు పోయింది? ఎవరికి ఉద్యోగం లేదు? ఏ ఇంట్లో రాత్రి పస్తు పడుకున్నారు? ఎందువల్ల? ఎవడు సోమరిపోతుగా తయారవుతున్నాడు? ఎవడు రౌడీగా తిరుగుతున్నాడు? వారిని మార్చడం ఎలా? వెంకయ్య జ్వరం తగ్గిందా? పుల్లయ్య కొడుకు ఏమైనా పంపుతున్నాడా, లేదా? వీరన్న చదువెందుకు మానేశాడు? వెర్రయ్యను కామందు ఎందుకు కొట్టాడు?

ఈ విధమైన పరామర్శలతో నిత్యమూ ప్రజల యోగ క్షేమాలను కనుక్కొంటూ ఉండాలి. తోడ్పడుతూ ఉండాలి. మంచిని పెంచుతూ, చెడును ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి.

చెడు అనేది ప్రత్యేకంగా ఏదీ లేదు. పరిస్థితిని బట్టి, వ్యక్తిని బట్టి ఉంటుందది. సృజనాత్మకమైన కళలలో మునిగి తేలుతుండే వారు కొన్ని కొన్ని అలవాట్లకు లోనవుతారు. మెదడు పని ఎక్కువగా ఉండేవారికి కొన్ని ప్రత్యేక సౌకర్యాలు అవసరమవుతాయి. కుస్తీ వంటి వ్యాయామ విద్యలలో పాల్గొనేవారికి బలమైన తిండి కావలసి ఉంటుంది. అలానే ఒకో విద్యకు ఒకో వ్యాసం ?ఒకో ప్రత్యేక ఏర్పాటు అవసరమవుతుంది. అది వ్యక్తి స్వభావం మీదా, ఒకో వేళా విశేషం మీదా కూడా ఆధారపడి ఉంటుంది.

ఎప్పటి కప్పుడు కొత్త పొంగులతో ముందుకు ప్రవహించే చైతన్య స్రవంతి ఎప్పుడెట్టి మలుపు తీసుకోగలదో స్పష్టంగా చెప్పలేం. మానవ ప్రవర్తన విషయంలో కూడా అంతే. నేటి చెడ్డవాడు రేపు మంచివాడు కావచ్చు. నేడు చెడ్డగా భావించ బడినట్టిది రేపు మహా గొప్పగా కీర్తించ బడవచ్చు. కనుక దేనికైనా విలువలు కట్టవలసి వచ్చినప్పుడు, మంచి చెడ్డల నిర్ణయం చెయ్యవలసి వచ్చినప్పుడు బహు జాగ్రత్తతో, విజ్ఞతతో, ముందు చూపుతో మెలగవలసి ఉంది. దేన్నీ తృణీకరించరాదు. ఎవరి శక్తినీ తక్కువ అంచనా వేయరాదు.

## 194

మన ఉద్యమానికి ప్రత్యర్థులూ, విరోధులూ అయిన వాళ్ళను ఏవగించు కోకండి. కించ పరచకండి. ఉపేక్షించకండి. గౌరవంతో, శ్రద్ధగా వాళ్ళు చెప్పేది వినండి. ఓర్పుతో నిదానంగా వాళ్ళకు నచ్చచెప్పండి. వాళ్ళు మారినా, మారకపోయినా – వాళ్ళ వాదం వినడం వల్ల మీ అనుభవం బలపడనుంది. మీ కార్యసాధక శక్తి పెరుగుతుంది.

సీతను ఎత్తుకు పోయిన రావణుడి వైపు కూడా కొంత అనుకూల వాదం ఉంటుందని మరచిపోకండి. అదేదో తెలుసుకోకుండా దాన్ని మనం ఎలా ఖండించగలం?

దొంగ, దొంగ వర్తకుడు, నరహంతకుడు కూడ తమ తమ ప్రవర్తనలకు, పనులకు కారణాలను చెపుతారు. వాళ్ళ దృష్టిలో అవి సహేతుకమైనవే, న్యాయమైనవే కావచ్చు. అందుకే వినదగు నెవ్వరు చెప్పిన. అది మన ఉద్యమానికీ చాల అవసరం. వినడం, చూడడం, పరిశీలించడం, తెలుసుకోవడం, కర్తవ్య నిర్ణయం చెయ్యడం, నిర్ణయాన్ని అమలు పరచడం – ఇదే పురోగమన క్రమం.

## 195

ప్రతి పేటకూ ఒకటి రెండు వయోజన విద్యా కేంద్రాలను నెలకొల్పాలి. ప్రభుత్వ సహాయం లేకపోయినా, స్వయం సహాయంతో నిర్వహించాలి. ఆ పేటలోని ఉపాధ్యాయుల సహాయాన్ని తీసుకోవాలి. పెద్ద క్లాసులు చదివే విద్యార్థులుంటే వారు కూడా తగు పాత్ర తీసుకోవాలి.

పేటలో బడికి పోని బాలబాలిక లెవరూ ఉండకూడదు.

దేశీయ, అంతర్జాతీయ, రాజకీయ విశేషాలను, కథలను ప్రజలకు చెపుతూ ఉండాలి. వివిధ జాతుల చరిత్రలను, వాళ్ళు సాధించిన విజయాలను గురించి తెలియజేస్తూ ఉండాలి. ప్రకృతి విజ్ఞానాన్ని, కలలను బోధిస్తూ ఉండాలి.

పేటకు కనీసం ఒక నాటక సమాజం ఉండాలి. ఆయా ప్రాంతాలలో ఉండే ప్రత్యేక ఆధునిక పద్ధతులపై పునరుద్ధరించాలి. డప్పు, రుంజి, చిందు, మోళి, దొమ్మరగడ, మాస్టిడీ, సాము, భజన కోలాటం, గరగ, గారడీ మొదలైన గ్రామీణ విద్యలను నవీకరించి ప్రోత్సహించాలి.

సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నృత్యం వంటి కళలు వ్యక్తులలో కనిపించినప్పుడు వాటిని అభివృద్ధి చెయ్యడానికి పూనుకోవాలి. రచనను బాగా ప్రోత్సహించాలి. ఏ రంగంలో నైనా సరే శక్తి సామర్థ్యాలు కనిపిస్తే, వెంటనే వాటి వికాసానికి శ్రద్ధ తీసుకోవాలి. ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆర్థిక సహాయం చెయ్యాలి.

ఈ అన్నిటికి ప్రభుత్వం ప్రత్యేకంగా ధన సహాయం చెయ్యగలదు. అందుకు ప్రయత్నించాలి.

ప్రతి పేటకూ ఒక సంఘ నిధిని ఏర్పాటు చెయ్యాలి. దాని నుంచి కూడా పై కార్యక్రమాల ఖర్చులను భరించవచ్చు. కళలకు బహుమతు లివ్వవచ్చు.

మాలమాదిగ పేటలు గ్రామాలలో లీనమై పోయే వరకూ ఈ ప్రత్యేక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రోత్సాహాలు తప్పవు. పనిలేని వాళ్ళు, చదువు రానివాళ్ళు, త్రాగుబోతులు, సోమరులు, జూదగాళ్ళు మాలమాదిగ పేటలలో లేకుండా చర్య తీసుకోవాలి.

## 196

హరిజనులకు, గిరిజనులకు, బహుజనులకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులేమిటో, రక్షణ లేమిటో ప్రజలకు స్పష్టంగా తెలియ జెయ్యాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కులాల అభివృద్ధి కోసం ఎన్నో శాసనాలు చేస్తున్నై. ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నై. అవేమీ ఎక్కువ ఫలప్రదం కావడం

లేదు. అందువల్ల - వాటిని గురించి కరపత్రాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ ఉండాలి. వాటి నిర్వహణను పర్యవేక్షిస్తూ ఉండాలి.

ప్రభుత్వ ప్రణాళికలు మన కనుకూలంగా ఉండేటట్టు ముందే శ్రద్ధ వహిస్తూ ఉండాలి.

ఏ పేట హరిజనుల కైనా ప్రభుత్వ ఇళ్ళ స్థలాలు మంజూరు చేసినప్పుడు - అట్టి స్థలాలు ఊరికి దూరంగా ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఊరి మధ్యలోనో, ఊరికి ఆనుకొనో ఉండేటట్లు చూసుకోవాలి. ఈ పని ప్రభుత్వమే చెయ్యదా అంటే, చెయ్యవచ్చు. చెయ్యకపోవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి ఎంత గొప్పవాడైనా, అతని దృష్టి ఎక్కువగా జీతం మీదనే ఉంటుందని మరచిపోకండి. మన సమస్యల పట్ల మనమే శ్రద్ధ వహించడం అన్ని విధాలా క్షేమం.

ప్రభుత్వం కాని, ఇతర సంస్థలు కాని ఈ కులాల అభివృద్ధికి చేస్తున్న పనులను గురించి, పెడుతున్న ఖర్చులను గురించి ఎప్పటికప్పుడు లెక్కలతో సహా ప్రజలకు చెప్తూతూ ఉండాలి. జనరలు కార్యక్రమాలతో పోల్చి చూపుతూ ఉండాలి. ప్రజలు చైతన్యవంతులు కావటానికి ఇది చాలా ముఖ్యం.

## 197

భారత దేశం నుంచి అంటరానితనాన్ని, కులవ్యవస్థను తొలగించి వెయ్యడానికి ప్రభుత్వం చెయ్యగలిగిన పనులు కొన్ని ఉన్నై. వాటిని తక్షణమే ప్రారంభించవచ్చును కూడ.

1. హరిజనులకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేసేటప్పుడు వాటిని ప్రధాన గ్రామం మధ్యనే ఉండేటట్టు చూడాలి. అప్పుడు మాలమాదిగ పేటలనేవి ప్రత్యేకంగా లేకుండా పోతై.

2. అగ్రకులాలకూ, హరిజనులకూ మధ్య వర్ణాంతర వివాహాలు జరుగుతున్నై. అవి ఎంత ఎక్కువగా జరిగితే అంత తొందరగా కులవ్యవస్థ పోతుంది. అందువల్ల - వర్ణాంతర వివాహాలను చేసుకొన్న యువతీ యువకులకు ప్రభుత్వం ధన సహాయం చెయ్యాలి. ఉద్యోగ నియామకాలలో ప్రిఫరెన్సు ఇవ్వాలి.

3. కులం పుట్టుకతో వచ్చిందన్నప్పటికీ, వివాహం ద్వారా కులాల్ని మార్చుకోవచ్చునని ప్రకటించాలి. అందుకు ఒక శాసనం చెయ్యాలి. హరిజన యువతిని కాని, యువకుడ్ని కాని వివాహం చేసుకొన్న వ్యక్తికి హరిజనుల కుండే ప్రత్యేక హక్కులన్నీ చట్టరీత్యా లభింపచేయాలి.

4. ఈ కులాల వారిలో కళా సంస్కృతులను పునరుద్ధ రించడానికి ఆ పేటలలోనే ప్రత్యేకంగా పని చెయ్యడానికి జిల్లా కొకరు చొప్పున కల్చరల్ డెవలప్‌మెంట్ అధికారులను నియమించాలి.

5. ప్రత్యేకంగా మాలమాదిగ పేటలను గ్రామాలలో లీనం చెయ్యడానికి ఉద్దేశించే గృహ నిర్మాణ పథకాల కోసం జిల్లా కొక కోటి రూపాయల నిధితో ఫైనాన్సింగు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలి.

6. శక్తి, సామర్థ్యం, ప్రతిభ, పాండిత్యం వంటి సహజ గుణ సంపదను ఏ ఒక్క జాతీ, ఏ ఒక్క కులమూ గుత్తకు తీసుకోలేదు. దేశాన్ని ఆయా కాలాలలో ఆయా విదేశీయులకు ధారాదత్తం చేసిన అసమర్థులు హరిజనులు కారనేది చారిత్రక సత్యం.

ఈనాడు మన దేశంలో శక్తి సామర్థ్యాలు, నీతి నిజాయితీలు, సృజనాత్మక శక్తి మిగిలి ఉంటే – అవి ఒక్క హరిజనులలోను, వెనుకబడ్డ కులాలలోను మాత్రమే ఉన్నాయనేది కూడ నిరూపిత సత్యం.

అందువల్ల ఏ సంకోచమూ లేకుండా, అన్ని రకాల అధికార పదవులకూ జనాభా ప్రతిపదిక పైన హరిజనులను నియమించాలి.

ఈ విధమైన చర్యల ద్వారా కులవ్యవస్థ దానంతట అదే సడలిపోయి మాసిపోతుంది. ఆ తర్వాత సోషలిజం ఏర్పడడానికి ఎంతో ప్రయత్నం అక్కరలేదు. భూమిని జాతీయం చేస్తే చాలు.

## 198

ప్రస్తుతం మనకు తగిన నాయకత్వం లేదు. ఉన్న నాయకులకు నిర్దిష్ట కార్య ప్రణాళిక లేదు. చిన్న చిన్న ఉద్యోగాల కోసం రికమెండు చెయ్యడం, ఉద్యోగుల

బదిలీలను ఆపించడం, ప్రభుత్వంపై ఏవేవో విమర్శలు విసరడం వంటి పనులు తప్ప – జాతి సాముదాయక అభివృద్ధి కోసం ఒక కార్యక్రమ మంటూ ఏదీ లేదు. వ్యక్తులకే కాదు, రాజకీయ పార్టీలలో దేనికీ కూడా అట్టి సామాజిక కార్యక్రమం లేదు. వ్యక్తుల దృష్టీ పార్టీల దృష్టీ అంతా ధనరాసుల్నీ, అధికార పదవుల్నీ ప్రోగు చేసుకోవడంపై నిమగ్నమై ఉంది ఈ పరిస్థితిని తొలగించి, నిజమైన ప్రజాస్వామిక సోషలిజాన్ని దేశంలో నెలకొల్పడానికి భీమసేన నడుం కట్టాలి.

అధిక సంఖ్యాకులైన ప్రజలు అజ్ఞానంలోను, దాస్యంలోను మునిగి ఉన్న ఏ దేశంలోనూ ప్రజాస్వామ్యం జయప్రదం కాదని గుర్తించండి. ప్రజాస్వామికం జయప్రదం కావాలంటే, శాంతియుత పద్ధతుల ద్వారా సోషలిజం నెలకొనాలంటే, భారతదేశం శాంతి సౌభాగ్యాలతో తులతూగుతూ లోకంలోని అగ్రరాజ్యాలకే నాయక మణిగా విరాజిల్లాలంటే – అస్పృశ్యత తొలగాలి. కులవ్యవస్థ నశించాలి. అందుకు భీమసేన కృత నిశ్చయంతో ముందడుగు వెయ్యాలి.

## 199

ఒక సమస్యను పరిష్కరించడం కోసం, ఒక లక్ష్యాన్ని సాధించడం కోసం ఎన్ని కష్ట నష్టాలనైనా భరించడానికి సిద్ధ పడడమే నిజమైన మానవత్వం. నిజమైన మానవత్వం మృత్యువుకు భయపడదు. ఎలాంటి ఆటంకాలకూ వెనకడుగు వెయ్యదు. ఎంతటి నిరంకుశత్వానికీ తలవంచదు.

మీరు నిజమైన మానవత్వాన్ని అలవరచు కొనండి. నిజమైన మానవులు కండి. మీజాతిని నిజమైన మానవులుగా తయారు చెయ్యండి!

## 200

దురాగ్రహంపై సన్మార్గాన్ని, దుర్మార్గంపై సన్మార్గాన్ని, దౌర్జన్యంపై సౌజన్యాన్ని మోహరించడానికి ఎంతో ఆత్మబలం కావాలి.

ఒక మానవ సమస్య కోసం, మానవ బాధా నివారణ కోసం, అన్యాయ నిర్మూలన కోసం పోరాడడానికి నడుం గట్టి నిలబడినప్పుడే ఆత్మబలం జ్వలిస్తుంది. జ్వలించిన ఆత్మబలమే దైవబలం.

మీ కార్యక్రమం మంచిది. మీ మార్గం పవిత్రమైంది. మీ లక్ష్యం భగవంతుడికి హితమైంది.

మీ శరీరాలు చిన్నవైనా, మీ ఆత్మలు మేరు గిరి శిఖరాలు. మీ హృదయాలు పాల సముద్రాలు. మీ మనస్సులు తుఫాను గాలి మంటలు. మీ లక్ష్యం మానవ మహోదయం.

మిత్రులారా! పురోగమించండి! దైవబలం మీకుంది.

అవినీతిని, అన్యాయాన్ని, అసమానతను తుడిచిపెట్టి, మానవ లోకాన్ని మాధవ లోకంగా మార్చడానికి – భారత యువకుల్లారా ! నడుం బిగించి, ముందుకు దూకండి!

## 201

**డా**క్టరు భీమారావు అంబేడ్కరు ఇప్పుడు ఒక వ్యక్తి కాదు. ఉద్యమం. ఆయన ఏ ఒక్క కులానికో, ఏ ఒక్క కాలానికో, ఏ ఒక్క దేశానికో చెందిన వాడు కాదు. ఆయన పుట్టుక, పెంపకం, విద్య, ఆదర్శం, చేసిన పనులు, సాధించిన విజయాలు, ప్రజల కిచ్చిన సందేశం పరిశీలించి చూడండి. సర్వ దేశాలకూ, సర్వ కులాలకూ, సర్వ ప్రజలకూ చెందిన మానవుడాయన. ఆయన పేరు మీద నెలకొల్పబడ్డ భీమసేన – విశ్వసేన, విశ్వమానవ కళ్యాణ సేన, విశ్వైక మానవతా నిర్మాణ సేన కావాలని నా ఆకాంక్ష. అందుకే, కార్యక్రమాన్ని హరిజన పేటల నుంచి ప్రారంభిస్తున్నాం.

నేను పేర్కొన్న లక్ష్యంతో, ఇచ్చిన కార్యక్రమంతో, చిత్త శుద్ధితో భీమసేన పురోగమిస్తే – కులరహిత, వర్గరహిత, సర్వమానవ సమాజం అచిర కాలంలోనే ఏర్పడి తీరుతుంది. ఇది తథ్యం.

## 202

**భా**రత దేశంలో కులరహిత సమాజమే ప్రపంచంలో వర్గ సమాజం. అసలు ఆర్థిక వర్గాలే ఇక్కడ కుళ్లి కులాలైనై. బలం గల వాళ్ళదే రాజ్యం. ఈ సత్యాన్ని మరిచిపోకండి.

మన ఈ కుల మత వర్గ రహిత మానవ సమతా సమాజ నిర్మాణ ప్రణాళికను ఒక్క మన దేశం లోనే కాక ప్రపంచం అన్ని దేశాల లోను అమలు పరచడానికి పునాదులు వెయ్యండి. వివిధ దేశాలలోను అంబేడ్కర్ సేవా దళాలను, భీమసేన శాఖలను నెలకొల్పండి. అదే సర్వజన శ్రేయోమార్గం. అంబేడ్కర్‌జీ ప్రబుద్ధ ధర్మం. కృణ్వంతో విశ్వమార్యం నినాద సాఫల్యం.

## 203

బూర్జువా నియంతృత్వం, కార్మిక నియంతృత్వం వ్యక్తి నియంతృత్వం వంటి ఏ రకం నియంతృత్వ పరిపాలన అయినా సరే సూచన సర్వతోముఖాభివృద్ధికి వ్యతిరేకమైనట్టిదే.

రాజరికాలు పోయినై. నియంతృత్వాలు కూడ పోక తప్పదు.

మానవ శక్తుల బహుముఖ వికాసానికి ప్రజాస్వామిక పద్ధతి సోషలిస్టు ప్రభుత్వం ఒక్కటే దోహదం చెయ్యగలదు.

అట్టి ప్రజాస్వామిక సోషలిజాన్ని నెలకొల్పడానికి - హరిజన, గిరిజన, బహుజన, ప్రగతిగామి భారత యువజనులారా - సమైక్యం కండి, ముందుకు దూకండి!

## 204

జాతీయ సమైక్యం, భావ సమైక్యం, సాంస్కృతిక సమైక్యం- ఇలా ఎన్నో రకాల సమైక్యం గురించి ఉపన్యాసాలు దంచుతూ ఉంటారు పెద్దలు. తాము మాత్రం తమ స్వప్రయోజనాల కోసం కృషి చేసుకోవడం తప్ప, తదితరుల మంచి చెడ్డల్ని గుర్తించరు.

సమైక్యం అంటే ఏమిటి? ప్రజలంతా తమ స్వభాషలను వదిలేసి ఒకే భాష మాట్లాడడమా? ఒకే ఆలోచన చెయ్యడమా? ఒకే మతాన్ని అనుసరించడమా? ఒకే పదార్థాన్ని తినడమా? ఒకే రకం పంటను పండించడమా? ఒకే రకం బట్టను కట్టడమా? ఏమిటి? ఎందులో సమైక్యం?

సమైక్యం అంటే ఇదేదీ కాదని గుర్తించండి. ఎవరి భాష వారిది, ఎవరి విశ్వాసం వారిది, ఎవరి అభిరుచి వారిది, ఎవరి ఆనందం వారిదిగా ఉంటూ అందరూ పరస్పర గౌరవ మర్యాదలతో కలిసి బ్రతకడమే సమైక్యం.

మనిషికీ మనిషికీ మధ్య వైవిధ్యం ఎంత ఎక్కువగా ఉంటే, మానవ మనీష అంత బహుముఖంగా వికసిస్తుంది. తోటలో ఎన్నోరకాల పువ్వులు, ఫలాలు లభిస్తాయి. ఎన్ని ఎక్కువ రకాల వాద్యాలుంటే, అంత ఎక్కువ పుష్టిని సంగీతం సంతరించు కొంటుంది. కావలసినన్ని వాద్యాలూ ఏకవాద్యమే ఉండడం కాదు.

నీ పొరుగువాడు ఏ మతం వాడైనా సరే, ఏ దేశం వాడైనా సరే, ఏ వర్ణం వాడైనా సరే, ఏ భాష మాట్లాడే వాడైనా సరే - అతని కష్ట సుఖాలలో నీవు భాగం పంచుకోవడమే సమైక్యం.

అతణ్ని నీ మార్గానికి మార్చడమో, నీవు అతడి మార్గానికి మారడమో సమైక్యం కాదు. అట్టి మార్పు మానవ ప్రతిభను అరికడుతుంది. మానవతా వికాసాన్ని కుంటు పరుస్తుంది.

## 205

**మా**నవుడు ఆశాజీవి అనే సత్యాన్ని మరవకండి. తోడి మానవుల కంటె తాను అధికుడుగా వికసించాలని ప్రతి మానవుడూ ప్రయత్నిస్తాడు. చెట్టు కొమ్మలలో తానే బాగా ఎదగాలని ప్రతి కొమ్మా ప్రయత్నిస్తుంది. అయితే, ఒకదాని కొకటి అడ్డం రావు. ఒక దాని చావుకు మరొకటి కారణం కావు.

తన పొరుగువాడు సుఖంగా బ్రతకడానికి కావలసిన కనీసపు అవసరాలకు అడ్డం రాకుండా, స్వయం వికాసానికి నిరంతరం కృషి చెయ్యడమే మానవుడు అనుసరించ వలసిన మార్గం. అదే మానవ ధర్మం. అట్టి ధర్మం కోసమే మన పోరాటం.

ఆశను, పేరాసను మన్నించవచ్చు. అవి లేనిదే పురోగమనం లేదు. దురాశను మాత్రం సహించకండి. మరొక మానవుడికి అన్యాయం చేసి తాను బాగుపడా లనుకొనేదే దురాశ. అది ఎక్కడ కనిపించినా, వెంటనే రూపుమాపండి.

## 206

వజ్రాన్ని సానపట్టాలి. బంగారాన్ని చింత బొగ్గుల వేడిలో కరిగించాలి. భూమిని దున్నాలి. బాలకుణ్ణి శిక్షించాలి. దండనం దశగుణం భవేత్.

త్యాగం చెయ్యకుండా, ఆత్మ శిక్షణ లేకుండా ఏ మంచి పనీ జరగదు.

బుద్ధుడు, క్రైస్తు, వివేకానందుడు, గాంధీ, అంబేద్కరు వంటి మహా పురుషుల జీవితాలను పరిశీలించి చూడండి!

ప్రాపంచక వ్యామోహాలను నిరసించి - సుఖ భోగాలను పరిత్యజించి - మాలమాదిగల ఉద్ధరణ కోసం, దళిత జాతుల అభ్యుదయం కోసం, దేశ సౌభాగ్యం కోసం, ప్రపంచ ప్రజా సమైక్యం కోసం, తమ జీవితాలను సమర్పించడానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా?

ఉంటే-

ఆంజనేయుడు, భీష్ముడు, వివేకానందుడు వంటి మహామహుల వలె నిత్య బ్రహ్మచారిగా, నిరంతర ప్రజా సేవకునిగా, ప్రాణాలను తృణప్రాయంగా పరిగణించి, విశ్వ జనోద్ధరణ మహాయజ్ఞంలో పాల్గొనగలిగే తాహతు ఉన్నదా?

ఉంటే-

అలాంటి వారు ముందుకు రండి. అలాంటి వ్యక్తి, జిల్లా కొక యువకుడు, ముందుకు వచ్చినా - మరొక పది సంవత్సరాలలో భారత మాతను ప్రపంచ మాతనే చెయ్యగలం! కుల మత వర్గ రహిత మహా మానవ సమాజాన్ని రక్తపాతం లేకుండా, శాంతి యుతంగా నిర్మించగలం.

ఆర్య సనాతన మత స్థాపకులై, దేహబలాన్నీ, బుద్ధి బలాన్నీ, నీతి బలాన్నీ కూడ మించిన యుక్తి బలానికి ఓడిపోయి, అంత్యజులుగా శిక్షించబడి, అన్యాయం చేయబడ్డ - ఓ మాలమాదిగ, వెనుకబడ్డ ప్రజలారా! చచ్చారా? బ్రతికి ఉన్నారా?

బ్రతికి ఉంటే - ముందుకు రండి! మానవాభ్యుదయానికి నాయకత్వం వహించండి !

## 207

అన్ని మతాలు ఒకే దైవ ధర్మాన్నీ, ఒకే మనుజ ధర్మాన్నీ ప్రతిపాదిస్తున్నప్పుడు – ఏ మతమైతేనేం? అందువల్ల – మతం విషయమే మనకు వద్దు.

మానవుడి కంటికి చీమలు ఎలా కనిపిస్తాయో, భగవంతుడి కంటికి మానవులు అలా కనిపించవచ్చు. ఎర్ర చీమలు, తెల్ల చీమలు, నల్ల చీమలు, చలి చీమలు, కండ చీమలు ఈ మానవ జాతులు. వీటిని భగవంతుడు అసలు గుర్తించి ఉంటాడని నేన నుకోను. ఈ మహా విశ్వంలో మన మానవ లోకం ఒక చీమల పుట్ట కంటె చిన్నదనే సత్యాన్ని గుర్తించండి.

అందువల్ల ఏ అతీత శక్తుల మీదా, ఏ బాహ్య సహాయం మీదా మనం ఆధారపడకూడదు. మనం మానవులుగా బ్రతకాలంటే పౌరుషంతో బ్రతకాలి. విద్య, విజ్ఞానం, కళ – ఈ త్రిమూర్తి రూప సరస్వతిని ఆరాధిస్తూ, ఆనందంతో బ్రతకాలి.

అసమర్థులకు ఆనందం లేదని తెలుసుకోండి. నిరానందంగా బ్రతికేవాడు మానవుడే కాదని గుర్తించండి. నిజమైన జీవితం ఒక నిరంతర పోరాటమన్న సత్యాన్ని అవగాహన చేసుకోండి.

## 208

సోషలిజం, ప్రజా సోషలిజం, సంయుక్త సోషలిజం, విప్లవాత్మక సోషలిజం, ప్రజాస్వామిక సోషలిజం, కమ్యూనిస్టు సోషలిజం, జాతీయ సోషలిజం – ఇలా ఎన్నో పేర్లతో పార్టీలు ఏర్పడడం ఎందుకు? ప్రజాభ్యుదయం కోసమా?

ఒకే లక్ష్య సాధనకు ఇన్ని పార్టీలు అవసరమా? కానే కాదని గుర్తించండి. ఈ పార్టీలన్నీ కొందరు వ్యక్తుల న్యాయకత్వాల కోసమూ, అధికారాల కోసమూ మాత్రమే. కులం వర్గం నిర్మూలించబడి, మత ప్రమేయం విస్మరించబడి, వస్తు ద్రవ్య ఉత్పత్తి అంతా జాతి పరం చెయ్యబడి, నిరుద్యోగ వృద్ధాప్య భత్యాలు ఏర్పాటు చెయ్యబడి, ఉచిత విద్యా వైద్య సౌకర్యాలు కల్పించబడి – సమస్య జీవిత రంగాల లోను మానవుడు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సమాన గౌరవ మర్యాదలను అనుభవిస్తూ

- అభిరుచిని బట్టి అభ్యుదయం పొందడానికి వీలుండే సామాజిక వ్యవస్థే సోషలిస్టు వ్యవస్థ.

ఈ దేశంలో ఇట్టి వ్యవస్థను మీరు తప్ప మరెవరూ నిర్మించజాలరు.

ఆలస్యం జరిగినా, అవస్థలు చుట్టు ముట్టినా అధైర్య పడకండి. ఎంతటి కారు చీకటి అయినా భయపడకండి. ముందుకు దూసుకుపోండి. సౌఖ్య సూర్యోదయం ఎంతో దూరంలో లేదు.

నిజమైన జీవితం ఒక నిరంతర పోరాటం. ధర్మం ఒక జీవన స్రవంతి. ధర్మం కోసం పోరాటమే మానవ ప్రగతి.